# అమృతవర్షిణి


నాటికల సంపుటి

డా॥ అమృతలత

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Telangana Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

No. తె. సా. ప/అధ్యక్షులు/2015/1020 తేది : 15-09-2015.



డా॥ అమృతలతగారికి,

మీరు రచించిన 'అమృతవర్షిణి' పుస్తకం అందింది. సంతోషం.

మీరు గతంలో నడిపిన 'అమృత్‌కిరణ్' పక్ష పత్రికలో వివిధ అంశాలపై రూపొందించిన సంపాదకీయాలను ఇప్పుడు మరొకసారి 'అమృత్‌కిరణ్' పేరుతో గ్రంథ రూపంలో ప్రచురిస్తున్నందుకు నా హర్షాన్ని ప్రకటిస్తూ మీ ఇతోధిక రచనా శక్తికి నా ఆశీరభినందనలు అందజేస్తున్నాను.

ఉంటాను.

(డాక్టర్ సి.నారాయణరెడ్డి)

# అద్భుతమైన రాగం .... 'అమృతవర్షిణి' !



*డా॥ యస్.పి. బాలసుబ్రహ్మణ్యం*

అమృతవర్షిణి ఓ అద్భుతమైన రాగం! సంగీత జగత్తుని ఓలలాడిస్తుంది !

సాహితీ రంగంలో అమృతలతగారి 'అమృత వర్షిణీ' అంతే !

ఆ కలం నుండి జాలువారిన భావాలు మనల్ని నిలువునా తడిపేస్తాయి! గుండెల్ని- 'తడి'చేస్తాయి!

అలా తడిసిన ఏ గుండెకీ.... ఇహ ఎండిపోవాలనిపించదు, ఆ ఆర్ద్రతతో ఎప్పుడూ అలాగే వుండిపోవాలనిపిస్తుంది!

ఆమె రాసిన సంపాదకీయాల్లో - హృదయాల్ని మేల్కొల్పే భావాలు ఎన్నో వున్నాయి.

కొటేషన్స్‌లా మన నాలుకల మీద నడయాడాల్సిన వాక్యాలు కోకొల్లలు!

ఉదహరిస్తే -

- వందతిట్లు చేయించలేని పనిని చిన్న ప్రశంస చేయిస్తుంది.

- పైసా ఖర్చులేకుండా... పదినిమిషాల్లో.... ప్రజల నాలుకల మీదుగా ప్రపంచాన్ని చుట్టివచ్చే ప్రచారసాధనం - గాసిప్స్!

- ఏదో మొక్కుబడిగా పని చేస్తూ... ఎప్పుడూ గడియారం మీద దృష్టి నిలిపేవ్యక్తి ఏ విజయాన్నీ సాధించలేడు !

- మనిషి బ్రతకడానికి కావలసిన కనీసావసరాలు ఎన్నో అయితే... 'మనసు'ని బ్రతికించే ఏకైక ఔషధం... 'ఆప్యాయత'.

- సోమరితనం, ఉదాసీనతల 'చెద' సోకితే... ఏ 'ఇజం' అది ఎంత గొప్పదైనా సరే మొదలంటా కుప్పకూలిపోతుంది !

- ఏ పనీ చేయకుండా... ఎప్పుడూ ఏ వాలు కుర్చీలోనో, మడతమంచంలోనో పడుకుని... నక్షత్రాలను లెక్కిస్తూ కాలం గడిపే మనిషి... బ్రతికి ఉండీ 'పాడె' మీద పడుకున్న 'శవం'తో సమానం!

ఇలా చెప్పుకుంటూ పోతే - ఎంతైనా చెప్పుకోవచ్చు కానీ... కాలాతీతమూ, స్థలాభావమూనూ !

ఎక్కడ కన్విన్సింగా చెప్పాలో - ఎలా తట్టిలేపాలో - ఎప్పుడు చెంపపెట్టు పెట్టాలో- దేన్ని కుండబద్దలు కొట్టాలో - అలా ఏ భావాన్ని ఎలా చెప్తే పఠితలు బాగా అర్థం చేసుకుంటారో, ఆ భావాన్ని అలా స్పృశించడం - ఆమెకే చెల్లింది !

***ఆమె సంపాదకీయాల్లో -***

***మనసు పొరలను - మూలమూలల నుండీ స్కాన్ చేసి - ఏ మూల ఏ రోగముందో - దానికి మందేమిటో కూడా చెప్పే - ఓ సైకాలజిస్ట్ కన్పిస్తాడు!***

ముఖ్యంగా నన్ను పట్టి కుదిపేసిన వాక్యాలు -

'ఒక్కచూపు.... చిన్నమాట... చిరునవ్వు చాలు - అభినందన తెలియజేయటానికి!'

'కార్లూ, బంగళాలూ, అందం, డిగ్రీలూ ఏవీ ఇవ్వలేని 'డిగ్నిటీ'.... మనిషికిచ్చేది... ఆ వ్యక్తి వినమ్రత!'

ఇవి చాలు - రచనలోని హుందాతనాన్ని గ్రహించటానికి !

అలాగే -

ఒకచోట - 'తృప్తి అరచేతిలో పాదరసంలాంటిది. దొరికినట్టే దొరికి చేజారిపోతుంది!' అన్నారు. నిజం, తృప్తి స్వభావమే అంత ! ఒడుపుగా దాన్ని పట్టుకుని - సదా కట్టేసుకునే మనస్తత్వాన్ని మనం అలవరచుకోవాలి !

ఒకమాట -

నా దృష్టిలో మనదేశం ప్రగతి సాధించకపోవటానికి కారణాలు - రెండే రెండు!

ఒకటి అధిక జనాభా ! రెండోది మనుషుల్లో 'శ్రమ - అంకితభావం - నిజాయితీ' లోపించడం! ఈ రెండో విషయాన్ని - మూడు సంపాదకీయాల్లో 'క్లోజప్'లో చూపించారు రచయిత్రి !

మరోమాట -

ఇది నామాటగా అందరికీ చెప్పే ఓ మాట :

(ఇలా మాటల్లో చెప్పటం - దూరదర్శన్ ద్వారా బాగా ఒంటబట్టింది! - ఇపుడు రాతల్లో కూడా నాలుగు ముక్కలు చెప్పి - ముగిస్తాను)

★ 'నేను మనిషిని' అని తనపై తనకి నమ్మకమున్న
ప్రతి మనిషీ తప్పక చదవాల్సిన పుస్తకం -
అమృతవర్షిణి !

★ 'బాగుపడాలి' అనుకునే వాళ్ళకి బాగా ఉపకరించే
పఠనీయ గ్రంథం - అమృతవర్షిణి !

ఇంకా చెప్పాలంటే -


★ ప్రతి వ్యక్తికీ నిత్యపారాయణ గ్రంథాల్లో ఒకటిగా
చేర్చుకోదగిన పుస్తకం -అమృతవర్షిణి !

ఇంకేం చెప్పనూ ?

ఇక -

ఈ అమృతవర్షిణిలో నిలువెల్లా తడవాల్సింది మీరు !

మరొక్కమారు...



# ప్రశంస



## యండమూరి వీరేంద్రనాథ్

నేను 'ఆనందో బ్రహ్మ' వ్రాసే రోజుల్లో ఒక పద్యం కావల్సి వచ్చింది. ఆ నవలలో కథానాయకుడు తన నత్తిని జయించాడు. ఆ సందర్భంగా ఒక పద్యం ఆశువుగా చెప్పాలి. నత్తివానికి 'క్ష , హ' పలుకవు. ఆ అక్షరాల ఆధారంగా కావాలి. అదీ మరో రెండ్రోజుల్లో (ఆంధ్రభూమిలో సీరియల్ కోసం) కావాలి !

తిరుపతిలో ఆంధ్ర మహిళా కళాశాలలో సభ. అధ్యక్ష స్థానంలో జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు. మైకు దగ్గర మాట్లాడటానికి వెళ్తూ, పక్కన కూర్చున్న ఆ పండితోత్తముల్ని పద్యం వ్రాసిమ్మని అడిగాను. నేను వుపన్యాసం ముగించి వచ్చేలోపులో.... "రక్షా రక్ష కటాక్ష వీక్షణా దక్షత...." అంటూ వ్రాసిచ్చారు. తొలిసారి ఒకరికి పాదాభివందనం చేసిన సందర్భం అది !

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే...

చిన్న వారిని మెచ్చుకుంటే అది 'ప్రశంస' అవుతుందనీ, పెద్దవారి దగ్గర అది 'కాకా' అవుతుందనీ రచయిత్రి అన్నారు. పెద్దవాళ్ళు గానీ, చిన్నవాళ్ళు గానీ ఒక అద్భుతమైన పనిచేసినపుడు దాన్ని పొగిడితే అది కాకా అవదు. వారితో మనకి అవసరం వుండి, నాసిరకం దాన్ని

కూడా మెచ్చుకుంటే, అప్పుడది కాకా అవుతుంది.

అమృతలతగారు నాకంటే చిన్నవారు కాబట్టీ, నాకామెతో ఎటువంటి అవసరమూలేదు కాబట్టీ, ఈ పుస్తకం పాపయ్య శాస్త్రిగారి పద్యమంత బావున్నది కాబట్టీ, దీనికి 'ప్రశంస'అని పేరు పెట్టాను.

మనిషి - మనీషి - ఋషికీ - తేడా వివరించిన విధానం నుంచీ, గుర్తింపు - గ్లామర్ - గౌరవానికీ మధ్య వ్యత్యాసం విపులీకరించిన తీరు వరకూ... ఈ రచయిత్రిలో పరిశీలనాశక్తి ఒక ఇంద్రధనస్సులా కనబడుతుంది. ఈమె వ్యక్తిత్వ వికాస పుస్తకాలు వ్రాయకపోవటం మాలాంటి రచయితల అదృష్టం ! ఇందులో 'సహాయం' అన్న ఆర్టికల్ చదివితే, ఆ విషయం స్పష్టంగా అర్థమవుతుంది ! "Your intensions do not matter. The result matters..." అన్న భావాన్ని మొదటిసారి వింటున్నాను. నిజమేకదా !

" మనిషికి చల్లదనాన్నిచ్చే
వెన్న
వెన్నెలే
మానవత్వం....!"

ఎంత బావుందో చూడండి. ఇలాంటిదే మరొక పరిశీలన... 'బిడ్డ... తన మీద తనకి నమ్మకం పెరిగేకొద్దీ తల్లి వాత్సల్యం పరిధినుంచి ఒక్కొక్క అడుగే దూరం వెళ్ళటానికి ప్రయత్నిస్తుంది.' I am O.K - you are not O.K అన్న ట్రాన్సాక్షనల్ అనాలిసిస్‌ని ఇంత చక్కగా చెప్పటం నేనింతవరకూ వినలేదు. అందుకే ఈ ప్రశంస !

ఇదంతా మొక్కుబడికి వ్రాయలేదు. చదివిచూడండి. ఈ చిన్న పుస్తకంలో రకరకాల మనస్తత్వాలూ, అవగాహనలూ, అవగాహనా లోపాలూ, ఆప్యాయతలూ, నొసలు విరుపులూ... మొత్తం ప్రపంచం కనబడుతుంది.


అందుకే - ముందుమాటలు వ్రాయటానికి వెనకడుగు వేసే నేను, దీనికీవిధంగా ముందుకు రావటం... !

కుతూహలానికీ గాసిప్‌కీ వున్న అనుబంధాన్నీ -

నమ్రతకీ స్వాభిమానానికీ వున్న తేడానీ -

చక్కగా, ముచ్చటగా, మూడు పేరాగ్రాఫుల్లో వివరించగలిగిన సామర్థ్యం వున్న రచయిత్రి అమృతలత !

తన కలం నుంచి ఆమె మరింతగా అమృతాన్ని కురిపించాలని ఆశిస్తూ.....



# కృతజ్ఞతలు



అమృతలత

సాహితీ జగత్తుకు నిలువెత్తు కావ్యాలను అందించి, గీత రచయితగా సినిమారంగంలో గగనాంతర సీమల ఎత్తుకెదిగిన మహాకవి డా॥ సి. నారాయణరెడ్డి గారు.

స్త్రీపట్ల పురుషుని హృదయ స్పందనల్ని మాత్రమే కాదు, పురుషుడి పట్ల స్త్రీకుండే ఆరాధనా భావాన్ని... పరకాయ ప్రవేశం చేసి తెలుసుకున్నట్టుగా - హృద్యంగా తన గీతాల్లో ఆవిష్కరించి, ఆపాతమధురమైన సినిమా పాటల్ని ప్రేక్షక లోకానికి అందించిన సినారెగారు 'అమృతవర్షిణి'కి దాదాపు రెండేళ్ళ క్రితమే ఆశీర్వాదాలందించడం నా అదృష్టం! వారికి అంజలి ఘటిస్తున్నాను.

★★★

'పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా ?'

పాట మొదటిసారిగా విన్నపుడు - ఆ క్షణం అనుకున్నాను....

'నేనే వేంకటేశ్వరస్వామినైతే... ఆ పాటకి కరిగి బాలూ ముందు ప్రత్యక్షమయ్యేదాన్నేమో !'.... అని !

ఆ గొంతులోని 'ఆర్తి' అలాంటిది !

నాస్తికులు సైతం - ఆయన పాడిన భక్తి పాటలకి - ఆర్ద్రతతో పులకరిస్తారు.

తలమునకలయ్యేంత పనులతో - నిరంతరం బిజీగా ఉండే బాల సుబ్రహ్మణ్యంగారికి - తీరిక లభించడమే దుర్లభం ! అంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి - 'అమృతవర్షిణి'కి 'తొలిమాట' రాసారు. వారికి నా ధన్యవాదాలు.

★★★

కొత్తగా టీవీ వచ్చిన రోజుల్లో 'మహాభారత్' సీరియల్ వచ్చేది ! ప్రతి ఆదివారం - చుట్టుపక్కలవాళ్ళంతా టీవీల దగ్గర చేరి - ఆ సీరియల్ కోసం పడిగాపులు కాసేవారు ! ఆ రోజుల్లో మహాభారత్ చూడలేదని ఎవరి నోటైనా వింటే- అదో విడ్డూరం ! అలాగే యండమూరి రచనలు

పత్రికల్లో వస్తోన్న రోజుల్లో - ఆయన సీరియల్స్‌కోసం ఎంతోమంది పాఠకులు ఉత్సుకతతో ఎదురు చూసేవారు, చదవని పాఠకులని తోటివారు విచిత్రంగానూ చూసేవారు. నవలా ప్రపంచంలో ఆయన రేపిన సంచలనం అలాంటిది!

పాఠకుల మేధాశక్తికి పదునుపెట్టే కథనంతో - నవలా జగత్తుని ఉర్రూతలూపి - ఓ మలుపుతిప్పిన యండమూరి వీరేంద్రనాథ్ గారు... తన 'ప్రశంస'తో నాకు ఎనలేని ప్రోత్సాహాన్నందించారు. వారికి నా కృతజ్ఞతలు.

★★★

'బాలి'గారు గీసిన అందమైన ముఖచిత్రం, మెరుగు రాజేంద్ర ప్రసాద్, మన్నెం శారదగారు చివరి కవర్ పేజీలో గీసిన డిజిటల్ వర్ణచిత్రం ఈ పుస్తకానికి మరింత నిండుదనం చేకూర్చాయి. వారికి నా కృతజ్ఞతలు.

విజయ్ విద్యాసంస్థల నిర్వహణలో.... ఒక దశాబ్దం పాటు మరుగున పడిపోయిన నా రచనా వ్యాసంగం మీద మక్కువతో - నాతో పోరి - నన్ను ఒప్పించి, ఈ 'అమృత వర్షిణి' కి శ్రీకారం చుట్టిందీ - ఇది అందంగా రూపుదిద్దుకునేదాకా అహర్నిశలూ కృషిచేసిందీ - మాటవరుసకైనా పరుల గురించి నెగెటివ్ మాట్లాడని మిత్రులు, నిష్కల్మష హృదయులు ఎ. శంకర్ గారు. వారి రుణం తీర్చుకోలేనిది.

పుస్తక ప్రచురణలో అన్నిటికన్నా కష్టమైందీ... పంటికింద రాయిలా బాధించేదీ... ఆయా పుస్తకాల్లో అనుకోకుండా దర్శనమిచ్చే అచ్చుతప్పులు! ప్రూఫ్ రీడింగ్ ద్వారా నా పుస్తకాన్ని జల్లెడపట్టి - అచ్చుతప్పుల్ని ఏరిపారేసే కార్యక్రమాన్ని ఓపిగ్గా నిర్వహించిన తుర్లపాటి లక్ష్మి, కిరణ్‌బాల, ఎ. శంకర్, నెల్లుట్ల రమాదేవి, కె. విజయలక్ష్మి సహాయం వెలకట్టలేనిది.

రాత్రింబవళ్ళూ కృషిచేసి - ఎంతో ఓపికగా డీ.టీ.పీ చేసి పెట్టి - దీనికో అందమైన ఆకృతినిచ్చిన కృష్ణపతి, మదన్ ల సహకారం మరువలేనిది!

ఈ సంపాదకీయాలు 'అమృత్ కిరణ్' పక్ష పత్రికలో 'అమృత వర్షిణి' పేర ప్రచురించబడినపుడు స్పందించి- సమధికోత్సాహంతో పాల్గొని- తమ అమూల్య అభిప్రాయాల్ని వెలిబుచ్చిన పాఠకులకి నా ప్రత్యేక ధన్యవాదాలు.

ఇంకెందరో మహానుభావులు ! అందరికీ వందనాలు !!

01-09-2017

డా. అమృతలత

# అంకితం

మంచితనానికి పెద్దన్నయ్య...



స్వర్గీయ జి. భూమారెడ్డి

మానవత్వానికి చిన్నన్నయ్య...



శ్రీ జి. రాజారెడ్డి

మనోనిబ్బరానికి పెద్దక్కయ్య....



స్వర్గీయ పి. పద్మ

పట్టుదలకి చిన్నక్కయ్య....



శ్రీమతి పి. చిన్నమ్మ


ఆప్యాయతకి చెల్లి.....



శ్రీమతి యన్. విజయ

## ప్రతీకలు !

ఏ కోణంలోంచి చూసినా... తమ విశిష్ట వ్యక్తిత్వాలతో... 'మానవీయ విలువల'కు పట్టంగడ్తూ - ఈ రచనలకు స్ఫూర్తినిచ్చిన.... నా **తోబుట్టువులకి...**

ప్రేమతో... 

# ఏ చినుకు ఏ పేజీలో......


1. ప్రశంస ..................01

2. ఆత్మవిశ్వాసం.........2-3

3. టైమ్ సెన్స్ ............4-5

4. అభిమానం ...........6-7

5. భావవ్యక్తీకరణ .......8-9

6. ఆప్యాయత .........10-11

7. అందం ..............12-13

8. ప్రత్యేకత ............14-15

9. సహాయం ..........16-17

10. సంస్కారం .........18-19

11. మానవత్వం .......20-21

12. ప్రోత్సాహం .......22-24

13. మూర్తిమత్వం ....25-26

14. దాతృత్వం .........27-28

15. అభినందన ........29-31

16. ప్రదర్శన ..........32-33

17. ఆహ్లాదం ..........34-35

18. స్వేచ్ఛ .............36-38

19 ఆశావాదం ........39-41

20. ప్రతిభ .............42-43

21. దృష్టి ..............44-46

22. సభ్యత ............47-48

23. శ్రమ ...............49-50

24. అంకితభావం ....51-53

25. నిజాయితీ .........54-55

26. సాంత్వన ..........56-57

27. మౌనం .............58-59

28. చొరవ ..............60-61

29. సానుభూతి .......62-64

30. స్పృహ .............65-67

31. విమర్శ ............68-70

32. నిగ్రహం ............71-72

33. సమన్వయం ....73-75

34. కుతూహలం .....76-77

35. తృప్తి ...............78-80

36. నమ్మకం ...........81-82

37. నమ్రత ............83-85

38. అధికారం ....... 86-89

39. గౌరవం .......... 90-94

40. ప్రేమ ..............95-98

41. బాధ్యత ...........99-101

42. దేశభక్తి .........102-104

43. ధైర్యం ..........105-107

44. వ్యాఖ్య ...........108-111

45. మార్పు ...........112-115

★ స్పందన (పాఠకుల లేఖలు) 116-138




# ప్రశంస

ఎప్పుడూ మనకింది ఉద్యోగుల్ని తిట్టడమే తప్ప, అవసర మైనప్పుడు కూడా వాళ్ళని మెచ్చుకోలేని 'మాటల పిసినా రులం' మనం !

రోజంతా కష్టపడే ఉద్యోగి తన బడలికనీ, శారీరకశ్రమనీ 'గుడ్' అన్న చిన్న ప్రశంసతో మరిచిపోతాడు !

వంద తిట్లు చేయించలేని పనిని ఒక్క చిన్న ప్రశంస చేయిస్తుంది !

ఉద్యోగులకీ, పిల్లలకీ అప్పుడప్పుడూ ప్రశంస అనే 'టానిక్' ఇవ్వకపోతే వాళ్ళు బొత్తిగా నిస్సత్తువుగా తయారవుతారు !

మరో విషయం.....

మనకింది వాళ్ళని మనం మెచ్చుకుంటే అది ప్రశంస అవుతుంది ! అదే ప్రశంసని మనం మన పై అధికార్ల దగ్గరో... పెద్దవాళ్ళ దగ్గరో పదే పదే ప్రయోగిస్తే అది 'కాకా' అవుతుంది!

ఈ చిన్నతేడాని గమనించకపోతే మరీ ప్రమాదం !

16-11-1994



# ఆత్మవిశ్వాసం

మనం ఎదుటివాళ్ళ తెలివితేటల్ని మనకి తెలీకుండానే అతి తక్కువగానో - మరీ ఎక్కువగానో అంచనా వేస్తూ ఉంటాం!

ఒకప్పుడు....

మనం చిన్నచూపు చూసినవాళ్ళు, ఎందుకూ పనికిరారనుకున్న వ్యక్తులు జీవితంలో బాగా పైకి రావడం...

తెలివైన వాళ్లూ, మేధావులూ అనుకున్న వ్యక్తులు ఎందుకూ కొరగాకుండా పోవడం... చూస్తూనే ఉంటాం !

ఏ వ్యక్తికైనా కేవలం తెలివితేటలు వున్నంత మాత్రాన సరిపోదు. ఆ వ్యక్తికి తను చేసే పనిపట్ల ఓ కమిట్‌మెంట్, రాత్రింబవళ్ళూ కష్టపడే మనస్తత్వం ఉండాలి.

'నీ పనిమీద నీకు గల అభిమానమే నీ విజయానికి రహస్యం' అన్నాడు ఆర్థర్ కోస్లర్.

ఏదో మొక్కుబడిగా పని చేస్తూ... ఎప్పుడూ గడియారం మీద దృష్టి నిలిపే వ్యక్తి ఏ విజయాన్నీ సాధించలేడు !

ఏ పనీ చేయకుండా ఓవవర్‌నైట్లో... ఏ టాటానో, బిర్లానో కావాలని కలలు కంటూ కూర్చునే యువత దేశాన్ని నిర్వీర్యం చేస్తుంది.

**'నేనీ పని చేయగలను'** అనుకుంటే అది ఆత్మవిశ్వాసం!

**'నేను ఏ పనైనా చేయగలను'** అనుకుంటే... అది అహం భావం!

**'నేను తప్ప వేరెవరూ ఈ పని చేయలేరు'** అనుకుంటే.... అది అహంకారం !

అహంభావం, అహంకారాన్ని అదుపులో పెట్టుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే యువత.... మన జాతికిప్పుడు సారథి కావాలి!



01-12-1994




# టైమ్ సెన్స్

మన దగ్గరికి తమ అవసరాలకోసం ప్రతి రోజూ ఎంతో మంది వ్యక్తులు వస్తూ పోతూవుంటారు ! అవసరం వాళ్ళది కదా అని మనం తాపీగా మన బంధుమిత్రుల్తో బాతాఖానీ వేస్తూనో, తీరుబడిగా ముస్తాబవుతూనో, వాళ్ళని గంటలతరబడి మన వాకిట్లో పడిగాపులు కాచేలా చేస్తూ వుంటాం !

అది చాల్లేదని...

ఇంట్లో ఉండీ, ఒంట్లో బాలేదనో... ఇప్పుడు కలవడం కుదర్దనో చెప్పి దర్జాగా గుర్రెట్టి పడుకుంటాం !

అయితే....

మనం కూడా మన అవసరార్థం... ఎవరి దగ్గరికైనా వెళ్ళినపుడు... మనక్కూడా అలాంటి చేదు అనుభవాలే ఎదురై.... అసహనంగా ఫీలవుతూ లోలోపల తిట్టుకుంటామన్న విషయం మనం గ్రహించకపోవడమే విడ్డూరం!

మన గొప్పకోసం, భేషజం కోసం మన దగ్గరికి వచ్చిన వాళ్ళని మన చుట్టూ పదే పదే తిరిగేలా చేస్తూ... వాళ్ళ

సహనాన్ని పరీక్షించకుండా, వాళ్ళక్కావలసిన పనేదో వెంటనే చేసి పంపిస్తే... కనీసం ఎదుటి వాళ్ళ సమయాన్ని వృథా పుచ్చలేదన్న సంతృప్తయినా మనకు దక్కుతుంది !

అలా అని...

ఒకరు మన దగ్గరికి రావాలన్నా.. మనం ఒకరి దగ్గరికి వెళ్ళాలన్నా... ముఖ్యంగా.... ఎదుటి వాళ్ళకి వాళ్ళ కాలకృత్యాలు తీర్చుకోవడానికికూడా మనం అవకాశమివ్వ కుండా... ఉదయం తొమ్మిదికి ముందో, సాయంత్రం ఆరుగంటల తర్వాతో వెళ్ళి, వాళ్ళ 'ప్రైవసీ'కి భంగం కల్గించడం- పనైంతర్వాత కూడా గంటల తరబడి వాళ్ళతో హస్కవేస్తూ...తద్వారా ప్రతి మనిషికీ ప్రతిక్షణమూ అమూల్యమైన ఈ స్పీడ్ యుగంలో... ఎదుటి వాళ్ళ టైమ్ వేస్ట్ చేయడం... భావ్యం కాదు!

16-12-1994



# అభిమానం

మన పిల్లలపట్ల మనకి అభిమానం, వాత్సల్యం వుండటంలో తప్పేమీలేదు !

కానీ.... ఆ అభిమానంలో నిండా కూరుకుపోయి, బయటవాళ్ళొచ్చి, మన పిల్లల గురించి ఏదైనా చెడు చెప్తే 'అభిమాన' పడి... 'మా పిల్లలు అలాంటి వాళ్ళుకార'ని మనం వెనకేసుకురావడం.... దురభిమానం !

మన ఫ్రెండ్స్‌పట్లో, పిల్లలపట్లో మనం దురభిమానం ప్రదర్శిస్తున్నంత కాలం... మనల్నెవరూ అభిమానించరు !

పోతే...

మనల్ని ఎవరైనా కించపరిచినపుడు... 'అభిమానం, ఆత్మగౌరవం' దెబ్బతిందంటూ గగ్గోలుపెట్టేమనం... ఎదుటి వాళ్ళని కించపరిచేలా మాట్లాడకూడదని ఆలోచించకపోవడమే ఆశ్చర్యకరం !

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు... మందలిస్తేనే అభిమాన

పడి ఆత్మహత్యలకి పాల్పడే వ్యక్తులు ఆవేశపరులే తప్ప అభిమానధనులు కారు!

అలాగని...

మనల్ని పురుగుల్లా తీసిపారేసే మనుషుల పాదాల దగ్గర - వాళ్ళ 'కరుణా కటాక్ష వీక్షణాల'కోసం మన వ్యక్తిత్వాన్ని చంపుకుంటూ పడివుండటం... 'అభిమాన హీనత్వ'మే అవుతుంది!

అభిమానం, స్వాభిమానం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం.... ఏ పేరైతేనేం... అన్నీ 'అహం' దెబ్బతింటే.... బుసకొట్టే నాగులే!

అయితే....

రెండు వైపులా పదునున్న అహాన్ని ఒడుపుగా పట్టుకుని అదుపులో పెట్టుకోగలిగే మనిషే జీవితంలో ఉన్నత శిఖరాల్ని అధిరోహించగల్గుతాడు!

1-1-1995




# భావ వ్యక్తీకరణ

మనం అప్పుడప్పుడూ మన సన్నిహితుల్తో గానీ, స్నేహితుల్తో గానీ ఏదో ఒక విషయంలో వాగ్వివాదాలకు దిగి, వాళ్ళని నొప్పించడమో - మనం నొచ్చుకోవడమో జరుగుతూ ఉంటుంది!

సన్నిహితులూ, స్నేహితులూ ఐతే ఫర్వాలేదు.... వాళ్ళు నొచ్చుకున్నా, మనం నొచ్చుకున్నా... అసలు మనం ఏ ఉద్దేశంతో ఆ మాటలు మాట్లాడిందీ.... దానికి వాళ్ళెలా నొచ్చుకుందీ.. ఆ తర్వాత వివరణ ఇచ్చుకుంటాం..... అవసరమైతే క్షమాపణ అడుగుతాం!

కానీ... మరీ కొత్తవాళ్ళతో వాదనలకు దిగినపుడు మాత్రం.... మనం నాలుకను అదుపులో వుంచుకుని మాట్లాడ్డం చాలా అవసరం !

మనం ధారాళంగా మాట్లాడగలిగే మనుషులమైనపుడు.... కొన్నిసార్లు మనకి తెలీకుండానే అతిగా మాట్లాడటం జరిగి, ఆ మాటల్లో ఎక్కడో ఓ చోట... ఎవర్నో ఒకర్ని నొప్పించామన్న

విషయం తెలిసి... అవాక్కయి... భావవ్యక్తీకరణ ఎంత సున్నితమైన అంశమో తెలిసివస్తుంది!

నోరుందికదా అని కొందరు పిచ్చి పిచ్చి ప్రశ్నల్తో, ఎద్దేవాలతో, కవ్వింపు మాటలతో ఎదుటివాళ్ళని రెచ్చిపోయేలా చేస్తారు.

అయితే -

ఎదుటివాళ్ళ మాటలకి ఉడుక్కుని మాటకి పదిమాటలు అప్పగించి -వాతావరణం రొచ్చురొచ్చు చేసుకునే వాడు : .... మనిషి.

ఎదుటివాళ్ళ మాటలు తన మనసును అతలా కుతలం చేసినా.... తమాయించుకుని... సౌమ్యంగా సమాధానాలిచ్చే వాడు :...మనీషి.

ఎదుటివాళ్ళు తననెంత రెచ్చగొట్టినా ఏ ఉద్వేగానికీ లోను కాకుండా..... వాళ్ళనో పసివాళ్ళుగా భావించి, తాపీగా సమాధానాలిచ్చేవాడు: ...ఋషి.

మనిషి ఋషి కాలేడేమోగానీ, 'మనీషి' కావడానికి ప్రయత్నిస్తే... పరిసరాలన్నీ ఆహ్లాదభరితంగా తయారవుతాయి !

*16-01-1995*




# ఆప్యాయత

ఒకరు మనల్నిష్టపడ్తున్నారూ... మన మీద తమ ఆప్యాయ తానురాగాల్ని ప్రదర్శిస్తున్నారూ... మనకి తమ ప్రేమాభి మానాల్ని పంచిపెడ్తున్నారూ అంటే... మనమెంతటి నిరాశా వాదులమైనా... మరుక్షణం ఆశావాదులుగా మారి పోతాం !

మనిషి బ్రతకడానికి కావలసిన కనీసావసరాలు ఎన్నో అయితే... 'మనసు' ని బ్రతికించే ఏకైక ఔషధం... 'ఆప్యా యత'.

ప్రేమ జనించినపుడు ఒకలా... ద్వేషించినపుడు మరోలా కాకుండా, మన మంచి చెడులూ, బలహీనతల్నీ - కడుపులో దాచుకుని.... ఎలాంటి ఆరోహణావరోహణాల్లేకుండా - ఎప్పుడూ ఒకే స్థాయిలో ఎదుటి వాళ్ళకి తన ఆప్యాయతని పంచిపెట్టే మనిషి ముందు...మనకి తెలీకుండానే మోకరిల్లు తాం!

మన దైనందిన జీవితంలో రకరకాల సమస్యలతో నలిగి, కుమిలిపోయే సమయంలో... అది రవ్వంత ఆప్యాయతే అయినా... కొండంత ఉపశమనాన్ని కలిగిస్తుంది ! వెయ్యేను గుల బలాన్నందిస్తుంది!

'మల్లెపూల... చందనాల' కలబోత... ఆప్యాయత!

దీన్ని గుండెల్నిండా నింపుకొని ఎదుటి మనిషిపై కురిపించగలగడమూ ఓ కళే అయితే...

అది సృష్టిలోని కళలన్నిట్లోకెల్లా....

లలితమూ,

రసభరితమూ,

సర్వోత్కృష్టమూ అన్పించుకుంటుంది!

ఎదుటివాళ్ళ నుండి ఏదో ఆశించో.... తెచ్చి పెట్టుకున్నదో కాకుండా... మనసు అట్టడుగు పొరల్లోంచి ఊటలా విరజిమ్మే ఆప్యాయత.... మనసుని ఆర్ద్రం చేస్తుంది!


మనపట్ల శ్రద్ధ కనబరుస్తూ.... మన మీద ఈగవాలినా విలవిల్లాడే మనిషి... మన పరిసరాల్లో కనీసం ఒక్కరైనా వున్నారనుకుంటే... ఆ ఊహ ఒక్కటే మనల్నీ, మన మనసుల్నీ ఉల్లాసభరితంగా వుంచుతుంది!

అందుకే....

మన గుండెల్లో మనమీదా, మన వాళ్ళ మీదా పొంగిపొర్లే ప్రేమాప్యాయతల్లో.... కనీసం ఇసుమంతైనా వాటికోసం పరితపించే ఇతరులకీ అందివ్వగలిగితే...

అశక్తుడు శక్తిమంతుడవుతాడు !

భీరువు ధీరుడవుతాడు !



*01-02-1995*



# అందం

అందంగా ఉన్న మనిషినో, వస్తువునో, దృశ్యాన్నో చూసినప్పుడు మనకి తెలీకుండానే మనసు స్పందించి మరోసారి చూస్తాం! మళ్ళీ మళ్ళీ చూస్తాం ! అందానికా మహత్తు ఉంటుందనేది అందరూ అంగీకరించే నగ్నసత్యం!

'అందానికంత ప్రత్యేకత ఉంది కదా' అని మనమందరం మన దైనందిన జీవితంలో ఎప్పుడూ అందంగానే కన్పించడానికి ప్రయత్నిస్తాం!

అయితే-

ఆ ప్రయత్నంలో మనం మన వయసుని మించి నలభయ్యో ఏట టీనేజర్స్‌లా తయారైనా - పదహారేళ్ళ వయస్సులో ప్రౌఢలా తయారైనా - అతిగా అలంకరించుకున్నా - బొత్తిగా నిర్లక్ష్యం చేసినా - చూపరులకి ఎబ్బెట్టుగా, అమ్యూజింగ్‌గా, ఎక్సెంట్రిగ్గా ఉంటుంది.... లోలోపల నవ్వుకునేలాచేస్తుంది !

మన 'సహజమైన అందం' ఎదుటి వాళ్ళ చూపుల్ని తిప్పుకోనీకుండా చేస్తే - 'తెచ్చిపెట్టుకున్న అందం' చూపుల్ని తిప్పుకునేలా...మన 'సౌందర్య స్పృహ'... చూపుల్ని దించుకు

నేలా చేస్తుంది!

బండెడు నగలు దిగేసుకుని, పట్టు పీతాంబరాలు కట్టుకున్నంత మాత్రాన అందం కులుకుతూ వచ్చి మన ఒళ్ళో వాల్తుందనుకోవడం పొరపాటు!

ఎవరికైనా అందమనేది ధగధగలాడే పట్టు వస్త్రాలతోనో... జిగేల్మనే ఆభరణాలతోనో వచ్చేది కాదు......

మనిషికి నిజమైన అందం... ఆ మనిషి తాలూకు 'విజయం, సంస్కారం'.

ఈసురోమని కూర్చోకుండా - ఏ రంగంలోనైనా దూసుకుపోయి, విజయలక్ష్మితో తిరిగి వస్తే... మనిషి కురూపైనా సరే మన కంటికి నలకూబరుడిలాగే కన్పిస్తాడు!

ఒక వ్యక్తికి ఉండే....

డబ్బో, అధికారం, అందం....

అతడికో 'గుర్తింపు'ని మాత్రమే తెచ్చిపెడ్తే...

అతడి విజయం అతడికో 'గ్లామర్'నీ...

అతడి సంస్కారం... అతడికో 'గౌరవాన్నీ' తెచ్చిపెడ్తాయి!

పోతే...

మనం మనకి గౌరవాన్ని తెచ్చిపెట్టే దానికోసమో, గ్లామర్ని తెచ్చిపెట్టే వాటికోసమో ఆరాటపడ్తే.... 'అందం'గానీ...

కేవలం 'గుర్తింపు' కోసమే తాపత్రయపడ్తే.... చూసేవాళ్ళకి 'వికారం' పుడ్తుందని గ్రహించడం అవసరం !

16-02-1995




# ప్రత్యేకత

కొంతమంది ఎంతమందిలో ఉన్నా ఎంతో ప్రత్యేకంగా కన్పిస్తారు... అందరి అటెన్షన్‌కీ, ఆకర్షణకీ కేంద్రబిందువవు తారు!

అందుక్కారణం... వాళ్ళ అందమో.... అలంకరణో కాదు... వాళ్ళ విలక్షణమైన వ్యక్తిత్వం !

మనిషికి తనకంటూ ఓ ప్రత్యేకత లేకపోతే అతడు 'మనుషుల సమూహం' లో ఒకడైపోతాడే తప్ప.... ఏ వ్యక్తీ అతణ్ణి ప్రత్యేకంగా గుర్తుంచుకోడు !

అందుకే... ప్రతి వ్యక్తీ తనదైన 'ఇమేజ్' కోసం తాపత్రయ పడ్తాడు.

సంగీతంలో, సాహిత్యంలో, చిత్రలేఖనంలో, ఆటపాటల్లో, మేధస్సులో ఇంకా అనేకమైన ఇతర రంగాల్లో ఒక్కో వ్యక్తికీ ఒక్కో ప్రత్యేకత ఉంటుంది !

కాని... మనకి ప్రత్యేకతలెన్నున్నా.. మన ప్రవర్తన 'లేకి'గా ఉంటే... పంటికింది రాయిలా ఎదుటివాళ్ళను అది బాధి స్తుంది!

అయితే...

'ప్రత్యేకత' అనేది పువ్వుకి పరిమళం అబ్బినట్లు....

సహజంగా మనిషి వ్యక్తిత్వంలో అంతర్లీనంగా దాగి... ఆ వ్యక్తి చేసే ప్రతి పనిలోనూ ప్రతిబింబించాలి.

మాటల్లో, చేతల్లో, నడకలో, నవ్వులో ఎవరి శైలి వారిదే అయినా కొంతమంది వ్యక్తులు వేసే ప్రతి అడుగులో ఎక్కడో ఓచోట అలవోకగా తొంగిచూసే లాలిత్యం, హుందాతనమే నల్గుర్లో వాళ్లకో ప్రత్యేకత తెచ్చిపెడ్తుంది !

పోతే మన ఫీల్డ్‌లో మనమే గొప్పకదా అని... కన్నూమిన్నూ కానకుండా... ఎవర్నీ లెక్క చేయకపోతే... ఎదుటివాళ్ళు మన ప్రత్యేకతని నోటితో మెచ్చుకుని నొసటితో వెక్కిరిస్తారు !

అయితే ....

ఎన్ని ప్రత్యేకతలున్నా.... వినమ్రతలేని మనిషిని ఎవరూ అభిమానించలేరు !

కొందరి కంటికి...

'కాకుల మధ్య కోకిల' కి-ఏ ప్రత్యేకత కన్పిస్తుందో...

'కోయిలల మధ్య కాకి' కీ - అదే ప్రత్యేకత కన్పిస్తుంది!

అఫ్‌కోర్స్.... ఎవరి ప్రత్యేకత వాళ్ళదే అయినా ఆ ప్రత్యేకతల్లో తేడావుంటుంది! కాకుల మధ్య కోకిల 'ఓహో' అన్పించుకుంటే... కోయిలల మధ్య కాకి 'అయ్యో' అన్పించు కుంటుంది.

అందుకే...

ప్రత్యేకత పేర మనిషి నల్గుర్లో 'భేష్' అన్పించుకోవాలే తప్ప.... ఏదో ఒక ప్రత్యేకత వుంటే చాలనుకుని... ఏ ఖల్ నాయకుడో ఐ.... అందర్తో 'ఛీ' కొట్టించుకోకూడదు !



01-03-1995



# సహాయం

అందరితో 'మంచి' అన్పించుకోవడానికి... నల్గుర్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించడానికి.... మనకి తెలీకుండానే పడరానిపాట్లు పడ్తూవుంటాం!

ఎన్ని సాయాలు చేసినా ఏరు దాటాక తెప్ప తగలేసే మనషులున్న ఈ సమాజంలో... ఏ సాయమూ చేయకుండా 'మంచివాడ'నే ముద్ర తలకిందులు తపస్సుచేసినా లభించదని తెలిసి.... కొన్నిసార్లు ఎదుటివాళ్ళకి అవసరమున్నా లేకున్నా చిన్నపనో... చితక పనో చేసిపెట్టి... వాళ్ళ మెప్పు పొందాలని ఉవ్విళ్ళూరుతాం!

ఒకవేళ వాళ్ళు మనం చేసిన సాయం మరిచిపోతే - 'అప్పుడంత సాయం చేశాను... ఇప్పుడెలా మరిచి పోయాడో చూడండీ' అని నల్గుర్లో మనం చేసిన సహాయాన్ని గుర్తుచేసి మన 'అల్పబుద్ధి'ని చూపెడ్తాం!

**ఆవగింజంత పనిచేసి ఆకాశమంత గుర్తింపునాశించడం... కీర్తికాంక్ష.**

ఇంకొన్నిసార్లు... డబ్బు విరజిమ్మయినా కీర్తిప్రతిష్టల్ని కొనుక్కోవాలనుకుంటాం! మన వాళ్ళకి ఎడం చేత్తో ఎంగిలి విదిల్చడానికి ఇష్టపడని మనం... పరాయివాళ్ళకి మాత్రం

ఎడాపెడా దానాలు చేస్తాం! ఎవరూ చూడటం లేదనుకుంటే... పిల్లికి బిచ్చం పెట్టడానిక్కూడా నిక్కినీల్గే మనం... పరులు చూస్తున్నారంటే... వరాల సిరుల వర్షం  కురిపించడానికి సిద్ధపడ్తాం!

**ఇంటివాళ్ళు పిసినారులనుకున్నా ఫర్వాలేదు... బయటి వాళ్ళు మారాజు అనుకుంటే చాలనుకోవడం.... కీర్తిదాహం.**

మరికొన్నిసార్లు మనం... మనది కాని సొమ్ముతో ఎదుటివాళ్ళకి సాయం చేసి... ఆ కీర్తి ప్రతిష్టలు మనకే దక్కాలని కక్కుర్తిపడ్తాం! పోయేది మన సొమ్ముకాదు కాబట్టి.. మనకి తరిగేదేమీ వుండదని ఎక్కడలేని ఔదార్యం ప్రదర్శిస్తాం!

**ఎవరికో దక్కవలసిన కీర్తి ప్రతిష్ఠలు అడ్డదారుల్లోనైనా మనకే దక్కాలని వెంపర్లాడటం.... కీర్తి కండూతి!**

నిజానికి...

అసలైన పరోపకారులెప్పుడూ ఒకరి గుర్తింపు కోసం తాపత్రయపడరు సరికదా ఈ చేత్తో ఇచ్చింది ఆ చేతికి తెలీనివ్వకుండా జాగ్రత్తపడ్తారు!

పోతే...

ఎవరికీ ఏ సాయమూ... చేయకుండా కూర్చునేకన్నా -

అది...

కీర్తికాంక్షో...

కీర్తిదాహమో...

పేరేదైనా... ఏదో ఒకలా ఎదుటివాళ్ళని కనీసం జన్మకో శివరాత్రయినా ఆదుకోవడానికి ప్రయత్నించడమే... మనిషి... తోటి మనిషికి చేసే మహోపకారం!

*16-03-1995*




# సంస్కారం

మనలో కొందరికి అసాధారణమైన తెలివితేటలుంటాయి... తమ పేరు పక్కన కొండవీటి చేంతాడంత పొడవున డిగ్రీలుంటాయి! అయినా... అప్పుడప్పుడూ బుద్ధి గడ్డి తిని... కుళ్ళుబోతుతనంతోనో, ఈర్ష్యా ద్వేషాలతోనో ఎదుటి వాళ్ళ వ్యక్తిత్వాల మీద యథేచ్ఛగా బురద జల్లడానికే ప్రయత్నిస్తారు.

మనకేమీకాని వాళ్ళు మన గురించి అసందర్భపు ప్రేలాపనలు పేలినా.... కొంతవరకు సరిపెట్టుకుని... వాళ్ళని క్షమించగలమేమోగానీ...

మన ప్రాణానికి ప్రాణంలా మసలుకున్నవాళ్ళు... ఇతరుల ముందు చాటు మాటుగా... మన మీద లేనిపోని పుకార్లు పుట్టించి... గోతులు తవ్వడం...

వినేవాళ్ళు ముక్కు మీద వేలేసుకునేలా...

చెప్పేవాళ్ళ వ్యక్తిత్వాన్ని అసహ్యించుకునేలా.... చేస్తుందన్న స్పృహ... ఆ చెప్పేవాళ్ళకి లేకపోవడమే ఆశ్చర్యకరం !

ఎదుటి వ్యక్తితో 'మంచి'ని నటిస్తూ.... అతడి పరోక్షంలో అతడి గురించి 'చెడు' చెప్పడం.. మన కుసంస్కారాన్ని సూచిస్తే...

మనమీద 'చెడు' చెప్పే వ్యక్తి గురించి కూడా... 'మంచే'

చెప్పడం.... మన సంస్కారానికి అద్దం పడుతుంది.

కొందరుంటారు... వాళ్ళు తమకన్నా ముందుగా ఎవరైనా విజయపథంలో దూసుకుపోతున్నారన్న సంగతి తెలిస్తే చాలు... గాసిప్స్‌తోనో, స్కాండల్స్‌తోనో వాళ్లని పడగొట్టే సమయ సందర్భాల కోసం కాచుక్కూర్చుంటారు !

ఒక వ్యక్తి విజయాన్ని ఓర్వలేని మనుషులు... అతడి ఇమేజ్‌ని దెబ్బతీసే ప్రయత్నంలో.. నీచపుటెత్తుగడల్తో.... అతడి వ్యక్తిగత జీవితంలోకి ఎందరెందరో పాపరాజో (Paparazzo) లను సంధించి.... అతడి గుట్టు లాగడానికే చూస్తూ ఉంటారు! ఒకవేళ ఆ ప్రయత్నంలో ఏవీ దొరక్కపోతే... ఏ నీలాపనింద ల్తోనో అతడి మనసును అల్లకల్లోలంచేసి ఆనందిస్తారు!

అన్నింటికన్నా వింతైన విషయం... ఇతరుల ఆంతరంగిక విషయాల్ని లొట్టలేసుకుంటూ వినడానికిష్టపడే 'పెద్ద' మను షులు... ఇతరులెవరైనా తమ వ్యక్తిగత జీవితాన్ని అదే ఫోర్స్‌తో బజారుకి ఈడ్చినప్పుడు తమ మనసెంత 'చిన్న' బోతుందో... గ్రహించకపోవడం!

ఏదేమైనా...

సరసంలో 'ఆహా-ఓహో!' అని ఆకాశానికెత్తేయడం...

విరసంలో 'ఛీపో-పోపో!' అని పాతాళానికి తొక్కేయడం....

మన రాగద్వేషాలకి నిదర్శనం!

రాగద్వేషాల్లో 'సంయమనం' పాటించే మనిషి... సంస్కారపు తేజస్సుతో సభ్య ప్రపంచానికి అధినేత అవుతాడు!

*01-04-1995*




# మానవత్వం

రకరకాల రంగుల్లో... అందంగా విరబూసి, సుగంధ పరిమళాల్ని విరజిమ్మే పూలని చూసి స్పందించని మనసుండదు!

అదే క్షణాన....

ఆ పూలని కోసి పూరేకుల్ని కసకసా నలిపి, అవతలికి విసిరేసే కసాయి మనిషిని చూస్తూ.... మనసు చివుక్కుమనకుండా వుండదు !

మొగ్గ తొడిగి, మూడు రోజుల్లో వాడిపోయే పువ్వులాంటి 'జీవితం'... మనిషికి ప్రకృతి ప్రసాదించిన అన్ని వరాల్లోకెల్లా అమూల్యమైంది!

చిన్నముల్లు గుచ్చుకుంటేనే విలవిల్లాడే మనిషి... తోటి మనుషుల కుత్తుకల్ని కోయడానికి ఎలా సిద్ధపడుతున్నాడన్నదే అత్యంత ఆశ్చర్యకరమైన విషయం!

కులమత ద్వేషాలతోనో, వ్యక్తిగత కక్షలవల్లో, ఆస్తిపాస్తుల కొరకో, తను నమ్మిన 'ఇజం' కోసమో... ఒకర్నొకరు చంపుకోవడం..... హింసించుకోవడం.... పైగా దాన్ని సమర్థించుకోవడం.... ఇలాంటివన్నీ చాలా సహజమైన విషయాలుగా మనమంతా సరిపెట్టుకోవడం... మర్నాటికల్లా మరిచిపోవడం మన సిగ్గులేనితనానికి నిదర్శనం!

అన్నింటికంటే తమాషా.... చంపినవాడు మనవాడైతే కిక్కురుమనకుండా వుండే మనం... చచ్చినవాడు మన వాడైతే గుండెలు బాదుకోవడం !

పోతే...

కొందరుంటారు... వాళ్ళు పనిగట్టుకుని ఎదుటి వారి గుండెల్లో కత్తులు దించక్కర్లేదు..... మాటల ఈటెల్తో మనసుని తూట్లు పొడిచి.... చిత్రవధ చేస్తారు. ఇలాంటి వాళ్ళు పైకి సాత్వికంగా కన్పిస్తారే గానీ నిజానికి - పచ్చి నెత్తురు తాగే హంతకులకన్నా ప్రమాదకరమైవాళ్ళు!

అన్ని జీవరాసుల్లోకి ఉత్కృష్టమైన జన్మ ఎత్తినందుకైనా మనిషి తన తోటి మనుషుల కష్టసుఖాలకి స్పందించకపోతే - అతడు 'మనిషి తోలు' కప్పుకున్న మృగమవుతాడే తప్ప - మనిషి అన్పించుకోడు !


**మారణ హోమపు పొగలకి - సెగలకి ఉక్కిరి బిక్కిరై ఊపిరాడక - వడలి - వాడి పోతోన్న మానవాళికి - ఒకింత చల్లదనాన్నిచ్చే....**

**వెన్న....**

**వెన్నెలే...**

**మానవత్వం....!**

ఆ వెన్నని వెతికి - తూట్లు పడిన దేహానికో - గాయపడిన హృదయానికో పూసే మనుషులు - జాతికి రథసారధులైతే మనిషి మనసులోని రాక్షసత్వం సిగ్గుతో ఆత్మాహుతి చేసుకుంటుంది. ఎక్కడ చూసినా సర్వ మానవ సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుంది!



*16-04-1995*




# ప్రోత్సాహం

మనమీనాడు అత్యున్నత స్థితిలో ఉన్న చీఫ్ ఎగ్జిక్యూటివ్ లమో - నెంబర్ వన్ స్థానంలో ఉన్న బిజినెస్ టైకూన్లమో - కళాకారులమో కావచ్చు....

లేదా...

ఇంకెవరూ అందుకోని ఉన్నత శిఖరాలను అవలీలగా అధిరోహించి- అలవోకగా కిందికి చూస్తే - ఇన్నాళ్ళూ మనకి తమ అండదండలందించిన పాత మిత్రులందరూ... మన కళ్ళకి చీమల్లానో, దోమల్లానో కన్పించనూవచ్చు !

మనమీ స్థితికి వచ్చామంటే - పైకి... అది మన 'స్వయం కృషి' అని ఎంతచెప్పుకున్నా- ఒక్కో సంక్షోభంలో - ఎవరో ఒకరు మనకి చేయూతనందించి, 'ఫుట్ హోల్డ్'గా నిలిచి మన శిఖరావరోహణని సులభతరం, సుగమం చేశారన్న విష యం..... మనం అతి సులువుగా మరిచిపోనూవచ్చు !

ఒకానొకప్పుడు....

మనమేమిటో - మన ఉనికెక్కడో - మన గొప్పతనమే

మిటో... ఎవరికీ తెలీని సమయంలో... మనలో నిగూఢంగా దాగి ఉన్న టాలెంట్‌ని గుర్తించి, మనల్ని ప్రోత్సహించి - మన వెన్నుదట్టిన 'గాడ్‌ఫాదర్స్'ని ఆ తర్వాత పలకరించడం... మనకి నామోషీగానో... హోదాకి భంగకరంగానో... మనం భావించనూ వచ్చు.

కానీ....

**ప్రోత్సాహం....**

**కామన్‌మాన్‌ని 'సూపర్‌మాన్' చేస్తుంది!**

**కూరుకుపోతూన్న మనిషి పాదాలని నిలదొక్కుకునేలా చేస్తుంది!**

అసలెవర్నీ ప్రోత్సహించకుండా 'నిర్లిప్తం'గా వుండే మనుషుల కన్నా- ఎదుటివాణ్ణి అడుగడుగునా అధైర్యపరుస్తూ వాడి శక్తియుక్తుల్ని 'నిర్వీర్యం'చేసే మనుషులు... అతి ప్రమాద కరమైనవాళ్ళు!

పోతే...

తమని ప్రోత్సహించిన వాళ్ళపట్ల... మనుషుల్లో 'కృతజ్ఞత' లేకపోయినా సరిపెట్టుకోగలిగే మనం - 'కృతఘ్నత'ని చూసి నప్పుడు మాత్రం... భగ్గుమంటాం - సిగ్గుతో చితికిపోతాం!

**'కృతజ్ఞత' - మనిషి గుండెను అర్ద్రం చేస్తే.... 'కృతఘ్నత'- మనిషి మనసుని రగిలిస్తుంది !**

సరిగ్గా ఇలాంటప్పుడే....


ప్రోత్సాహం - ఎంత ప్రతిఫలాపేక్షలేనిదైనా - అపాత్రదాన మైందని బాధపడిపోతాం!

నిజానికి....

ఎదుటివ్యక్తిలో ఏ కాస్త 'స్పార్క్' ఉన్నా... దాన్ని నల్గుర్లో ఫోకస్ చేసే వ్యక్తి - ఎవరి గుర్తింపునీ, కృతజ్ఞతనూ, గురు దక్షిణనీ కోరుకోడు సరికదా-

తను వెలికితీసిన మాణిక్యాల తళతళలు చూసుకుని మురిసిపోతాడు!

మరుగునపడ్డ మరో వజ్రాన్ని సానపట్టేందుకు సంసిద్ధుడవుతాడు!



*1-5-1995*




# మూర్తిమత్వం

మన ప్రవర్తన, మనస్తత్వం, మాటతీరు, మనోనిబ్బరం మన 'పర్సనాల్టీ'కి అద్దం పడ్తాయి.

**ఏదేనా ఒక సమస్య ఎదురైనపుడు....**

-బెంబేలు పడి, బావురుమని ఏడ్చేసి... నీరుగారిపోయి... చుట్టూ ఉన్న పది మందినీ హైరానపెట్టి... చతికిలపడిపోయే వ్యక్తి : **'అర్భకుడు'** (Weak Personality)

- అసలా సమస్యే తనది కాదన్నట్టు... ఎలాంటి ప్రతిచర్యా లేకుండా నిస్తేజంగా... నిమ్మకి నీరెత్తినట్టుగా వుండే వ్యక్తి: **'జడుడు'** (Lethargic Personality)

-సమస్యల చిక్కుముడిని విప్పేందుకు తన శక్తి చాలకపోయినా... ఏవేవో కుయుక్తుల్తో... ఆత్మాభిమానానికి తిలోదకాలిచ్చి... అవసరమైతే పదిమంది కాళ్ళూ గడ్డాలూ పట్టుకునైనా సరే... ప్రతికూల పరిస్థితుల్ని సైతం తనకి అనుకూలంగా మలచుకునే వ్యక్తి : **'లౌక్యుడు'**(Diplomatic personality)

-సమస్య తాలూకు స్వరూప స్వభావాల్నీ, లోతుపాతుల్నీ

క్షుణ్ణంగా తెలుసుకొని ఏ కష్టానికీ జంకక... ఎవరి సహాయం ఆశించక... సాహస దుస్సాహసాలకి తేడా గ్రహించి... జయాపజయాలకి అతీతుడై.... లక్ష్యసాధనే 'లక్ష్యం'గా.... ఓ చైతన్యాస్త్రంలా దూసుకుపోయే వ్యక్తి:**'సాహసవంతుడు'** (Dynamic Personality)

అర్భకులు సమాజాన్ని ఈసురోమనిపిస్తే- జడులు సమాజాన్ని 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టు చలన రహితం చేస్తారు !

లౌక్యులు అవసరార్థం... నిర్లజ్జగా... తమ చిటికెన వేళ్ళమీద సమాజాన్ని ఆడించాలని చూస్తే - సాహసవంతులు సమాజానికి తను చిటికెన వేలినందించి,.. తమతో పాటు వడివడిగా ముందుకు నడిపించాలనుకుంటారు!

లౌక్యం తెలిసిన మనుషులు తమ హోదానీ, అధికారాన్నీ, తమకున్న పరిచయాల్నీ సైతం కేవలం తమ 'వ్యక్తిగత లబ్ధి' కోసం మాత్రమే ఉపయోగించుకుంటే....

సాహసవంతులు - తమ శక్తియుక్తుల్ని పదిమందికీ పనికొచ్చే పనులకోసం ధారపోస్తూ.... అవసరమైతే అర్భకుల భుజం తట్టి - జడుల జడత్వం - లౌక్యుల స్వార్థాన్ని కరిగించి - సమాజాభివృద్ధికి దోహదం కల్గించే పనులు చేస్తారు !

ఎక్కడ చూసినా సాహసవంతులే కన్పించే దేశం... సాటి దేశాల మధ్య ధృవతారలా తళుక్కుమంటుంది !

*16-5-1995*



# దాతృత్వం

మన చేతుల్లో విసనకర్ర ఉన్నప్పుడు.... ఫ్యాన్‌కోసం, ఫ్యాన్ దొరికాక ఎయిర్‌కూలర్ కోసం, ఎయిర్ కూలర్ వచ్చాక.... ఏసీ కోసం తాపత్రయపడ్తాం!

దాంతో.... ఇహ ఆ వస్తువు విషయంలో 'సాచురేషన్ పాయింట్'కి చేరుకుంటాం కాబట్టి... ఆ తర్వాత ఆ వస్తువు మీద నిర్లక్ష్యమో, నిర్లిప్తతో ఏర్పడి, మరో కొత్త వస్తువుకోసం ఆరాటపడ్తాం!

మన మెదడులో మనకి తెలీకుండానే ఎన్నో కోరికలు నిక్షిప్తమై వుంటాయనీ... ఒకటి తీరే కొద్దీ.... మరోటి ఊటలా పుట్టుకొస్తూనే వుంటుందనీ మనందరికీ తెలిసిన విషయమే!

అయితే....

మన ఒక్కో కోరికా.... ఒక్కో సాచురేషన్ పాయింట్‌కి చేరుకున్నాక, ఒకసారి వెనక్కి తిరిగి ఆలోచించి చూస్తే - మనకి నెరవేరిన కోరికలన్నీ కేవలం మనకీ... మన కుటుంబ సభ్యులకి మాత్రమే 'తృప్తి'నిచ్చాయా- లేక... మనకేమీ కాని ఇతర వ్యక్తులకు్కూడా 'ఆనందాన్ని'చ్చాయా.... తెలిసొస్తుంది!

మన కోరికల్లో కనీసం ఏ ఒక్కటైనా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మనకేమీ కాని పరాయి వాళ్ళకి లాభం చేకూర్చేదైతే.... మనకు అది వెయ్యి జన్మలకి సరిపడే 'తృప్తి'నిస్తుంది!

ఎన్ని కోట్లు సంపాదించినా... మనతోపాటు పూచికపుల్ల కూడా వెంట తీసుకుపోలేమని తెలిసిన మనం - అన్నీ తెలిసి విస్మరించే విషయం: 'మన సంపాదనలో కొంత భాగాన్ని మనకు ఏ సంబంధమూలేని పరాయివాళ్ళ కోసం ఖర్చు పెట్టడం !'

ఏ వ్యక్తి అయినా కన్ను మూసినపుడు - ఆ వ్యక్తి గురించి ఇతర వ్యక్తులనోట -

'ఫలానా వ్యక్తి అతడి కొడుక్కి పది బంగళాలూ, ఐదు కార్లూ కొనిచ్చిపోయాడు !'

'ఫలానా ఆవిడ ఆమె కూతురికి పాతిక లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, పదెకరాల తోట మిగిల్చిపోయింది!'

అనే మాటలకి బదులుగా -

'ఫలానా వ్యక్తి - ఫలానా వాళ్ళకి చేయూతనందించి ఇంతటి వాళ్ళని చేశాడు !'

'ఫలానా పారిశ్రామికవేత్త ఫలానా సంస్థకి, బడికి, గుడికి, ఆసుపత్రికి పదెకరాల భూమిని విరాళంగా ఇచ్చాడు.'

అన్న మాటలు విన్పిస్తాయో -

అప్పుడు ఆ వ్యక్తి జన్మ ధన్యమవుతుంది !

అతడికి నిఖిలజగత్తు నిండుగుండెతో నివాళులర్పిస్తుంది!

1-6-1995




# అభినందన

మన పరిచయస్తులెవరైనా... మనం సాధించని విజయ మేదో సాధించారని తెలిసినపుడు....

“కంగ్రాచ్యులేషన్స్” తెలుపడం మన పెద్ద మనసుకి అద్దం పడ్తే....

“ఆఁ ఏ అడ్డదార్లు తొక్కి సాధించి ఉంటాడో... లేకపోతే వాడి ముఖం... వాడు సాధించడమేమిటీ ?” అని దీర్ఘాలు తీయడం.... మన ఈర్ష్యాద్వేషాల్నీ, సంకుచిత మనస్తత్వాన్నీ, లేకిబుద్ధినీ సూచిస్తుంది!

నిజానికి ఒక వ్యక్తిని చూసి ఈర్ష్యపడటం కన్నా సిగ్గు పడవలసిన విషయం మరోటి వుండదు !

**ఒకర్ని చూసి మనం ఈర్ష్యపడ్తున్నామూ అంటే.... మనకి తెలీకుండానే మనం ఆ వ్యక్తికన్నా అధములమని అంగీకరి స్తున్నామని అర్థం!**

పోతే...

పోటీ మనస్తత్వమున్న వాడు... పక్కవాణ్ణి చూసి ఈర్ష్య

పడకుండా.... అతడికన్నా తన స్థాయి పెంచుకోవడానికి ప్రయత్నిస్తాడే తప్ప..... ఆ వ్యక్తి మీద అవాకులూ.... చవాకులూ... పేలి.... తన కుళ్ళుబోతు బుద్ధిని ప్రదర్శించుకోడు !

అభినందన అనేది సున్నితంగా... సూటిగా.. సరళంగా... హృద్యంగా... నాల్గయిదు వాక్యాల్లో కేవలం ఆ వ్యక్తికి మాత్రమే తెలిసేలా చెప్పడం ఒకరకమైతే... సభలూ.... సమావేశాలూ ఏర్పరచి... నిలువెత్తు పూలదండల్తో నల్గురికీ తెలిసేలా ప్రశంసల వర్షం కురిపించడం మరోరకం!

మొదటి రకం - ఆ వ్యక్తి అంతరంగాన్ని సుతిమెత్తగా స్పృశించి... అతడికి మానసికోల్లాసం కలిగిస్తే...

రెండోరకం - ప్రచారం ఏ మాత్రం ఇష్టం లేని వ్యక్తికి - ఇదీ అని చెప్పలేని 'ఇబ్బంది'ని కల్గిస్తుంది!

ఏదేమైనా...

ఒక వ్యక్తిలోని 'స్పార్క్'ని అతడు ఏ పదవిలోనూ లేనపుడు గుర్తించి.... అతడికి సన్మానాలూ, సత్కారాలూ, అభినందన సభలూ నిర్వహించడం... నిర్వాహకుల నిస్వార్థాన్నీ, ఉదాత్తతనీ, చిత్తశుద్ధినీ, విశాల హృదయాన్నీ ప్రతిబింబిస్తే....

ఆ వ్యక్తికోపదవి లభించాక... ఆ వ్యక్తి నుండి దేన్నో ఆశించి... 'అభినందన సభ'లు నిర్వహించడం... 'మస్కా' అన్పించుకుంటుంది!

పోతే...

ఇతరుల పట్ల ఈర్ష్యాళువులమై -

వాళ్ళని 'పాతాళాని'కి లాగడానికి ప్రయత్నించకుండా...


భట్రాజు పొగడ్తలతో 'ఆకాశాని'కెత్తేయకుండా....

ఒక్క చూపుతోనో,

చిన్న మాటతోనో,

చిరునవ్వుతోనో...

మన అభినందన తెలియచేస్తే.... దాన్ని స్వీకరించిన వ్యక్తి రెట్టించిన ఉత్సాహంతో.. మరో అద్భుతాన్ని సాధించడానికి ఉద్యుక్తుడవుతాడు!



*16-06-1995*




# ప్రదర్శన

'ప్రదర్శన' మనిషి ఉనికినీ..... అతడి ప్రతిభనీ ఫోకస్ చేస్తుంది ! అతడెవరో, ఎందులో నిష్ణాతుడో తెలియజేస్తుంది.

ప్రదర్శనే లేకపోతే మనిషి శక్తి సామర్థ్యాలు ఎవరికీ తెలీకుండా మరుగునపడిపోతాయి! రాయికీ, రత్నానికీ తేడా తెలీకుండా పోతుంది! రాయినెలా మలచుకోవచ్చో.... రత్నాన్ని ఎక్కడ భద్రపరుచుకోవచ్చో అర్థం కాకుండా పోతుంది.

అయితే...

ప్రదర్శన ఎంత అనివార్యమైనా....

'మా తాతలు నేతులు తాగారూ... మా మూతుల వాసన చూడండీ' అన్నట్లుగా... మన తలిదండ్రుల ఆస్తిపాస్తుల్నో, వస్తువాహనాల్నో, పట్టువస్త్రాల్నో ప్రదర్శనకి పెట్టి నల్గురి దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నించడం మన వ్యక్తిత్వానికే మచ్చ తెచ్చే అంశంగా భావించాలి!

ప్రతిపక్షం వాళ్ళు బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారని.... పాలక పక్షం దానికన్నా బ్రహ్మాండమైన ర్యాలీని నిర్వహించి.... తన బలమేమిటో ప్రదర్శించాలని ఉబలాటపడటం మనం గమనిస్తూ వుంటాం! ర్యాలీలలో, పోటీ ర్యాలీలలో జనం

పలుచగా ఉంటే ఖంగుతినడం... ఇసుక వేస్తే రాలనంతగా వుంటే పొంగిపోవడం... మన పాలకులకూ, ప్రతిపక్షాలకూ అలవాటే !

అయితే....

కేవలం ర్యాలీలకు వచ్చిన జనాలను చూసి... ప్రజలు తమ విధానాలకు అనుకూలంగానో, ప్రతికూలంగానో స్పంది స్తున్నారను కోవడం పొరపాటనీ.... ఏ పార్టీ సభకి ఎంత మంది జనం వచ్చారన్నది ముఖ్యంకాదనీ, అవినీతి పురుగుల లుకలుకల్లేకుండా... ఎంత 'శుచి'గా పాలించారన్నది మాత్రమే ప్రజలు గుర్తెరిగి... అవసరమొచ్చినపుడు తమ ఓటు వేటుతో ఆ ప్రభుత్వాన్ని పడగొడ్తారన్న విషయాన్ని.... రాజకీయ నాయకులు ప్రతిపక్షంలో వున్నా, పాలకపక్షంలో వున్నా గుర్తుంచుకుని - తదనుగుణంగా ప్రవర్తిస్తే... ప్రదర్శనల పేరిట కొన్ని కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాదు !

పోతే...

ప్రదర్శన అనేది -

నిగూఢంగా దాగి ఉన్న 'ప్రతిభ'ని వెలికితీసేదైతే - మన ప్రోత్సాహాన్నివ్వాలి... తోటివాళ్ళ 'లేమి'ని గుర్తుకు తెచ్చేదైతే... గర్హించాలి!

*1-7-1995*




# ఆహ్లాదం

కొందరి సమక్షంలో యుగాలు సైతం క్షణాల్లా గడిచి పోతాయి ! ఎప్పుడెప్పుడు వాళ్ళ దగ్గరికి రెక్కలు కట్టుకు వెళ్ళి వాల్దామా అన్పిస్తుంది! వాళ్ళ ఉనికి మనకి ఎంత హుషారునీ, ఉత్తేజాన్నీ, ఉల్లాసాన్నీ కల్గిస్తుందో... వాళ్ళ ఎడబాటు అంత వెలితినీ, నిస్తేజాన్నీ, నిస్సత్తువనీ కల్గిస్తుంది!

మరి కొందరుంటారు... వాళ్ళు ఎంత బిజీమనుషులంటే... 'రోజుకి ఇరవై నాలుగ్గంటలు కాక నలభై ఎనిమిది గంటలుంటే బావుణ్ణు' అనుకునే పని ఒత్తిడి మనుషులు! వీళ్ళకి సరదాగా వుండాలని లోలోపల ఎంతున్నా.... వుండటానికి టైమ్ దొరకని దురదృష్టవంతులు!

ఇలాంటి వాళ్ళ మనసు....

'నా దగ్గర మంత్రాలేగానీ ఉంటేనా?...ఒకే ఒక గంట నిన్ను నీ రొటీన్ లైఫ్‌లోంచి ఝూమ్మంటూ పైకి లేపుకుపోయి... ఏ పూలవనాల్లోనో, నీలిగగనాల్లోనో, ప్రేమసీమల్లోనో, తిప్పి తిప్పి... తెచ్చి మళ్ళీ భూమ్మీద దించేద్దును!....'

అనే మనుషుల కోసం బెంగెట్టుకుంటుంది!

అదే క్షణాన.....

లోకంలో చేయడానికి పనేం లేనట్టు.... తమ సూటి పోటి

మాటలతో, వేధింపులతో అస్తమానం ఎవర్నో ఒకర్ని వేపుకు తినే మనుషుల్ని ఈసడించుకుంటుంది !

ఇంకొందరుంటారు.... వీళ్ళు ఎప్పుడూ గొణుగుతూ, సణుగుతూ... తమ బాధలన్నీ ఏకరువుపెడ్తూ... ఎప్పుడు చూసినా మూర్తీభవించిన శోకదేవతల్లా ఉంటారు.

ఇలాంటి మనుషుల దగ్గర... కాలం కదలకుండా మొరాయిస్తుంది. పరిసరాలు ఊపిరాడనట్టుగా.... మూగబోయినట్టుగా స్థంభించిపోతే -

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే మనుషుల దగ్గర కాలం 'మంచు'లా కరిగిపోతుంది... పరిసరాలు పూలసౌరభాల్ని విరజిమ్ముతాయి. మానసికోల్లాసం కోసం ప్రత్యేకించి... ఏ సైట్ సీయింగ్‌కో వెళ్ళనక్కర్లేదు... ప్రకృతే వాళ్ళ దగ్గరికి కదిలివస్తుంది. అప్పటిదాకా స్తబ్దుగా ఉన్న పరిసరాలన్నీ ఒక్కసారిగా చైతన్యాన్ని సంతరించుకుంటాయి!

ఎవరి రాకతో మన పరిసరాలు కళకళ లాడి...

ఎవరి నిష్క్రమణతో వెలవెలబోతాయో....

వాళ్ళ సమక్షంలో మన మనసు పురివిప్పిన మయూరంలా నర్తిస్తుంది!

సున్నితమైందీ... సుకుమారమైందీ.... సుమ సదృశమైందీ... మనిషి మనసు !

ఆహ్లాదకరమైన వాతావరణంలో దాన్ని అందంగా వికసించనీయాలే తప్ప 'పరుషపు మాటల'తో మొగ్గ దశలోనే వసివాడనీకూడదు!

16-7-2005




# స్వేచ్ఛ

మనం ఎక్కడికి వెళ్ళి - ఎక్కడ తిరిగినా - చివరకి మన 'గూటికే' రావాలనుకుంటాం! మన ఇల్లంటే మనకి అంత ప్రత్యేకాభిమానం ఉంటుంది ! అంతకు మించి... మన ఇంట్లో మనకి అత్యంత 'స్వేచ్ఛ' వుంటుంది!

ఇంట్లో రాత్రి ఒంటిగంట దాకా మెలుకువగా వుండి -పోచికోలు కబుర్లు చెప్పుకున్నా...

ఆ మర్నాడు మధ్యాహ్నంలేచి ముఖం కడుక్కొని మళ్ళీ పడుకున్నా...

క్రితం నిముషం కాఫీ తాగి, మరునిముషం ఐస్‌క్రీం తిన్నా...

రోజుకి లక్షా తొంబైసార్లు అలిగినా...

తిక్కపుట్టి అటకెక్కి కథాకళి చేసి, గయ్ గయ్‌న అందర్నీ కసిరినా... ఇంకేం చేసినా... చెల్లిపోతుంది! ఎవరూ ఏ 'ఎనిమిదో వింత'లా చూడరు!

కానీ కొందరు దురదృష్టవంతులకి... ఇంట్లో నవ్వడానికి వీలుండదు! సరదాగా కబుర్లు చెప్పుకోవడానికీ చోటుండదు! కనీసం... మనసారా ఏడ్చుకోవడానికీ స్వేచ్ఛ ఉండదు.

తినడానికి, నవ్వడానికీ, ఏడ్వడానికీ, మాట్లాడటానిక్కూడా స్వేచ్ఛ లేని మనుషులకు... తమ దేశ 'స్వాతంత్ర్య జెండా'ల

రెపరెపల్లో సైతం బానిస సంకెళ్ళే కన్పిస్తాయి ! సొంతిల్లు కూడా పరాయి ఇల్లే అన్పిస్తుంది!

కొందరు భర్తలు భార్యలకి ఉద్యోగం చేసే స్వేచ్ఛని ఎంతో ఉదారంగా ప్రసాదిస్తారు! అదే సమయంలో... సంపాదించిన దాంట్లో పదో వందైనా ఖర్చు పెట్టుకోవాలనుకునే స్వేచ్ఛని మాత్రం నిర్దాక్షిణ్యంగా హరిస్తారు.

ఇక్కడ భర్తలకి... భార్యలు బంగారు గుడ్లుపెట్టే బాతులు! అంతే తప్ప... ఆ భార్యలకో మనసుంటుందనీ... అది అనుక్షణం స్వేచ్ఛ కోసం పరితపిస్తుందనీ... కట్టడిచేస్తే ఏదో జీవచ్ఛవంలా కాపురం చేస్తారే తప్ప.... తమ మెత్తని ప్రేమని మనస్ఫూర్తిగా పంచివ్వలేరనీ... గ్రహించరు!

ఇకపోతే.... టీనేజ్‌లో అడుగెట్టిన పిల్లలందరూ అప్పుడే గుడ్డులోంచి బయటకి వచ్చిన కోడిపిల్లలకి మల్లే - మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలా.... ముద్దుగా..., బొద్దుగా ఉంటారు.

ఇంతలేసి కళ్ళతో ప్రపంచాన్ని వింతగా చూస్తూ తల్లి రెక్కల కింద నుండి బయట ప్రపంచంలో అడుగిడిన కోడిపిల్లలకి - లోకమంతా పచ్చగా, అందంగా, హాయిగా, అపురూపంగా కన్పిస్తుంది.

తల్లికి దూరంగా బితుకుబితుకుమంటూ ఒక్కొక్క అడుగే...... ముందుకేసే కోడిపిల్ల- ఏమాత్రం అలికిడైనా.... పరుగు పరుగున మళ్ళీ తల్లి రెక్కల కిందకి పరుగెత్తుకు వస్తుంది. తనమీద తనకి నమ్మకం పెరిగే కొద్దీ, బిడ్డ...తల్లి 'వాత్సల్యం' పరిధిని దాటి ఇంకా ముందుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది !

అనుక్షణం తన కంటికి రెప్పల్లే కాపాడుకోవాలనుకునే తల్లి ప్రవర్తన... పిల్లలకి చిరాగ్గా ఉంటుంది!

'తమ మీదా, తమ వ్యక్తిత్వమ్మీదా ఆ మాత్రం నమ్మకం లేదా ? తమ మీద ఎందుకింత ఓవర్ ప్రొటెక్షన్ ?'' అని గింజుకునే ఆడపిల్లలు పరిసరాల స్పృహలేక... నిరక్ష్యంగా ముందుకు దూసుకెళ్తే... టక్కున ఏ దుష్టుడో.... ఎక్కడ ఏ గద్ద రూపంలో తన్నుకుపోతాడో అని గిజగిజలాడిపోతారు... కన్నవాళ్ళు.

కన్నవాళ్ల వాత్యల్యానికీ, పిల్లల వ్యక్తిత్వానికీ మధ్య ఘర్షణ ఏర్పడినపుడు పిల్లల మనస్సు విరిగి - వద్దన్నదే చేయాలనే 'కసి' పెరుగుతుంది! పిల్లల తిరుగుబాటుకీ, తిరస్కారానికీ పెద్దవాళ్ళ గుండెలు అవిసిపోతాయి - ఇద్దరి మధ్యా 'సంయమనం' ఒక్కటే సయోధ్య కల్గిస్తుంది!

స్వేచ్ఛలేని చోట -

'ప్రేమ' అంతర్ధానమవుతుంది.

'భయం' ప్రత్యక్షమవుతుంది.

'విప్లవం' రాజుకుంటుంది.

'తెగింపు' అనివార్యమవుతుంది.

**స్వేచ్ఛని మించిన 'వరం' మనిషికి మరోటి లేదు.**

అందుకే.... దేశాలూ, మనుషులేకాదు - మనసులుకూడా స్వేచ్ఛకోసమే ఆరాటపడతాయి - పోరాడుతాయి - తపస్సు చేస్తాయి!

ఆ వరాన్ని ప్రసాదించే చేతులు మాత్రమే.....

-విరక్తిని పారద్రోలి - జీవితం మీద అనురక్తిని పెంచుతాయి!

-సుతిమెత్తని ప్రేమసుమాలను విశ్వమంతా విరజిమ్ము తాయి !

*1-8-1995*




# ఆశావాదం

మనం బ్రతకడానికి ఏదో ఒక వృత్తినో, వ్యాపారాన్నో, పరిశ్రమనో ఎన్నుకుంటాం!

మనలో కొందరు రాత్రింబవళ్ళూ శ్రమిస్తారు - ఎంత శ్రమించినా వాళ్ళ పరిస్థితి అంతకంతకీ దిగజారుతుందే తప్ప శ్రమకి తగ్గ ప్రతిఫలం పొందలేరు ! మరి కొందరు... ఏమంతగా శ్రమించరు! అయినా వాళ్ళ అంచనాలకి మించి వాళ్ళింటి ముంగిట కనక వర్షం కురుస్తుంది!

కొందర్ని చూస్తూంటాం ! వాళ్లు ఎన్నో రంగాల్లో అడుగెట్టి, ప్రతీసారీ విజయలక్ష్మితో తిరిగొస్తారు! అలాంటి వాళ్ళని చూసి - 'వాళ్ళు మట్టి ముట్టినా బంగారమే అవుతుంది' అని ఈర్ష్యపడ్తాం !

మరి కొందర్ని చూస్తాం... వాళ్ళు ఏపని చేసినా కలిసిరాదు! 'వాళ్ళు బంగారం ముట్టినా మట్టే అవుతుంది' అని ఎద్దేవా చేస్తాం!

ఎప్పుడూ ఏ రంగంలోనూ అడుగెట్టని వాళ్లేకాదు....

ఎన్నో రంగాల్లో విజయం సాధించిన వాళ్ళు కూడా...

ఒక్కోసారి ఊహించని విధంగా, పీకల్లోతు కష్టాల ఊబిలో

కూరుకుపోయే సందర్భాలు వస్తూ వుంటాయి !

ఇలా...

ముళ్ళకంచెలో చిక్కుకుపోయిన వ్యక్తికి అకస్మాత్తుగా పరిసరాలన్నీ పూలవనాలు కావడాన్ని అదృష్టమనీ...

వెన్నెల స్నానాలు చేస్తోన్న వ్యక్తి నెత్తిన వున్నట్టుండి నిప్పుల వర్షం కురవడం దురదృష్టమనీ... చెప్పుకుంటాం !

లేదూ...

మనమనుకున్నది సిద్ధిస్తే చేసిన పూజలు ఫలించాయనో, దైవమహిమనో....

జరక్కూడనిది జరిగితే పూర్వజన్మ కర్మ ఫలమనో, వాస్తు దోషమనో సరిపెట్టుకోచూస్తాం!

అంతే తప్ప - మన వైఫల్యానికి కారణం... మనం చేస్తోన్న పనిలో మనకు అనుభవరాహిత్యమో, కృషిలోపమో, దుస్సాహసానికి ప్రతిఫలమనో - ఛస్తే అంగీకరించం !

పిల్లలు పుట్టడంలేదనో, పుట్టిన పిల్లలు చదవడంలేదనో, కోరుకున్న మనిషి దక్కలేదనో, ఎవరో మోసంచేశారనో, కష్టార్జితం దోచుకుపోయారనో, వ్యాపారం కలిసిరాలేదనో - మనం నిరాశా నిస్పృహలకు లోనవుతాం !

అనుకున్నది జరగనపుడు...

అశించింది దక్కనప్పుడు...

అడుగడుగునా అపజయాలే చవి చూసినపుడు...

మనుషుల ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతుంది!

మానసిక ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలకి పాల్పడతారు!

కానీ, -

మనిషికి ఆలోచించే మెదడుంది!

ఏదో ఒక పనిచేయడానికి చేతులున్నాయి!

**అవేవీ లేని పశుపక్ష్యాదులే ఎవరి 'ఆసరా' లేకుండా నిశ్చింతగా బ్రతికేస్తూంటే... సృష్టిలోని కోటానుకోట్ల ప్రాణులన్నింటిలోకెల్లా ఉత్కృష్టమైన జన్మ ఎత్తిన మనిషి.... 'తనకెవరూ లేర'ని... లేనిపోని చింతలతో ఆత్మహత్యలకి పాల్పడటం.... అవివేకమనిపించు కుంటుంది!**

విరక్తి... వ్యక్తిని శక్తిహీనుణ్ణి చేస్తుంది!

నిస్పృహ... జాతిని నిర్వీర్యం చేస్తుంది !

మన చింతల్నీ, చీకాలుల్నీ మటుమాయంచేసి మనసుని చైతన్యవంతం చేయగల దివ్యౌషదం.... ఆశావాదం !

దాన్ని ఒకరందిస్తే సేవించాలని చూడక - మరో బాధాతప్త హృదయానికి అందించాలనే తపన మనం అలవర్చుకోవాలి.

16-08-1995



# ప్రతిభ

**క**మల్‌హాసన్ నటనకో... కపిల్‌దేవ్ ఆటకో... బాలసుబ్రహ్మణ్యం పాటకో... శ్రీదేవి అందానికో.... మనకి తెలీకుండానే ఆకర్షితులవుతాం!

ప్రతిభకి అంత గుర్తింపు ఉంటుంది కాబట్టి ఏదో ఒక రంగంలో ప్రతిభావంతులం కావాలని ఉవ్విళ్ళూర్తాం!

ఒకవేళ మనలో ఏ ప్రతిభా లేకపోతే కనీసం ప్రతిభావంతులని చూసి మురిసిపోతాం... ముగ్ధులమవుతాం!

ప్రతిభావంతులకెప్పుడూ ఎంతో కొంత 'జనాకర్షణ' శక్తి వుంటుంది కాబట్టి... వాళ్ళ వెంట మనం పరుగులు తీస్తాం! ఆటోగ్రాఫ్‌ల కోసం ఎగబడ్తాం !

కొందర్ని అభిమానిస్తాం !

**'అభిమానం'**లో విచక్షణ మరుగున పడిపోతుంది ! మనం ఇష్టపడే వాళ్ళమీద ఈగ వాలినా సహించలేం ! వాళ్ళ బలహీనతల్ని విమర్శించిన వాళ్ళమీద రంకెలేస్తాం! వీలైతే సదరు వ్యక్తుల్ని తన్నడానికైనా సంసిద్ధపడతాం! వాళ్ళ మీద మన ఇష్టాన్ని నిరూపించుకోవడానికి వారికోసం ప్రాణత్యాగాని కైనా వెనుదీయని వీరాభిమానులమవుతాం !

**'ఆరాధన'**లో స్వార్థముండదు! మనమిష్టపడినవాళ్ళు మనను ఇష్టపడాలనుకోం! వాళ్ళకి దగ్గరకావాలని ఆశించం! వాళ్ళపట్ల మన ఇష్టాన్ని మరొకరి దగ్గర ప్రదర్శించాలని కూడా భావించం! మన ఇష్టాన్నంతా గుండెల్లోనే గుప్తంగా దాచు కుంటాం!

**'ఆకర్షణ...'** నీటి బుడగలాంటిది ! ఎప్పుడే క్షణాన అది టప్పున పేలిపోయి... తన ఉనికి కోల్పోతుందో చెప్పలేం! ఈ రోజు ఇష్టపడ్డ వాళ్ళనే మరోరోజు అసహ్యించుకుంటాం! వాళ్ళనిష్టపడ్డప్పుడు... ఎవరెంత కాదన్నా.... వాళ్ళలో మన కంతా 'గొప్పతనమే' కన్పిస్తుంది! అసహ్యించుకున్న క్షణాల్లో ఎవరెంత నచ్చచెప్పినా వాళ్ళలో మనకన్నీ 'లోపాలే' కన్పి స్తాయి!

జనాకర్షణ ఆయుష్షు అతి స్వల్పమనీ... మన అభిమానుల 'అభిమానం' దెబ్బతినేలా ప్రవర్తిస్తే.... మనకన్నా ప్రతిభావంతు లైన వాళ్ళు రంగంలోకొచ్చినపుడు... జనం మనల్ని మరిచి... వాళ్ళ వెంట పరుగులెడ్తారనే సంగతి..... మనం ఉచ్ఛ స్థానంలో వున్నప్పుడు విస్మరిస్తాం!

మనకు జనాకర్షణ శక్తి ఉందనీ... జనం మనమేం చేసినా గుడ్డిగా నమ్మేస్తారని భావిస్తే... జనం కీలెరిగి వాతపెడ్తారు!

మనం దైవాంశసంభూతులమనీ... ఎవరిలోనూ లేని 'ప్రతిభ' మనలో దాగుందన్న అహంకారంతో.. కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తే.... ఏ ప్రతిభా లేదనుకునే వాళ్ళందరూ 'ఒక్కటై' - తమ ప్రతిభేమిటో ప్రదర్శిస్తారు!

*1-9-1995*




# దృష్టి

మనం రైల్లోనో, బస్సులోనో ప్రయాణం చేస్తున్నప్పుడు మనకంటికి అక్కడక్కడా కొన్ని అపురూపమైన, అరుదైన దృశ్యాలు కన్పిస్తూవుంటాయి!

పచ్చటి చెట్ల మధ్య... తెల్లని కుందేలు చెంగు చెంగుమని దూకి పరిగెడ్తున్నప్పుడు.. మనతో పాటు ప్రయాణం చేస్తున్న పిల్లలు "వాహ్! కుందేలు పిల్ల ఎంత ముద్దొస్తోందో" అని కేరింతలు కొట్టడం చూస్తాం!

అదే క్షణాన....

"అబ్బ! కుందేలు కూర ఎంత బావుంటుందో?" అని తోటి ప్రయాణికులు లొట్టలేయడమూ చూస్తూ ఉంటాం.

ఒకే దృశ్యానికి ఒకరు ఒకలా - మరొకరు మరొకలా - స్పందించడం ఎవరి 'దృష్టి-' ఎలాంటిదో స్పష్టం చేస్తుంది!

కొందరు చేసే పనిలో మనకి 'స్థిరదృష్టి' కనిపిస్తుంది! ఏ పనైనా సరే 'అంకిత భావం'తో పూర్తిగా లీనమైచేస్తారు! ఎవరైనా వచ్చి వాళ్ళని పలకరించినా, వాళ్ళ మస్తిష్కానికది వెంటనే అందదు! ఎక్కడో - ధ్యాననిమగ్నులై ఏ లోకంలోనో వున్నట్టుం టారు. వీళ్ళ దృష్టి అంతా వాళ్ళు చేస్తోన్న పనిమీదే లగ్నమై

బాహ్య ప్రపంచాన్ని మరిచిపోతారు ! ఎవరెన్ని విధాల ప్రయత్నించినా - వాళ్ళ ఏకాగ్రతకి భంగం కల్గించలేరు! ఇలాంటి వాళ్ళు ఏదో ఒక కళలో ప్రవేశం సంపాదించి - 'కళాకారులు'గా రాణిస్తారు !

మరికొందరు ఒకవైపు ఒక పని చేస్తూనే మరోవైపు ఎక్కడే మౌతోందీ, ఎక్కడే లోపం జరుగుతోందీ టక్కున 'విహంగ దృష్టి'తో పసిగట్టేస్తారు! ఏక సమయంలో అనేక విషయాలపై తమ దృష్టిసారించే వీళ్ళు.... గొప్ప 'అడ్మినిస్ట్రేటర్స్'గా పేరు గడిస్తారు.

ఇంకొందరు వ్యక్తులది 'అస్థిర దృష్టి'! ఏ పనిమీదా తమ దృష్టిని పట్టుమని పది నిమిషాలైనా నిలుపలేరు ! వీళ్ళకి ఏ పనిలోనూ ఆసక్తిలేక - ఏ గొప్ప పనినీ సాధించలేక - లోకం దృష్టిలో 'అనామకులు'గానే వుండిపోతారు!

కొంతమంది ఎవరేం చేస్తోన్నా ప్రతి పనినీ 'వక్రదృష్టి'తోనే చూస్తారు - ఎదుటి వాళ్ళు చేస్తోన్న మంచిపనిలో కూడా 'చెడే' వెదుకుతూ - ఏ చిన్న ఆధారం దొరికినా పీకిపోగులు పెడ్తారు! ఎదుటివాళ్ళలో తప్పులెంచడమే పరమావధిగా పెట్టుకునే వీళ్ళని 'రంధ్రాన్వేషకులు' (cynic) అంటారు.

మరి కొంత మందిది 'స్వకీయ దృష్టి'. ఇలాంటి వారందరూ ఏ విషయాన్నైనా తమ దృష్టితోనే ఆలోచించాలని కోరుకుంటారే తప్ప, ఆ విషయంలో ఎదుటివాళ్ళ అభిప్రా యాల్ని ఈషణ్మాత్రమైనా పరిగణలోకి తీసుకోరు సరికదా తాము పట్టిన కుందేలుకి మూడే కాళ్ళని వాదిస్తూ - 'వితండవాదుల'ని పించుకుంటారు.

ఒక వ్యక్తిని 'ఒకే కోణం'లోంచి చూసి ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకునే వ్యక్తిది 'పాక్షిక దృష్టి' అయితే - ఆ వ్యక్తిని 'అన్ని కోణాల్లో'ంచి ఎలాంటి వివక్షకీ, పక్షపాతానికి తావు లేకుండా - విచక్షణతో వీక్షించగలిగే వ్యక్తిది: **'సమదృష్టి'**.

తను చేస్తోన్న పనిలో ఎదురయ్యే ఒడుదొడుకులను ముందే ఊహించి... తదనుగుణంగా జాగ్రత్తపడే మనిషిది: **దూరదృష్టి.**

ఒక వ్యక్తి వేషభాషల్నిబట్టి ఆ వ్యక్తిని చూసీచూడటంతోనే ఒక అభిప్రాయాన్నేర్పర్చుకుని - ఆ వ్యక్తి మనోవైకల్యాన్ని ఏ మాత్రం చూడలేని వ్యక్తిది: **బాహ్యదృష్టి.**

ఎదుటి వ్యక్తి వ్యక్తిత్వాన్ని తన మనోనేత్రాలతో దర్శించి, ఆ వ్యక్తి అంతరంగాన్నీ, అంతర్గతభావాల్నీ చదవగలిగే వ్యక్తిది: **అంతర్దృష్టి.**

ఒక వ్యక్తి అంతర్దృష్టి అతడి 'మానసిక పరిణతి'కి చిహ్నామైతే - అతడి బాహ్య దృష్టి అతడిలోని 'సౌందర్య స్పృహ'కి సంకేతం!

ఏదైనా ఒక సంఘటననో, దృశ్యాన్నో విశ్లేషించడానికీ, సంశ్లేషించడానికి మనిషికి 'సమదృష్టి' అవసరమైతే - తన అలసత్వ కారణంగానో, ఎదుటి వాళ్ళ వెన్నుపోట్ల మూలంగానో సంక్షోభాల్లో చిక్కుకోకుండా అనుక్షణం అప్రమత్తంగా వుండేందుకు... 'దూరదృష్టి' అవసరం !

*16-09-1995*




# సభ్యత

ఎక్కడో ఏదో ఫంక్షన్ జరుగుతూ ఉంటుంది! ఇన్నాళ్ళూ బుల్లితెర మీద దేదీప్యమానంగా వెలిగి - ఇటీవలే రాజకీయ రంగంలో ప్రవేశించిన ఓ మహానటుడు ఆ సభకి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిసి...

ఆయన ఎలా ఉంటాడో చూద్దామని కొందరూ-

ఏమ్మాట్లాడ్తాడో విందామని మరికొందరూ -

ఉరుకులూ పరుగుల మీద సభాస్థలికి చేరుకుంటారు!

ఫంక్షన్ మొదలవుతుంది ! ముఖ్య అతిథి మాట్లాడటానికి మైకు ముందుకొస్తాడు ! అప్పటిదాకా రణగొణ ధ్వనుల్తో కోలాహలంగా వున్న వాతావరణం ఒక్కసారిగా సద్దుమణుగుతుంది!

ముఖ్య అతిథి గొంతు సవరించుకొంటాడు! జనం చెవులు రిక్కిస్తారు! కుర్రకారు కేరింతలు కొడ్తారు! జనాన్ని చూసి సదరు రాజకీయ నాయకుడి ఛాతీ ముప్పై అంగుళాలు ముందుకు పొంగుతుంది!

ఉన్న ఫళాన దేశాన్ని ఉద్ధరించేయాలన్నంత వెర్రి ఆవేశం పుట్టుకొస్తుంది!

ప్రతిపక్షం వాళ్ళనందర్నీ గుంటనక్కలనీ, దేశద్రోహులనీ,

కుక్కమూతి పిందెలనీ ఏకి పారేస్తాడు!

చప్పట్లు సదరు నాయకుడికి మత్తెక్కించి- కిక్కిస్తాయని ఆయన ప్రత్యర్థులకి బాగా తెలుసు! అందుకే - ఆయన నోట్లోంచి రాలే అవాకులూ చవాకుల కోసం - తడవ తడవకీ తమ కరతాళ ధ్వనుల్తో అతడికి పూనకం తెప్పిస్తారు !

చప్పట్ల హోరుతో వెర్రెత్తిన నాయకుడు- వాళ్ళ ఎత్తులు గ్రహించకుండా - రెట్టించిన హుషారుతో ప్రత్యర్థుల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తూ - తన గొప్పలను... చెప్పిన గొప్ప చెప్పకుండా చెప్తూ - జనాన్ని ఊదరగొట్టేసి - శోష తెప్పిస్తాడు!

నాయకుడి స్వోత్కర్షలకీ - తిట్ల దండకానికీ దిమ్మతిరిగి - మూర్ఛిల్లిన జనం - స్పృహలోంచి తేరుకున్నాక - తమ నాయకుడి సభ్యతా సంస్కారాలేపాటివో తెలిసొచ్చి - అలాంటి సభకు వచ్చినందుకు తమను తామే తిట్టుకుని లెంపలేసు కుంటారు!

ఇతర వ్యక్తుల్ని 'సభాముఖంగా' అసభ్య పదజాలంతో విమర్శించడం - సభ్య సమాజం అసహ్యించుకుంటుందన్న ఆలోచన ఆ నాయకుడికి లేకపోవడం శ్రోతల దురదృష్టం.

మనం ఆవేశంలో నిగ్రహాన్నీ - ఆరోపణల్లో సంయమనాన్నీ పాటించడం 'సంస్కారం' అనిపించుకుంటే.... మాటల్లో, నడతలో, వస్త్రధారణలో 'హుందా'తనాన్ని ప్రదర్శించటం 'సభ్యత' అన్పించుకుంటుంది.

సభ్యతా సంస్కారాలు మనిషికి రెండూ రెండు నేత్రాలైతే - ఏ నేత్రం లోపించినా అతడు నల్గురి దృష్టిలో సభ్యప్రపంచపు గడపతొక్కడానికి అనర్హుడవుతాడు!

1-10-195




# శ్రమ

మనలో కొంతమంది 'చిన్న చిన్న పనులు' చేయడం తమ డిగ్నిటీకి భంగం అనుకుంటారు! వాళ్ళ దృష్టి ఎప్పుడూ వైట్‌కలర్ జాబ్స్ మీదే ఉంటుంది. చిల్లి గవ్వ ఆదాయం లేకున్నా సరే - తమ 'స్థాయి'కి తక్కువ అనిపించే పనులు ససేమిరా ముట్టుకోరు ! తమ పనులు తాము చేసుకోవడాని క్కూడా నామోషీగా ఫీలవుతారు. 'డిగ్నిటీ ఆఫ్ లేబర్'కి అర్థం తెలీని వీరు... చాపకింద నీరులా దేశమంతా విస్తరించి - 'దేశ ఆర్థిక వ్యవస్థ'ని ఛిన్నాభిన్నం చేసేస్తారు.

మరి కొంతమంది 'ఏపనీ చేయరు' సరికదా - తమ భారాన్ని కూడా ఇతరుల మీదే మోపుతారు ! తనకంటే యాభైరెట్ల బరువుని అవలీలగా మోసే 'చీమల్ని' చూసైనా తమ 'కర్తవ్యం' గుర్తుకు తెచ్చుకోరు ! గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అనుకునే వీళ్ళు... దేశానికి 'గుదిబండ'ల్లా తయారవుతారు !

కొందరు... 'సమిష్టి'గా చేసిన పనేదైనా 'క్లిక్' అయి అందరి మన్ననలనూ పొందినపుడు - అది తమ గొప్పతనమే అంటారు.

అదే పని ఫ్లాప్ అయితే మాత్రం - చిత్రంగా 'ఫలానా' వాడిదే తప్పంటారు!

మరి కొందరు 'చాలా కష్ట'పడ్తారు! ఏ పనైనా అవలీలగా చేసేస్తారు! ఎటొచ్చీ వాళ్ళ లోపమల్లా - "నా ముందున్న పని 'నాది' అయితే నాల్గు చేతుల్తో శ్రమిస్తాను! అదేపని 'మనది' అయితే మాత్రం నా రెండు చేతుల్నీ దాచేసుకుంటాను..." అనుకోవడమే!

**ఒకరి శ్రమని 'దోచుకోవడం' ఎంత తప్పో... తన శ్రమని 'దాచుకోవడమూ' అంతే తప్పు!**

ఆరోగ్యం బాగాలేక... మంచానికి అతుక్కుపోయిన మనుషుల సంగతి వేరు! కానీ... అవయవాలన్నీ సవ్యంగా వుండి... ఏ పనీ **చేయకుండా... ఎప్పుడూ ఏ వాలు కుర్చీలోనో, మడత మంచంలోనో పడుకుని... నక్షత్రాలను లెక్కిస్తూ కాలం గడిపే మనిషి... బ్రతికి వుండీ 'పాడె' మీద పడుకున్న 'శవం' తో సమానం !**

ఎప్పుడూ...

మన్ను తిన్న పాములా నిస్సత్తువుగా వుండకుండా- మనుషులందరూ చురుగ్గా... మెరుపు వేగంతో చరచరా దూసుకెళ్ళే 'కోడెనాగు'లై సాగినపుడు... ఏ దేశమైనా వాయువేగ, మనోవేగంతో అభివృద్ధి చెందుతుంది !

*16-10-1995*



# అంకితభావం

"మా బాస్‌కేం ? కార్లో తిరుగుతాడు! మేడమీద మేడ కడ్తాడు ! ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు నా బ్రతుకులో మాత్రం ఏ మార్పూ ఉండదు ! నేను 'ఎవడి' కోసమో శ్రమిస్తే - 'వాడే' బాగుపడ్తాడు! వాడెవడో తను 'ఒక్కడే' బాగుపడటానికి నేనెందుకు ఒళ్ళు గుల్ల చేసుకోవాలి ?" అని కార్మికుల మనసు రగిలి 'చిత్తశుద్ధి'తో పని చేయకపోతే.... సదరు ఫ్యాక్టరీకి నష్టాలొచ్చి 'సిక్‌యూనిట్' అయిపోతుంది!

"పెట్టుబడి నాది ! తెలివితేటలు నావి! 'శ్రమ' ఒక్కటే వాడిది ! అంతమాత్రాన నా లాభాల్లో ప్రతిఏటా వాళ్ళకి వాటా ఇవ్వాలా?" అని పెట్టుబడిదారులు గింజుకుంటూ- 'సమస్య' లోతు అర్థం చేసుకోకపోతే... కడుపుమండి - కార్మికులు విప్లవ శంఖం పూరిస్తారు ! కమ్యూనిస్ట్ దేశాల వైపు తమ చూపు సారిస్తారు!

**తీరా విప్లవం ఫలించి - సోషలిస్ట్ వ్యవస్థ ఏర్పడ్డాక -**

"నేను నాకోసమే శ్రమిస్తే 'నేను' బాగుపడ్తాను గానీ ఇలా 'అందరి' కోసం శ్రమిస్తే ప్రత్యేకంగా నాకేమిటి లాభం ? అందరికీ లాభం కల్గించే పనికోసం - నేను మాత్రమే ఎందుకు

రెక్కలు ముక్కలు చేసుకోవాలి? ఏదో పని చేస్తున్నట్టు నటిస్తే పోలా ?'' అనే ఉదాసీనత - ఏ కమ్యూనిస్ట్ వ్యవస్థనైనా కూకటి వేళ్ళతో పెకిలించేలా చేసి - భూమి గుండ్రంగా వున్నట్టు - తిరిగి ప్రజాస్వామ్యం వైపు మొగ్గుచూపేలా చేస్తుంది!

కార్మికుల కడుపు మంటో, ఉదాసీనతో, యజమానుల స్వార్థమో, శ్రమదోపిడో, కారణం ఏదైతేనేం - ఒకరు సమ్మెలకీ, మరొకరు లాకౌట్లకీ సిద్ధపడ్తే -

ఇద్దరూ కలిసి 'శ్రమ విలువ' ని తుంగలో తొక్కితే -

దేశంలో ఉత్పత్తి పడిపోయి.... జీవన ప్రమాణం తగ్గి - దేశాభివృద్ధి కుంటుపడిపోతుంది!

మానవశక్తి అపారంగా లభించే మన దేశంలో - తమలో శక్తి సామర్థ్యాలున్నా శ్రమించడానికి ఇష్టపడని వ్యక్తులు కొందరైతే... ఒళ్ళు దాచుకోకుండా శ్రమిస్తూ శ్రమ దోపిడీకి గురవుతోన్న వాళ్ళు మరికొందరు!

శ్రమదోపిడిని నివారించడానికీ, నిరోధించడానికీ మన దేశంలో

లేబర్ యూనియన్లున్నాయి !

'సోషల్ అవేర్‌నెస్' ఉంది !

కార్మిక చట్టాలున్నాయి !

కానీ....

తమ 'శ్రమశక్తి'నుపయోగించని మనుషుల మూలంగా - ఎన్ని అద్భుతాల్నయినా సృష్టించగల 'మానవశక్తి' ఎలా


నిరుపయోగమై పోతోందో.... విశ్లేషించే ప్రయత్నాలు దేశంలో ఎక్కడా జరక్కపోవడం మన బాధ్యతారాహిత్యానికి చిహ్నం.

**సోమరితనం, ఉదాసీనతల 'చెద'సోకితే... ఏ 'ఇజం' అది ఎంత గొప్పదైనా సరే మొదలంటా కుప్పకూలిపోతుంది !**

'పనీ పాటాలేని వాడి మనస్సు దెయ్యాల కార్ఖానా' అన్నట్లు.... మనిషి తన శక్తిని ఉపయోగించుకుని - తనను తాను 'బిజీ' గా ఉంచుకోవడం ద్వారా - అన్ని దురాలోచన లనూ దూరంచేసుకోగల్గుతాడు!

పనిలో 'అంకితభావం' ఒక్కటే...

మనిషిలోని అన్ని రుగ్మతలనూ తరిమికొట్టి మనసుకి తేజస్సునిచ్చి - మనిషి చేత ఎవరూ నమ్మలేని 'పరమాద్భు తా'ల్ని చేయిస్తుంది!



*01-11-1995*



# నిజాయితీ

కొందరు తమ బాస్ చూస్తున్నారనుకుంటే - అక్కడికేదో ఆఫీస్ పనంతా తమ భుజస్కంధాల మీదే జరిగిపోతున్నట్టు హడావిడి చేస్తారు! బాస్ కనుసన్నల్లో పడేదాకా పడరాని పాట్లుపడుతూ..... బాస్ కనుమరుగైన మరుక్షణం..... కుర్చీలో చేరగిలబడి కునుకుదీస్తారు !

కొంతమంది ఫోన్ తమదైతే తాళమేసుకుంటారు. అదే ఆఫీస్ ఫోనయితే అటూ ఇటూ చూసి.... తమని ఎవరూ చూట్టం లేదన్న ధీమాతో పోచికోలు కబుర్లన్నీ గంటల తరబడి ఎస్టీడీల్లో చెప్పుకుంటారు !

మరికొంతమంది బజార్లో తమకేదైనా 'పర్సనల్ పని' ఉందనుకుంటే 'ఆఫీస్ పని' సాకుతో - ఆఫీస్ కార్లో బయల్దేరి - 'ఆఫీస్ పని మూరెడు - పర్సనల్ పని బారెడు' చేసుకుని వస్తారు !

మనవి కాని వస్తు వాహనాలను వాడుకోవాలనుకోవడం-

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం -


ఫ్రెంచి లీవుల్తో పని ఎగ్గొట్టడం -

చేస్తోన్న పనిలో అలసత్వం -

తదితర కారణాలన్నీ.... ప్రభుత్వరంగ సంస్థల్ని నష్టాల ఊబిలోకి నెట్టి, ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపేలా చేస్తాయి!

తాము చేస్తోన్న పనిని ఒకరు గమనిస్తున్నారన్న 'ప్రత్యేక స్పృహ' ఏదీ తెచ్చి పెట్టుకోకుండా - **తమపై 'నిఘా' ఉన్నా లేకున్నా- తమ పనిని తాము సజావుగా, నిజాయితీగా చేసుకునే ఉద్యోగులు జాతి ప్రగతికి పట్టుకొమ్మలు !**

అది ప్రభుత్వ సంస్థగానీ - ప్రైవేటు సంస్థగానీ - ఉద్యోగులందరూ నిజాయితీగా ఆయా సంస్థల ఆస్తికి 'ధర్మకర్త'ల్లా వ్యవహరించినపుడే - ఏ సంస్థయినా విజయ పథంలో పయనిస్తుంది! లాభాల సిరుల్ని పండిస్తుంది!



*16-11-1995*




# సాంత్వన

మనిషి....

- కష్టాల కడలిలో కొట్టుకుపోతున్నప్పుడు కాస్త నిలదొక్కుకునే 'ఆసరా' కోసం వెదుకుతాడు!

- యాంత్రిక జీవితంలో అలసిపోయినప్పుడు అది అరక్షణమైనా సరే 'ఉల్లాసం' కావాలనుకుంటాడు !

- అనారోగ్యంతో మూలుగుతున్నప్పుడూ, ఓటమితో కుంగిపోతున్నప్పుడు తన అక్కున తీసుకుని 'సేద' దీర్చే మనిషిని కోరుకుంటాడు.

మనకత్యంత ప్రియమైన వాళ్ళని కోల్పోయి - 'ఆ మనిషి ఇక కన్పించడు' అనే వూహ వచ్చినపుడు గుండెల్లోంచి దుఃఖం తన్నుకు వస్తుంది. ఆప్తుల రాకతో కట్టలు తెంచుకుని కన్నీళ్ళ రూపంలో బయటికి వస్తుంది !

కొంతమంది మనుషులు కన్నీళ్ళతో తమ బరువును దించుకోచూస్తే- కన్నీళ్ళని గుండెల్లోనే చిక్కబట్టుకొని గరళ కంఠులవుతారు మరికొందరు!

అలాంటి విషాద సమయాల్లో మనం ఏడిస్తే నవ్వుదామని చూసే కొంతమంది శాడిస్టుల కంటికి మన కన్నీళ్ళనీ, దుఃఖాన్నీ కన్పించనీకుండా రక్షక కవచంలా నిలబడే చలువ కళ్ళద్దాలే... కొన్నిసార్లు సాటి మనుషుల కపటపు పలకరింపుల కన్నా ఎనలేని 'సాంత్వన' నిస్తాయి.

మనకిష్టంలేని నాయకులు మరణించినపుడు సానుభూతి ప్రకటించి ఆ కుటుంబ సభ్యులకు 'ఉపశమనం' కల్గించక పోతే పోనీ గానీ, చాటుమాటుగా 'అమ్మయ్య ! చచ్చాడు - పీడా వదిలింది!' అంటూ స్వీట్లు పంచుకోవటం, జోకులేసుకోవటం మన పైశాచిక ప్రవృత్తిని ప్రస్ఫుటం చేస్తుంది.

ఏదేమైనా - మన పరిచయస్తులు తమ ఆప్తుల్ని కోల్పోయి -పుట్టెడు దుఃఖంతో బాధపడ్తున్న సమయంలో - మన 'పరామర్శ' - మండే హృదయాలకి శీతలపవనంలా సోకి 'ఊరట' కలిగించాలే తప్ప, - పుండు మీద కారం చల్లినట్టో - వేసని కాలపు వడగాల్పులా ఈడ్చీడ్చి కొట్టినట్టో వుండకూడదు !

1-3-1996




# మౌనం

మన చుట్టూ వుండే మనషుల్లో కొందరు సరదాగా వుండటం... మరికొందరు గంభీరంగా, మౌనంగా వుండటం చూస్తూ వుంటాం.

నవ్వుతూ నవ్విస్తూ వుండే వాళ్ళు అందర్నీ ఆకట్టుకుంటే, మౌనంగా వుండేవాళ్ళు ఎదుటివాళ్ళని అల్లంతదూరంలో వుంచేస్తారు.

ఎప్పుడూ సరదాగా వుండేవాళ్ళు అనుకోకుండా శృతిమించి మాట్లాడినప్పుడు తమ హాస్యం వికటించి ఎదుటివాళ్ళు తమని ఏరకంగా అపార్థం చేసుకున్నారో తెలిసొచ్చి అవాక్కయిపోవడమో, ఖిన్నులయిపోవడమో చూస్తూ వుంటాం!

అయితే.... అందరూ నవ్వుతూ వుండే సందర్భాల్లో... 'మౌనం'గా ఉన్నా - విషాద సమయాల్లో.. జోకులేసుకుంటూ 'సరదా'గా వున్నా - చూసేవాళ్ళకి ఎబ్బెట్టుగా, 'వీళ్ళేం మనుషులబ్బా?' అనుకునేట్టు చేస్తుంది.

కొందరు తెలిసీ తెలీక ఏవో తప్పులు చేస్తారు. తెలీక చేసిన తప్పులయితే... 'ఫర్వాలేదులే' అని క్షమించి వదిలేస్తారు వాళ్ళ పెద్దవాళ్ళు. కాని తెలిసి చేసిన తప్పులకి వాళ్ళని అటు దండించనూ లేక, ఇటు క్షమించనూ లేక.... 'మౌనముద్ర' వహిస్తారు

కొందరి తలిదండ్రులు.

ఇలాంటి సమయాల్లో తప్పు చేసినవాళ్ళు 'సున్నిత మనస్కు'లైతే... వాళ్ళకి వాళ్ళ పెద్దవాళ్ళ మౌనంకన్నా 'పెద్దశిక్ష' మరోటి ఉండదు!

ఒకవేళ తప్పుచేసిన వాళ్ళు 'దులిపేసుకునే' తత్వమున్న వాళ్ళయితే, వాళ్ళు తమ తలిదండ్రుల మౌనాన్ని 'చేతగాని తనం'గా భావించి - మరింత పెట్రేగి, పతనమైపోతారే తప్ప తమని తాము సంస్కరించుకోలేరు!

ఇహపోతే రాజకీయాల్లో- ప్రత్యర్థులు తమ ఉనికి చాటుకోవడం కోసం చేసే కొన్ని చౌకబారు ఆరోపణలకి స్పందించి సమాధానమిచ్చేకన్నా- అధికారం కోసం, ఆస్తి కోసం - అధికార పక్ష కుటుంబ సభ్యులు వీధి కెక్కిన సంఘటనలపై ప్రతిపక్ష రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను ప్రకటించి 'సంచలనం' సృష్టించాలనుకునేకన్నా - 'నో కామెంట్' అంటూ మౌనంగా వుండిపోవడమే 'హుందా'గా వుంటుంది!

అలా అని అన్నింటికీ మౌనమే శ్రేష్టమైందనే భావనతో 'హింస'ని కూడా కిమ్మనకుండా భరిస్తూ వుంటే - తప్పుడు ఆరోపణలకు సముచిత రీతిలో సమాధానమివ్వకుండా 'ఉదాసీన వైఖరి' అవలంభిస్తే - అది మన 'అసహాయత'గా భావించి మరింత బాధించడానికే చూస్తారు కొందరు! అలాంటప్పుడు పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రంలా అన్నింటికీ మౌనం వహించకుండా- 'నోరువిప్పి' ప్రతిఘటించే శక్తిని అలవరచుకోవాలి!

16-3-1996




# చొరవ

మనలో కొందరికి ఎంతమంది జనంలోకైనా చొరవగా దూసుకెళ్ళి ఏ పనైనా అవలీలగా సాధించే నేర్పూ, చొరవా, ధీరోదాత్త గుణాలు కన్పిస్తాయి! అందరిచేతా 'హీరో'ల్లా కీర్తించబడి నల్గురి దృష్టినీ ఆకర్షిస్తారు !

మరికొందరు పదిమంది ముందుకు వెళ్ళాల్సివచ్చినపుడు - కట్టెలా బిగిసుకుపోతారు! అందరి కళ్ళూ తమ మీదే 'ఫోకస్' అవుతున్నాయన్న సంగతి స్ఫురణకు వస్తే - కాళ్ళు తడబడి పోతాయి! గొంతు తడారిపోతుంది. ఇదీ అని చెప్పలేని ఇబ్బందితో సతమతమైపోతారు! ఎప్పుడూ ఎవరో ఒకరి కొంగుచ్చుకుని వారి నీడలో నడవడానికే ప్రయత్నిస్తూ 'పిరిగ్గొడ్డు'ల్లా పేరు పడిపోతారు.

'చొరవలేని గోల్డ్ మెడలిస్ట్' నాలుగు గోడల మధ్యే ఉండి పోవడం -'చొరవ ఉన్న శుంఠ' ప్రపంచాన్ని చుట్టి రావటం చూసినపుడు... తెలివితేటలకీ, జీవితంలో రాణించడానికీ ఏమాత్రం సంబంధంలేదన్న విషయం స్పష్టమై ఆశ్చర్యం కలుగుతుంది.

కొన్నిసార్లు అనుకోకుండా అవకాశాలు మన ఇంటి తలుపు

తట్టినపుడు మనలో అర్హత వున్నా... చొరవ లేకపోతే - కలిసి వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకున్నవాళ్ళమవుతాం!

ఏదేమైనా మనకి తెలీని విషయాన్ని తెలుసుకోవడానికో, మన సందేహాలను తీర్చుకోవడానికో చొరవ చూపితే తప్పులేదు గానీ -ఎదుటి వాళ్ళ అంతరంగిక విషయాల్ని తరిచి తరిచి అడగడానికో - వాళ్ళ కట్టూ, బొట్టూ, వస్త్రధారణలపై మన ఆయాచిత సలహాలను గుమ్మరించ డానికో చొరవ చూపితే మన 'అతి చొరవ'కి ఒళ్ళుమండి - ఎదుటి వాళ్ళు నొసలు చిట్లించడమో - మరీ మొహమాటంలేని వాళ్ళయితే మన మొహం మీదే 'ఇట్స్ నన్నాఫ్ యువర్ బిజినెస్' అని చీదరించు కోవడమో చేస్తారు.

ఏదైనా... ఒక పని చేయడానికి - మొహమాట పడేవాడూ... బిడియపడే వాడూ - అభిమానపడేవాడూ జీవితంలో దేన్నీ సాధించలేడు!


అలాగని...

ఒకర్ని అప్పు అడగడానికి... మొహమాటపడాల్సిన చోట -

ఒకరి పర్సనల్ రూమ్‌లోకి చొచ్చుకుపోవడానికి బిడియ పడాల్సిన చోట -

ఒకర్ని దేబిరించడానికి అభిమానపడాల్సిన చోట -

'చొరవ' ప్రదర్శిస్తే అది వికటించి - సదరు వ్యక్తి నల్గుర్లో చులకనయ్యే ప్రమాదం ఏర్పడుతుంది.



*1-4-1996*




# సానుభూతి

ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడలాడిస్తోన్న ఎయిడ్స్ గురించి తరచూ ఏదో ఒక పేపర్లో వార్తలు చదువుతూవుంటాం!

వ్యాధి ఏదైనా అది విజృంభించి మానవాళిని కబళించకుండా ఎప్పటికప్పుడు ప్రజల్ని ఎజుకేట్ చేస్తూ తదనుగుణంగా ప్రభుత్వాన్ని స్పందించేలా వార్తలు రాయటం విలేకర్ల తక్షణ కర్తవ్యం!

కాని ఎక్కడో - ఎవరికో ఆ వ్యాధి సోకిందని తెలిసినపుడు ఉరుకులూ, పరుగుల్తో వాటిని సేకరించి - ఆ వ్యాధి పీడితుల పేర్లూ, చిరునామా తాటికాయలంతేసి అక్షరాల్తో పత్రికల్లో ప్రచురించడం చూస్తూ ఉంటాం!

అసలే ఆ వ్యాధి సోకిందని పుట్టెడు దిగులుతో మంచమెక్కిన మనిషికి... ఈ దెబ్బతో గోరుచుట్టుపై రోకటిపోటులా... తోటి వాళ్ళ బహిష్కరణ తోడై - శ్రీశ్రీ చెప్పినట్లు 'నిద్రకి వెలియై - నే నొంటరినై - చీకటిగదిలో నాగులతో'... గడుపుతున్నట్టుగా బ్రతుకు దుర్భరమై - సదరు రోగులు మనఃస్థైర్యాన్ని దెబ్బతీస్తుందన్న సంగతి విలేకరులు దృష్టిలో పెట్టుకోవాలి !

వార్తలు మనిషిలో సానుభూతినీ, కరుణ రసాన్నీ పెంపొం

దించేవిగా లేకుంటే పోనీగానీ - తోటి మనిషిని చూసి జడుసుకుని... అతణ్ణి ఇంట్లో ఏకాకిని చేసి- ప్రాణ భయంతో పరుగులు తీసేలా వుండకూడదు!

విందులకీ, వినోదాలకీ - పెళ్ళిళ్ళకీ, ఒకరిళ్ళకి మనం వెళ్ళకున్నా తరిగేదీమీ ఉండదు! కానీ దీర్ఘ రోగాల్తో బాధపడే వాళ్ళకి కనీసం వీలున్నప్పుడైనా సానుభూతిని ప్రకటించి - వారిలో జీవితేచ్ఛ కల్గించక పోతే -

**చనిపోయిన వాళ్ళని స్మశానంలో దహనం చేసే సాంప్రదాయ మున్న సమాజంలో...**

**బ్రతికున్న మనిషికి ఇంట్లోనే చితి పెట్టిన రాక్షసులమనిపించు కుంటాం!**

పోతే సానుభూతి అన్నివేళలా అందరి పట్లా ప్రకటిస్తే - అది దుష్ఫలితాలకు దారితీస్తుంది.

ఒంట్లో శక్తిఉండీ - కష్టపడడానికి ఇష్టపడని ముష్టివాడికి... 'దయగల తల్లులు' అడిగినప్పుడల్లా అన్నంపెడ్తూంటే... జీవితాంతం అతడు 'సోమరిపోతు'గానే ఉండిపోవాలను కుంటాడు!

తన కష్టాలకూ, కన్నీళ్ళకూ మరొకర్ని కారణం చేస్తూ - తన దుస్థితికి వేరొకర్ని నిందిస్తూ... ఒకరి సానుభూతినీ, సాయాన్నీ అర్థించేవాడు ఆజన్మాంతం 'అభిమాన హీనుడు'గానే పేరు పడిపోతాడు!

ఎవరైనా రాజకీయనాయకులు... హత్యలకు గురైనపుడు - సానుభూతి వెల్లువలా ప్రవహించి, ఎంతోమంది అనామ కులు... 'తంతే బూర్ల బుట్టలో పడ్డట్లు'గా ఎన్నిక కావడం - తమ నియోజకవర్గాలకి ఎంతో సేవచేసిన అభ్యర్థులు...

'నామరూపాల్లేకుండా కొట్టుకు పోవడం' చూసినప్పుడు సానుభూతి పవనాల ధాటికి ఓటర్ల' 'విచక్షణ' దూదిపింజలా ఎగిరిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది!

ఎవరైనా రాజకీయ నాయకులు - తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజల ముందు ఏకరవు పెడ్తూ బావురుమన్నప్పుడు కొందరికి 'అయ్యో పాపం!' అని గుండె ఆర్ద్రమై - వాళ్ళకోసం ప్రాణాలు సైతం ధారపోయాలన్నంత వీరావేశం కల్గితే- మరికొందరికి అలాంటివన్నీ జనం దృష్టినాకర్షించే ఎత్తుగడలుగా తోచి - అంతకుముందున్న సానుభూతి కూడా హరించుకుపోయి జుగుప్స కల్గుతుంది.

అయితే 'అసలు కన్నీళ్ళకీ - మొసలి కన్నీళ్ళకీ'.... 'వెన్నుపోట్లకీ - తిరుగుబాట్లకీ' తేడా తెలుసుకోకుండా, తాత్కాలిక ఆవేశకావేశాలకి లోనై ఓటు హక్కు వినియోగించుకుంటే - 'చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహదేవా' అన్నట్లు - అటు మింగలేకా ఇటు కక్కలేకా సతమతమయ్యే దుస్థితి ఓటర్లకి ఏర్పడుతుంది.

ఏదో ఒక 'ప్రభంజనం'లో గుడ్డిగా కొట్టుకుపోకుండా - కాసులకో, మద్యానికో అమ్ముడు పోకుండా - ఓటర్లు తమ 'విచక్షణ'ని ఉపయోగించి - అభ్యర్థుల సామర్థ్యానికీ, మంచితనానికీ విలువ ఇచ్చి గెలిపించినపుడు - పాలితులందరికీ స్వచ్ఛమైన పాలకులు లభిస్తారు!

16-4-1996




# స్పృహ

ఏదైనా రైలు ప్రమాదమో, రోడ్డు ప్రమాదమో జరిగినప్పుడు చెల్లా చెదురుగా పడిపోయిన మృతదేహాల ఫోటోలనూ, తీవ్రంగా గాయపడి 'స్పృహ' కోల్పోయిన వాళ్ళ ఫోటోలనూ అప్పుడప్పుడూ మనం పత్రికల్లో చూస్తూవుంటాం!

సమాచార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటోన్న నేపథ్యంలో - ఏదైనా ఒక ప్రమాదం జరిగినపుడు - ఆ 'న్యూస్'ని సాటి పత్రికలకన్నా ముందుగా 'ఫ్లాష్' చేద్దామన్న 'తొందర'లో... ఆ బీభత్సాన్ని 'సహజం'గా, కళ్ళకి కట్టినట్టుగా అందిద్దామన్న 'తపన'తో ఫోటోగ్రాఫర్లు ఉన్నదున్నట్లుగా ఫోటోలు తీయడం... వాటిని ఎడిట్ చేయకుండా పత్రికాధిపతులు యథాతథంగా ప్రచురించడం పాఠకుల దురదృష్టం!

తమ బంధుమిత్రుల దుర్మరణమే ఓ వైపు కృంగదీస్తూంటే - మోకాళ్ళదాకా తొలిగిపోయిన బట్టలతో - ఎలాంటి ఆచ్ఛాదనా లేని గుండెలతో.... ఆడవాళ్ళ ఫోటోలు పత్రికల్లో... టీ.వీ.ల్లో లక్షలాది పాఠకులకి దర్శనమిచ్చినపుడు.... రక్త సంబంధీకుల మనసు క్షోభిస్తుందన్న 'స్పృహ' - ఎవరికీ

లేకపోవడం విచారించదగ్గ విషయం !

ఇహ - అస్తమానం ఏదో ఒకటి వాగే వాగుడుకాయలు - చాలాసార్లు తామేం మాట్లాడుతున్నారో తమకే తెలీకుండా మాట్లాడ్డం గమనిస్తూ వుంటాం! తాగిన మైకంలో 'స్పృహ' లేకుండా ఏదేదో వాగడం వేరూ, 'స్పృహ'లోనే ఉండీ, స్పృహలేనట్టు ఏమిటేమిటో వాగడం వేరు.

అది ఏ వాగుడైనా... శృతి మించినపుడు..

'ఏయ్! ఒంటిమీద స్పృహ ఉండే మాట్లాడుతున్నావా ?' అని ఎదుటివాళ్ళు అలాంటి వాగుళ్ళకి కళ్ళెం వేయడానికి ప్రయత్నించడం చూస్తూ ఉంటాం !

అన్నింటికన్నా విచిత్రమైన విషయం కొంతమంది మనుషుల్లో 'పరిసరాల స్పృహ' ఇసుమంతైనా లేకపోవడం!

ఇలాంటి వాళ్ళు ఎక్కడో ఏ బాత్రూంలోనో ఎవరికంటా పడకుండా చేసుకోవలసిన పనులను అక్కడికి అవేవో అందరి ముందూ చేసుకోగలిగే అతి సహజమైన పనుల్లా....

ముక్కులో వేలు పెట్టి గిరగిరా తిప్పడం...

శరీరంమీద ఎక్కడబడితే అక్కడ బరబరా గోక్కోవడం...

తింటోన్న వాళ్ళదగ్గర 'బర్ర్'మని చీదడం...

ఎక్కడంటే అక్కడ 'యాక్ థూ' అని ఉమ్మేయడం -

ఇంటి వాకిట్లో కూర్చుని తన్మయత్వంగా పేలు చూసుకోవడం....

కొన్ని వేల మంది ప్రయాణీకుల కంటపడ్తామన్న స్పృహైనా లేకుండా - వచ్చే పోయే రైళ్ళకి ఇరుపక్కలా... తీరుబడిగా


కాలకృత్యాలు తీర్చుకోవడం -

చూసేవాళ్ల కడుపులో దేవినట్లు చేస్తాయి!

'పరిసరాల స్పృహ' మనిషిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచి - అందరి మన్ననలకీ పాత్రం చేస్తే - 'స్పృహలేని తనం' సభ్య సమాజానికి ఒళ్ళు జలదరించేలా చేస్తుంది!

అజ్ఞానం, అవిద్యల మూలంగా అమాయకపు పల్లెజనులు, 'నిరక్షరాస్యులు' అనాగరికంగా ప్రవర్తించినపుడు - సరిపెట్టుకోవచ్చునేమోగానీ.....

కార్లలో తిరుగుతూ, సూటూ, బూటూ వేసుకొని - ఆడవాళ్ళు న్నారన్న స్పృహ కూడా లేకుండా - 'కుళ్ళు' జోకులతో జుగుప్స కలిగించేలా బూతులు మాట్లాడే 'విద్యావంతుల'ను జాతి క్షమించలేదు!



*16-05-1996*




# విమర్శ

మననెవరూ విమర్శించేవాళ్ళు లేరనుకుంటే - మనం అసాధారణ ప్రజ్ఞాదురంధరులమనీ - భూలోకవాసుల్ని ఉద్ధరించడానికి ఎక్కడి నుండో ఊడిపడ్డ మహామహులమని మనని మనం గొప్పగా అభివర్ణించుకుంటాం !

అలాంటి సందర్భాల్లో... ఒక 'చిన్న విమర్శ'..... మూసుకు పోతోన్న కళ్ళు తెరుచుకొనేలా - ఎక్కడో గాల్లో తేలిపోతోన్న పాదాలను నేలమీద ఆనేలా - చేస్తుంది !

'విమర్శ' మనిషిలో బుసకొట్టే నియంతృత్వాన్ని అదుపులో పెట్టి అతడి దూకుడికి కళ్ళెం వేస్తుంది. విమర్శే లేకపోతే మనిషి ఆగడాలకు పట్టపగ్గాలుండవు. తను చేసిన తప్పులన్నీ ఒప్పులుగానే తలపోస్తాడు.

అయితే మనిషి ఎదుగుదలకి 'విమర్శ' ఎంత అవసరమైనా - విమర్శలో వెట'కారం' ఎక్కువైతే - ఆ ఘాటుకి దిమ్మదిరిగి సొమ్మసిల్లిపోతాడు విమర్శకు గురైన వ్యక్తి! ఆ దెబ్బతో అతనిలోని సృజనాత్మకశక్తి కుంటుబడిపోతుంది!

కొందరు మనసులో కొందరిపట్ల ముందే కొన్ని 'పూర్వ భావన'లు (Prejudice) ఏర్పరుచుకుంటారు. వాళ్ళపట్ల తమ

అభిప్రాయం 'నెగిటివ్' అయితే - వాళ్ళు మంచి పనిచేసినా అందులో చెడే వుందని విమర్శిస్తారు. ఒకవేళ 'పాజిటివ్' అయితే - వాళ్ళలో చెడు తొంగిచూసినా మంచివాళ్ళేనని సర్టిఫికెటిస్తారు. అంతేగానీ వాళ్ళ పట్ల అంతకు పూర్వం తామేర్పరచుకున్న అభిప్రాయాల్లో వివక్ష వుందనీ, ఎదుటి వాళ్ళ వ్యక్తిత్వం పట్ల ముందే ఒక అవగాహనకి రావడం తప్పనీ - 'ఆత్మవిమర్శ' చేసుకోరు!

ఒక మనిషిలో ఎన్ని చెడు గుణాలున్నా - వాళ్ళ మంచి గుణాలను మాత్రమే దర్శించి వాళ్ళని మెచ్చుకోగలిగే 'మహానుభావులు' ఏ నూటికో కోటికో ఒక్కరుంటే; ఒక వ్యక్తిలో అన్నీ మంచి లక్షణాలే వున్నా - అతడిలో కనిపించే ఒకటీ, అరా చెడు లక్షణాలను భూతద్దంలో చూపెట్టి, 'వాడలాంటి వాడూ - ఇలాంటి వాడూ' అని విమర్శించే 'సామాన్యులు' కోకొల్లలుంటారు !

కొందరు రాజకీయ నాయకులు - ప్రజలు తమని ఎక్కడ మరిచిపోతారో అని తమ ఉనికిని చాటుకోవడానికి - అడపాదడపా పత్రికా ప్రకటనల ద్వారా స్వపక్షీయులు, విపక్షీయులు అనే విచక్షణ లేకుండా ఎవర్నో ఒకర్ని విమర్శిస్తూ పేపర్లో పైసా ఖర్చు లేకుండా 'పబ్లిసిటీ' పొందాలనుకుంటారు!

నిజానికి ఏదో విధంగా వార్తలకెక్కి - ప్రతినిత్యం పేపర్లో తమ పేర్లు చూసుకుని మురిసి, తరిద్దామన్న యావ తప్ప, ఇలాంటి వాళ్ళకు ప్రజా సమస్యలు పట్టవు!

ఒక వ్యక్తిలో గానీ, రచనలో గానీ 'లేని దోషాల'ను అంటగట్టి - 'ఉన్న సద్గుణాల' ను ఉద్దేశపూర్వకంగా మరుగు పరిచి - అతడిలోని ఉత్సాహపు పొంగుమీద నీళ్ళు చిలకరిస్తూ,

అతడి అభిప్రాయాలకి వక్ర భాష్యాలుచెప్పడం : **కువిమర్శ** (Destructive Criticism)

ఒక రచనలోని ఏ 'చెడు' అంశం పాఠకుల మెదళ్ళని ఏ రకంగా కలుషితం చేస్తుందో, ఏ 'మంచి' అంశం పాఠకుల మనసుల్ని ఏ విధంగా వికసింపచేస్తుందో - సరదాగా, సున్నితంగా - ఆయా రచయితలు నొచ్చుకోకుండా - వాళ్ళ కలాలని అభ్యుదయ పథంలో నడిపించేలా సమీక్షకుడు విశ్లేషించ గలగడం: **సద్విమర్శ** (Constructive Criticism)

నిష్కల్మష హృదయులు సదుద్దేశంతో సద్విమర్శల ద్వారా మనిషి 'ఎదుగుదల' కి తోడ్పడ్తే - కుత్సిత స్వభావులు దురుద్దేశంతో కువిమర్శలకి పూనుకుని ఆ మనిషిలోని సర్వశక్తుల్నీ 'చచ్చుపడేలా' చేస్తారు!

కువిమర్శ వ్యక్తిని నిరాసక్తునిగానో, 'విరక్తునిగానో, జడునిగానో, మొండివానిగానో మారిస్తే, సద్విమర్శ వ్యక్తిలోని లోపాలను సవరించి... అతని సంస్కారానికి మెరుగులు దిద్ది.... ప్రగతిపథం వైపు దూసుకు పోయేలా చేస్తుంది!

*01-06-1996*




# నిగ్రహం

మనిషై పుట్టాక ప్రతి మనిషికీ ఏదో ఒక సమస్య వుంటుంది ! అయితే పిడుగులుపడ్డా చలించని మనఃస్థైర్యం కొందరికుంటే చిన్న సమస్యకే బావురుమనే బేలతనం మరి కొందరికుంటుంది.

దుర్భలమనస్కులు తమ కష్టాలనీ, కన్నీళ్ళనీ లోలోపల దాచుకోలేరు! ఎవరికో ఒకరికి చెప్పుకోనిదే ఉపశాంతి పొందలేరు! ఇలాంటి 'పీత కష్టాల' జీవులు - తమకేదో ఒక 'అవుట్ లెట్' లేకపోతే ఎక్కడ బర్స్ట్ అయిపోతామో అన్నంత అసహనంగా ఉంటారు! అలా ఏదో ఒక బలహీన క్షణంలో ఇతరులతో చెప్పుకున్న తమ వ్యక్తిగత విషయాలు ఆ తర్వాత పబ్లిక్ సీక్రెట్సై నల్గురి నోళ్ళలో నానినపుడుగానీ వాళ్ళకి నిగ్రహం ప్రాముఖ్యతేమిటో తెలిసిరాదు!

మాట్లాడే నాలుకనీ, చూసే కంటినీ, వినే చెవినీ, స్పృశించే చర్మాన్నీ, ఆఘ్రాణించే ముక్కునీ - మనిషి తన ఆధీనంలో వుంచుకోవడం... వాటి ప్రభావానికి చలించే మనస్సుకి పగ్గాలు వేసుకోవడమే... నిగ్రహం!

గుండెల్లోంచి దుఃఖం లావాలా పైకి ఎగజిమ్మినప్పుడు -

ఏ మనిషైనా కంటతడిపెడ్తాడు! ఒక సినీ కవీశ్వరుడు చెప్పినట్టు - కన్నీళ్ళనేవి 'గుండె మంటలార్పే చన్నీళ్ళే' అయినప్పటికినీ....

**చీటికీ మాటికీ ముక్కు చీదేసే వ్యక్తుల్ని, ప్రతి చిన్న విషయానికీ నిగ్రహం కోల్పోయి గొంతు చించుకుని ఎదుటివాళ్ళపై విరుచుకుపడే అసహనపరుల్ని... సభ్యసమాజం అదోలా చూస్తుందన్న సంగతి ఏ వ్యక్తీ విస్మరించకూడదు!**

ఆగ్రహావేశాలు నిగ్రహానికి బద్ధశత్రువులు! ఆవేశంగానీ - ఆవేదన గానీ హద్దు మీరినపుడు - మనిషి తానేం చేస్తున్నాడో తనకే తెలీని ఉన్మాదంలో పడిపోతాడు! అలాంటి వాళ్ళే హత్యలకీ - ఆత్మహత్యలకీ పాల్పడడం - పిచ్చివాళ్ళుగా మారడం చూస్తూ ఉంటాం!

అందుకే -

చెదిరిపోవడానికి సిద్ధంగా ఉన్న మనసుని అదుపులో పెట్టుకోవడం, ముంచుకొచ్చే ఆవేశాన్ని పంటిబిగువున అదిమిపట్టుకోవడం, కురవడానికి సిద్ధంగా ఉన్న కన్నీళ్ళను కంటి కొసన కట్టిపడేయడం... ఏ మనిషికైనా ఆరోగ్యదాయకం, శ్రేయస్కరం!

అలా అని...

ఎదుటివాళ్ళు కవ్విస్తూ, గిల్లికజ్జాలు పెట్టుకుంటూ అదే పనిగా రాళ్ళు రువ్వుతున్నప్పుడు.... ప్రతిఘటించకపోవడం 'దున్నపోతు' లక్షణం అనిపించుకుంటుందే తప్ప 'నిగ్రహం' అనిపించుకోదు!

*01-08-1996*




# సమన్వయం

ఏదైనా ఒక సంస్థ మొలకగా ఉన్నప్పుడు - ఆ సంస్థని నడిపించడానికి కేవలం ఒక అధికారి మాత్రమే సరిపోతాడు - సదరు సంస్థ శాఖోపశాఖలుగా విస్తరించినపుడు, తదనుగుణంగా అధికారుల సంఖ్య కూడా పెంచవలసివస్తుంది!

అధికారుల సంఖ్య పెంచకుండా సంస్థని విస్తరించుకుంటూ పోతే, ఆ 'ఏకైక అధికారి' మీద పని ఒత్తిడి అధికమై - చేసే పనిలో అలసత్వం, మొక్కుబడితనం చోటుచేసుకుంటాయన్న సంగతి 'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' పట్టభద్రులందరికీ తెలిసిన విషయమే!

అయితే -

ఏ సంస్థలోనైనా ప్రారంభదశలో - కేవలం ఒక వ్యక్తి మాత్రమే అన్ని వ్యవహారాలనూ చక్కదిద్దుకోగల్గినప్పటికీ - ఆ తర్వాత్తర్వాత రోజుల్లో పరిపాలనా సౌలభ్యం కోసం - శ్రమవిభజన, అధికార వికేంద్రీకరణ అవసరమై - మేనేజర్, సబ్ మేనేజర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సూపరింటెండెంట్, అకౌంటెంట్ తదితర కొత్తపోస్టులు సృష్టించబడతాయి!

ఒక్కో పనికి ఒక్కో అధికారి జవాబుదారీయై- అందరూ కలిసి ఆ సంస్థ బాగోగులకి 'సమిష్టి బాధ్యత' వహించాల్సిన అవసరం ఏర్పడ్తుంది !

అయితే ఇలాంటి సందర్భాల్లో ఆది నుండీ సంస్థని అంటిపెట్టుకుని అన్నాళ్ళూ ఏకఛత్రాధిపత్యం వహించిన సీనియర్ అధికారులకి - జూనియర్ అధికారుల 'రాక' మింగుడుపడక; జూనియర్ అధికార్లకి - సీనియర్ల 'ఉనికి' కొరుకుడుపడక - ఆయా అధికారుల మధ్య సమన్వయం లోపించి- అభివృద్ధి కుంటుపడటం కొన్ని సంస్థలలో చూస్తూ వుంటాం!

సీనియర్లు జూనియర్ల ఉత్సాహపు పొంగు మీద నీళ్ళు చిలకరించే ప్రయత్నం చేసినా- జూనియర్లు సీనియర్ల సలహాలని పెడచెవిన పెట్టాలని చూసినా... అదంతా చివరకు చిలికి చిలికి గాలివానై సదరు అధికారుల మధ్య 'కోల్డ్‌వార్'కి దారి తీస్తుంది.

"నువ్వేంటి నాకు చెప్పేది ? నువ్వేమైనా నాకు సుపీరియర్వా ? ఈ సంస్థలో నువ్వెంతో నేనూ అంతే ! వియారీక్వల్స్!" అని జూనియర్లు సీనియర్ల పెద్దరికాన్ని తుంగలో తొక్కి గ(య్ గ(య్‌మని అరిచినప్పుడు....


"ఏదో పెద్దవాణ్ణి కదా అని సలహాలివ్వబోతే గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టు... 'ఇట్స్‌నన్నఫ్ యువర్ బిజినెస్!' అంటాడా - ఆఫ్టరాల్ నా జూనియర్ - అడ్మినిస్ట్రేషన్‌లో ఏబీసీడీలు తెలీనివాడు?" అని సీనియర్లు జూనియర్ల దుందుడుకు తనానికి ఒంటికాలి మీద లేచినప్పుడు.....

సంస్థలో అనారోగ్యకరమైన వాతావరణం చోటుచేసుకుని ఊపిరాడనట్టుగా ఉంటుంది!

సంయమనం కోల్పోయి అనుచితంగా ప్రవర్తించే అధికారులకి ముక్కుతాడేసి - నోళ్ళు మూయించి - సక్రమ పద్ధతిలో నడిపే 'సమన్వయకర్త' లేకపోతే - సంస్థలోని అధికారులదీ, ఉద్యోగులదీ తలోదారై అడ్మినిస్ట్రేషన్‌లో ప్రతిష్టంభన ఏర్పడుతుంది!

**ఎవరెంత రెచ్చగొట్టినా రెచ్చిపోకపోవడం: సంయమనం!**
**రెచ్చిపోయిన వాళ్ళందర్నీ అదుపులో పెట్టడం:**
**సమన్వయం!**

మొదటిది ఉదాత్త లక్షణమైతే- రెండోది నాయకత్వ లక్షణం! ఈ రెండు లక్షణాలూ పుణికి పుచ్చుకున్నవాడు - 'గొప్ప పరిపాలనాదక్షుడు' అనిపించుకుంటాడు!



*16-8-1996*




# కుతూహలం

సిన్సియర్‌గా పని చేస్తూ, ఒక్క రోజైనా లీవ్ తీసుకోవడానికి ఇష్టపడని వ్యక్తి వరుసగా నాల్రోజులు డ్యూటీకి రాలేకపోతే...

“ఎప్పుడూ లీవ్ తీసుకోని వాడు నాలుగు రోజులనుంచీ రావట్లేదంటే- కొంపదీసి జరక్కూడనిది ఏదైనా జరగలేదు కదా ! అతడి పక్కింటి పాపారావుని అడగాలి - ఏమైందో?”

- అనుకోవడంలో ఆ వ్యక్తి పట్ల కన్సర్న్, ఆదుర్దా వ్యక్తమైతే-

“ఆ - జరక్కూడనిది ‘ఏదో’ జరిగే ఉంటుంది! లేకపోతే ఎప్పుడైనా లీవ్ పెట్టేవాడా- ఏమన్నానా? వాడి ఎదురింటి వెంకట్రావుని అడిగి తెలుసుకోవాలి - అసలేమైందో?”

- అనుకోవడంలో ఆ వ్యక్తి పట్ల అవాంఛనీయమైన ‘కుతూహలం’ స్పష్టమౌతుంది!

ఎదుటివాడి క్షేమసమాచారం విషయంలో ఆదుర్దాపడటం మానవత్వమనిపించుకుంటే - అతి కుతూహలంతో ఎదుటివాడి ‘కూపీ’లు లాగి - మసాలా జోడించి - దుష్ప్రచారం చేసి - హింసించడం దానవత్వం అనిపించుకుంటుంది!

కుతూహలాన్ని ఆపుకోలేని కొందరు ఇతరులకు వచ్చిన ఉత్తరాల్ని గుట్టు చప్పుడుకాకుండా మాయంచేసి - ఎక్కడో ఎవరూ గమనించని చోట తీరిగ్గా చదివేసి - ఆనక చించి పోగులు పెట్టి చెత్త బుట్టలో పడేస్తుంటారు ! సదరు

చిరునామాదారుడికి చేరాల్సిన ముఖ్యమైన సమాచారాన్ని అతనికి చేరకుండా చేయడమే కాక - నలుగురితో అతడి వ్యక్తిగత విషయాల్ని కథలు కథలుగా చెప్తూ తమ వక్రబుద్ధి చూపెట్టుకుంటారు!

మనిషిలోని కుతూహలమే మనిషి బలహీనతగా మారినప్పుడు - పత్రికల్లో ఎక్కడ చూసినా 'గాసిప్స్' దర్శనమిస్తాయి!

**పైసా ఖర్చులేకుండా - పది నిమిషాల్లో - ప్రజల నాలుకలమీదుగా ప్రపంచాన్నంతా చుట్టి వచ్చే ప్రచార సాధనం - గాసిప్స్!**

మొన్న 'రేఖ ప్రేమాయణం' - ఒక వార్త!

నిన్న 'డయానా విడాకులు' - ఒక వార్త!

నేడు 'ప్రియాంక పెళ్ళి' - ఒక వార్త!

ఒకరి అంతరంగిక విషయాల్ని తాటికాయలంతేసి అక్షరాలతో పత్రికల్లో ప్రకటించడం - ప్రజలు దాన్ని లొట్టలేస్తూ చదవడం చూసినపుడు - విజ్ఞులైన పాఠకుల మనసు కలుక్కుమంటుంది - కకావికలమై పోతుంది !

**మనిషిలోని కుతూహలం... మనిషి 'జిజ్ఞాస'కి జీవం పోసి - మరిన్ని క్రొంగొత్త విషయాలను తెలుసుకునేలా చేయాలే తప్ప అదో రుగ్మతగా మారకూడదు !**

ఏదేమైనా అజ్ఞానాన్ని రూపుమాపుకునే దిశలో - తెలియని విషయాల్ని తెలుసుకోడానికి 'కుతూహలం' ప్రదర్శిస్తే తప్పులేదు గాని - ఒకరి వ్యక్తిగత విషయాలను తెలుసుకోవడానికి మనం 'ఉబలాటపడటం'- క్షమార్హం కాదు!

01-09-1996




# తృప్తి

'అమ్మయ్య ! ఈ రోజు నేను అనుకున్నది సాధించాను! నాకెంత తృప్తిగా ఉందో?' అనుకున్న కొన్నాళ్ళకే... మనిషి మనసులో మరో యాంబిషన్ మొలకెత్తి, దానికోసం ఆరాటాలూ, పోరాటాలూ మొదలవుతాయి !

'ఈ మనిషి ఇలా ఇంకా ఎన్నింట్లో వేలెడ్తాడు? ఆశకు అంతుండాలి! ఉన్నవి సరిపోలేదా ? ఇంకా ఇంకా సంపాదించాలన్న తపన ఎందుకో? ' అనుకుంటారు అతనంటే గిట్టని వాళ్ళు.

కేవలం డబ్బుమీదే కాపీనం ఉన్న వ్యక్తులకైతే ఒక రంగం చాలు ! పది రంగాలు అక్కర్లేదు ! చిట్‌ఫండ్స్ రంగంలో రారాజులా వెలిగిన వ్యక్తి చిట్‌ఫండ్స్ నిర్వహణతో సరిపెట్టుకోలేదు, పత్రికలూ, పచ్చళ్ళూ, సినిమాలూ, టీవీ ఛానళ్ళూ - వాట్‌నాట్... ఒక దానితో ఒకటి సహసంబంధంలేని రంగాలు ఎన్నుకొని ఘనవిజయం సాధించడం చూసాం.

ఇలాంటి వ్యక్తులు  ఒకదానితో తృప్తిపడి 'ఇహ చాల్లే' అనుకునే అల్ప సంతోషులు కారు. తమ శక్తి సామర్ధ్యాలతో

ఎప్పటికప్పుడు ఎవరి ఊహకీ అందని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న తపన - వాళ్ళు వేసే ప్రతీ అడుగులో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.ఒక పని పట్ల తపన, అది సఫలీ కృతం కావడానికి చేసే నిర్విరామకృషి మాత్రమే ఇలాంటి వాళ్ళకు తృప్తినిస్తాయి !

ఏదైనా ఒక పని పూర్తి చేస్తున్నప్పుడు అందులో ప్రతీదీ సవ్యంగా వుండాలనుకుంటారు కొందరు ఆఫీసర్లు! లోపమేదైనా కన్పిస్తే సర్లెమ్మని సరిపెట్టుకోరు! చేస్తోన్న పనిలో పర్ఫెక్షన్ వస్తేగానీ సంతృప్తిపడని ఇలాంటివాళ్ళు తమ బుర్రలకే గాక తమ సబార్డినేట్స్ బుర్రలక్కూడా 'పదును' పెట్టి వాళ్ళని కూడా తమలాగే చాకుల్లా తయారుచేస్తారు!

మన చుట్టూ ఉండే మనుషులని పరికిస్తే - కొందరు ఎప్పుడు చూసినా ఏ చీకూ చింతా లేకుండా - ఎంతోతృప్తిగా, హాయిగా వున్నట్టు కన్పిస్తారు ! వాళ్ళ సన్నిహితులకి వాళ్ళ సమక్షం ఎంతో తృప్తినిస్తుంది!

మరి కొందరు తమకెన్ని ఉన్నా - ఎప్పుడూ ఏదో దిగుల్తో.... అక్కడికీ భూ భారాన్నంతా తమ భుజస్కంధాల మీదే మోస్తు న్నట్టుగా అసంతృప్తిగా వుంటారు! ఇలాంటివాళ్ళతో సహ వాసం వాళ్ళ కుటుంబ సభ్యులకు నిప్పులకుంపట్లో కూర్చు న్నట్టు - దుర్భరంగా ఉంటుంది !

మన సాన్నిధ్యం ఎదుటి వాళ్ళ అసంతృప్తిని పటాపంచలు చేసేదైతే... మన దగ్గరికి జనం పొలోమని క్యూలు కడ్తారు! మన అసంతృప్తి ఎదుటివాడి తృప్తిని కకావికలం చేసేదైతే

మనని చూసి అదే జనం పారిపోవడం మొదలెడతారు!

తృప్తి అనేది అరచేతిలో పాదరసం లాంటిది! అది దొరికినట్టే దొరికి చేజారిపోతుంది! తమ గుప్పిట్లో దీన్ని పదిలంగా కాపాడుకోగలిగే వ్యక్తులు ప్రతి ఇంటా కనీసం ఒక్కరైనా ఉన్నప్పుడు... మనం ఏ ఇంటి గడప తొక్కినా - నవ్వుతూ దర్శనమిచ్చే మనుషులు కనిపించి - తృప్తిగా హాయిగా, ఆహ్లాదకరంగా ఫీలవుతాం!

*1-11-1996*




# నమ్మకం

మనం అధికారంలో ఉన్నప్పుడు మన ప్రాపకం కోసం ఎందరో అర్రులు చాస్తారు!

కొందరిని అవసరానికి మించి చేరదీస్తాం! మరి కొందరిని అనుకోకుండా దూరాన వుంచుతాం!

అయితే మనం అదరించి చేరదీశాకే నల్గురి దృష్టిని ఆకర్షించిన వాళ్ళూ, మన మూలంగానే తమ అస్తిత్వానికో గుర్తింపు తెచ్చుకున్నవాళ్ళు.. మనకే ఎసరు పెట్టి, మన సీట్ నాక్రమించుకోవాలని చూసినప్పుడు సహజంగానే మన హృదయం బరువెక్కుతుంది !

అలా అని మన పట్ల జరిగిన నమ్మకద్రోహాన్ని అందరి ముందూ ఏకరువు పెడ్తూ నల్గురికీ వినోదం కల్గించకుండా 'మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచి' పోతే హుందాగా ఉంటుంది ! మన డీసెన్సే మనకో ప్లస్ పాయింటవుతుంది!

నిజానికి 'స్వయం ప్రకాశక శక్తి' ఉన్న వాళ్ళు - నమ్మక ద్రోహానికి గురైనప్పుడు సంయమనం పాటించి - తగు సమయం కోసం నిరీక్షిస్తారే తప్ప తమకింత అన్యాయం జరిగింది - అంత అన్యాయం జరిగిందంటూ గగ్గోలు పెట్టరు.

మనని కంటికి రెప్పల్లే కాపాడుకుని, మనం అంచెలం చెలుగా ఎదగడానికి దోహదపడిన యజమానికి మనం ఎప్పుడో

ఏ బలహీన క్షణంలోనో 'నమ్మకద్రోహం' తల పెట్టాలనే ఆలోచన మనకొచ్చినప్పుడు - అతడికి మన మీదున్న 'విశ్వాసం' గుర్తొచ్చి - మనలో అలాంటి చెడు తలంపులు వచ్చినందుకు సిగ్గుపడి వెనక్కి తగ్గుతాం!

అదే క్షణాన -

మన సొంత సంస్థల్లే - ఎంతో నిజాయితీగా పని చేస్తున్నప్పటికీ చెప్పుడు మాటలకు లోనై మన యజమాని మన ప్రతి కదలికనూ తన ఎక్స్‌రే కళ్ళతో పరికిస్తూ, మనవి అనుమానిస్తున్నాడనే భావన తలెత్తినప్పుడు - "ఇన్నాళ్ళూ 'విశ్వాసంగల కుక్క'లా ఈ సంస్థలో ఎందుకు పడి వున్నామా?" అని అభిమానపడి తప్పుకోచూస్తాం!

కొందర్లో 'అభద్రతా భావం' అవసరానికి మించి వుంటుంది! ప్రతి పనీ 'గుట్టు'గా చేయాలనుకుంటారు ! ఇలాంటి వాళ్ళు ఎవర్నీ విశ్వసించరు కాబట్టి నిజమైన స్నేహితులంటూ ఎవరూ మిగలరు !

మరి కొందర్లో 'అమాయకత్వం' అధిక పాళ్ళలో వుంటుంది! ఇలాంటి వాళ్ళు అందర్నీ నమ్మి - చెప్పాల్సినవీ, చెప్పకూడనవీ అన్నీ చెప్పేసి - గొంతు మీదికి తెచ్చుకుంటారు.

అయినా, ఎదుటి వాళ్ళని 'నమ్మాలా వద్దా' అని తర్కిస్తూ - కొందరు మంచి వ్యక్తుల సాహచర్యాన్ని అనుభవించే అదృష్టాన్ని దూరం చేసుకునేకన్నా - కొన్ని ఎదురు దెబ్బలు తిన్నాసరే - ఎదుటి వాళ్ళని నమ్మి జీవితంలో ఎన్నో గుణపాఠాలూ తద్వారా జీవిత సత్యాలూ నేర్చుకోవడం మంచిది!

16-12-1996




# నమ్రత

'రామారావు గారి అమ్మాయి మంచిపిల్ల. ఎంతో 'అణకువ!'

"సుబ్బారావుగారి అమ్మాయి చురుకైంది. ఎంతో 'నమ్రత'!"

మన చుట్టూఉన్న సమాజంలో అడపాదడపా విన్పించే ఈ బాపతు కాంప్లిమెంట్లు... ఏ అమ్మాయి వ్యక్తిత్వం ఎలాంటిదో తేటతెల్లం చేస్తాయి!

మొదటి కాంప్లిమెంట్‌ని 'ఇన్సల్ట్'గా, రెండో కాంప్లిమెంట్‌ని 'క్రెడిట్'గా గ్రహించక పోతే సదరు అమ్మాయిలందరూ ఇంకా అమాయకత్వంలోనే వున్నట్లు భావించాల్సి ఉంటుంది.

ఎందుకంటే....

'అణకువ' (Submissiveness) లో- ఎంత అణిచివేతకి గురైనా కిక్కురుమనని బానిసత్వ (Slavery) లక్షణం వుంటుంది! ఇలాంటి వ్యక్తులు తమ ఆత్మగౌరవాన్ని 'చంపుకుంటూ', ఎదుటి వాళ్ళ గౌరవాన్ని 'కాపాడా'లని చూస్తారు.

'నమ్రత'(Modesty) ఉట్టిపడే వ్యక్తుల్లో... సౌమ్య స్వభావం,

స్వాభిమానం (Self respect) దాగి ఉంటాయి. ఈ తరహా వ్యక్తులు తమ గౌరవాన్ని తాము 'కాపాడుకుంటూ', ఎదుటి వాళ్ళపట్ల 'అదరం'గా వుంటారు.

అణకువ, నమ్రత - రెండూ ఒకటికావు! ఒకదానికొకటి పర్యాయ పదాలుగా వాడే ఆ రెండు పదాల అర్థాల్లో - నిజానికి ఎంతో వైరుధ్యం వుంది.

పెద్దల పట్ల అధికారుల పట్ల మనం చూపే 'అణకువ'లో... బిడియం, అసహాయత, పిరికితనం, లొంగుబాటుతనం తొంగిచూస్తే: 'నమ్రత'లో... ఆత్మ గౌరవం, వివేచన, ఇతరుల పట్ల ఆదరణా ద్యోతకమౌతాయి!

ఇండియాలో పుట్టి, ఇండియాలోనే పెరిగి- అమెరికాలో రెండేళ్ళు చదివి ఇరవై రోజుల కోసం వచ్చే అబ్బాయిలు....

"అబ్బబ్బ ! ఏం డస్ట్ - ఏం పొల్యూషన్! ఈ ఇండియాలో ఇంకా వారం రోజులెలా గడపాలో ఏమో!? ఒరేయ్ చింటూ - ఆ మినరల్ వాటర్ బాటిల్ ఇలా పట్రారా" అంటూ డాంబికాలు ప్రదర్శించినపుడు - వినేవాళ్ళకి చాచి లెంపకాయ కొట్టాలన్నంత కంపరం కలిగితే-

"మా పొరుగింటావిడకి వాళ్ళ అమ్మాయి పీజీ, అబ్బాయి పిహెచ్డీ అని ఎంత టెక్కో? వాళ్ళకే అంత పొగరుంటే - మరి మా అమ్మాయి ఎమ్సెట్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చింది... అబ్బాయి యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాడు! మరి మాకెంత గర్వం ఉండాలి?" అని చెప్పుకునే కబుర్లలో గీర, అతిశయం, భేషజాలు కన్పించి - వినేవాళ్ళకి చిరాకు కల్గుతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే..... **నమ్రత అంటే హుందా తనం!**

తన స్వశక్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించినా - తన విజయానికి కారణం తన స్వయంకృషి ఒక్కటే కాదు - తన సహచరుల సమిష్టి కృషి అని చెప్పుకునే వ్యక్తిలో 'హుందా తనం' ఉట్టిపడుతుంది.

తను హీరో - ఎదుటివాడు జీరో అనుకోవడం 'అతిశయం' (Vanity)

తను హీరో అయినా - జీరోల విలువని విస్మరించక పోవడం - 'నమ్రత' (Modesty)

కార్లూ - బంగళాలూ, అందం, డిగ్రీలూ ఏవీ ఇవ్వలేని 'డిగ్నిటీ'.... మనిషికిచ్చేది... ఆ వ్యక్తి 'వినమ్రత!'

*16-3-1997*



# అధికారం

అధికారం ఓ మత్తు మందు! ఒకసారి రుచి చూసిన మనుషులు దాన్ని వదల్లేని వ్యసనపరులవుతారు. అధికారం దూరమైతే బ్రతకలేరు. అందుకే - అధికారం దక్కించుకోవడా నికి పడరాని పాట్లుపడుతూ వుంటారు. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడ్తారు. అవసరమైతే కాళ్ళూ గడ్డాలూ పట్టుకుంటారు.

అయితే - తమ కష్టఫలితంగానో, అప్పనంగానో, గాలి వాటునో, ప్రజల అమాయకత్వం మూలంగానో ఏదో ఒక రోజు అధికారం అనూహ్యంగా సంక్రమించడంతో - సదరు నాయకుల ఛాతీ పది అంగుళాల ముందుకు ఉప్పొంగు తుంది!

మొదటి సంవత్సరం... అధికారాన్ని పదిలం చేసుకోవ డానికి రకరకాల ఎత్తు గడలకు పాల్పడతారు. మెజార్టీ తగ్గితే ప్రభుత్వం ఎక్కడ కూలిపోతుందోనని - ప్రతిపక్ష పార్టీల నాయకులకు 'బిస్కట్లు' విసిరి, పార్టీ ఫిరాయింపులకు తెర తీస్తారు.

'అధికారంలో వున్న ప్రభుత్వంతో ఎందుకొచ్చిన తంటా - అందులోనే చేరితే నిశ్చింతగా వుండొచ్చు! ఈ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి రాలేకపోతే పోయిందేముంది - అప్పుడు

మరోసారి ఫిరాయించొచ్చు' అనుకుంటూ అధికారపార్టీ అధినేతల ముందు పాలోమని 'క్యూ' కడతారు జంప్ జిలానీలు. లొంగిన వారికి ఆలింగనాలు, కొత్త కండువాలు, మూతికి తాళాలు.

రెండో సంవత్సరం... వేగులు అన్ని వర్గాల ప్రజల అసంతృప్తి ఛాయల వాసన పసిగట్టి - ప్రభువులకు నివేదిస్తారు. ఎక్కడ తమ పీఠానికి ఎసరు వస్తుందోనన్న శంక ప్రభువుల మనసును తొలిచి వేస్తుంటుంది. అంతే - అందరినీ ఏదో ఒక అభద్రతకు గురిచేయడం ద్వారా తాము భద్రంగా వుండొచ్చనుకుంటూ - తదనుగుణంగా పథకాలు రచిస్తారు.

ఇక చేతిలోవున్న యంత్రాంగాన్ని వినియోగించి - అన్ని వ్యాపారాలలో... ఏ చిన్న లొసుగు దొరికినా - దాన్నో అవకాశంగా తీసుకొని, ఆధారం చేసుకొని, ఆయా వర్గాల గొంతునొక్కే ప్రయత్నాలు చేస్తారు.

ఏ ప్రజల ద్వారా తమకు ఆ అధికారం సంప్రాప్తించిందో - ఆ ప్రజలనీ, కార్యకర్తలనీ మరిచిపోతారు. భౌభౌమని అరిచే కుక్కలని పసిగట్టి, అవి కిక్కురుమనకుండా బొక్కలేస్తారు, వాటినే ఉసిగొల్పి విపక్షాలపై తమ కసి తీర్చుకుంటారు.

ఇక తమ ప్రభుత్వ మనుగడకి ఢోకాలేదన్న నమ్మకం కలిగిన మరుక్షణం పాలకులు విజృంభిస్తారు. ఎవర్నీ లెక్కచేయనితనం తలకెక్కుతుంది. తీరా అది నిర్లక్ష్యానికీ, నియంతృత్వానికి దారితీస్తుంది.

ఎక్కడ చూసినా... గప్‌చుప్! అప్రకటిత ఎమెర్జెన్సీ!!

రాజరికంలోనైనా రాజభవనాల ముందు గంటకొడితే ప్రత్యక్షమయ్యే రాజు కథల్ని విన్న ప్రజలకి... ప్రజాస్వామ్య

వ్యవస్థలో ప్రజాసమస్యలను నివేదించడానికి-ప్రజాప్రతి నిధు లకే ఇంటర్వ్యూ దొరక్కపోవడం విడ్డూరం కలిగిస్తుంది!

మూడో సంవత్సరం... ప్రజలకి ఏదో చేస్తున్నామని చూపించుకోవడానికి ఒక మతాన్ని మచ్చిక చేసుకుంటారు, మరో మతంపై వరాల ఝల్లులు కురిపిస్తారు. ఒక కులానికి అరచేతిలో వైకుంఠం చూపిస్తారు. మరో కులాన్ని అయోమయంలోకి నెడతారు.

పేపర్లలో ఒక రోజు ఒక పథకం, మరో రోజు మరో పథకం పేర అనునిత్యం ప్రకటనలు గుమ్మరిస్తూ - తామేదో జనాన్ని ఉద్ధరించడానికి వచ్చిన బాహుబలులమని ప్రజలని భ్రమింపజేస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామంటూ నోటిఫికేషన్లు ఇస్తారు. మళ్ళీ అవి వాయిదాపడేలా ప్రభువులే తమ అనుచరులతో కోర్టుల్లో కేసులు వేయిస్తారు.

ఇక నాలుగో సంవత్సరం... అదిచేస్తాం, ఇదిచేస్తామని నమ్మబలికి చివరికి ఏమీ చేయలేక తామేది చేయబోయినా ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయంటూ తప్పుకోజూస్తారు. తమ చేతగానితనానికి - చచ్చిన ప్రతిపక్ష పాములను పదేపదే చావగొడుతూ తమ పుణ్యకాలం వెళ్ళదీస్తారు.

తమ వైఫల్యాలకి ఎక్కడో దూరంగా వున్న కేంద్ర ప్రభుత్వాన్ని బూచిగా చూపి దుమ్మెత్తిపోస్తారు. ఒకవేళ కేంద్రంలోనే తమ ప్రభుత్వముంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తారు.

కానీ, ప్రజలు ఎప్పుడూ 'మార్పు'ని కోరుకుంటారు. ఏ అభివృద్ధి కోసం ఉద్యమాలు చేపట్టారో , ప్రభుత్వం మారాలనుకున్నారో, పాలకులు తమని పట్టించుకోవాలనుకున్నారో... అదంతా మిథ్య, శూన్యం, కల అని తెలిసినపుడు - కుతకుతా ఉడికిపోతారు. సహనం నశించి, సరియైన అవకాశం కోసం

ఎదురు చూస్తుంటారు.

పాలకుల్లో...

సభని మంత్రముగ్ధుల్నిచేసే వ్యక్తులున్నా -

తరతరాల వారసత్వ నేపథ్యమున్న నేతలున్నా -

ప్రజల్ని సమ్మోహితుల్ని చేసే సినీ గ్లామరున్నా -

ప్రజల 'ధర్మాగ్రహ సునామీ' ముందు గడ్డిపోచల్లా కొట్టుకుపోతారు. వటవృక్షాల్లాంటి మహానేతలు కూడా మట్టికరుస్తారు.

మాటలతో ప్రజల్ని ఎల్లకాలం బురిడీ కొట్టించలేమన్న స్పృహ పాలకులకు లేకపోతే-'బలవంతమైన సర్పం చలి చీమల చేత చిక్కి చావదె సుమతీ' అన్నట్టు బాధితప్రజలందరూ ఒక్కటై-ఎన్నికల సమయంలో బుద్ధిచెప్తారు.

అధికారం అలా అటకెక్కుతుంది! చుట్టూ ముసిరిన ఈగలు చెల్లాచెదరై పోతాయి. ఇల్లూ, ఆఫీసూ బోసిపోతాయి. వందిమాగధులు ముఖం చాటేసి - కొత్త ప్రభువుల మ్రోల వాలుతారు. అనుచరగణం పాత కండువాలు తుంగలో తొక్కి, కొత్త కొలువులో సరికొత్త కండువాలతో కొలువు దీరుతారు.

సామ్రాజ్యం కోల్పోయిన ప్రభువులు -

'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు'- అని విషాద రాగాల పల్లవులందుకుంటారు!

01-04-1997




# గౌరవం

'మీ ఇంట్లో వాళ్ళకి మర్యాదలు తెలీదు - నాకు గౌరవం లభించని చోటుకి నేనస్సలు రానే రాను - నువ్వూ వెళ్లొద్దు'- అని భార్యని శాసించే భర్తకీ -

'మీకసలు ప్రొటోకాల్ తెలుసా? స్టేజీమీద బ్యానర్‌లో నా పేరు అంత చిన్న అక్షరాల్తో వేస్తారా...' అని చిందులు తొక్కే ప్రజానాయకుడికీ-

'నాకు రెస్పెక్ట్ ఇవ్వని వాళ్ళ సంగతి చూస్తాను! ఏ ఆదిలాబాదు అడవులకో ట్రాన్స్‌ఫర్ చేసి తిక్క కుదురుస్తా!...' అనే బాస్‌కీ -

నిజానికి గౌరవం గురించి ఏమీ తెలీదనుకోవాలి!

తమవ్యక్తిత్వానికి ఎదుటివాళ్ళు ముగ్ధులై - వారి హృదయాల్లోంచి అసంకల్పితంగానే వచ్చే మర్యాదే గౌరవమనీ - అది తాము ఆదేశిస్తే దొరకదనీ - అలా శాసించడం ఒక రకంగా యాచించడం లాంటిదన్న స్పృహ అలాంటి వ్యక్తులకు ఈషణ్మాత్రం వుండదు.

ఇకపోతే...

డబ్బూ, పాపులారిటీ, అధికారం మూడూ దండిగా వుండేది

రాజకీయ రంగమైతే - కేవలం పాపులారిటీ, డబ్బూ రెండు మాత్రమే వుండేది సినిమారంగం.

అందుకే సినిమా రంగలోని వ్యక్తులు కూడా రాజకీయాల్లో ప్రవేశించేందుకు ఉవ్విళ్ళూరుతారు. ఆ రెండు రంగాలకే మీడియాలో అంత కవరేజీ వుంటుందని సామాన్య జనంలో రాజకీయాలన్నా, సినిమాఫీల్డ్ అన్నాపడి చచ్చేంత మోజుంటుంది.

నిత్యం టీవీల్లో దర్శనమిచ్చే సినీ హీరోలకీ, క్రీడాకారులకీ, సినీ గాయకులకీ - బయటకొస్తే చాలు, జనం తమ వెంట వేలం వెర్రిగా, చెమటలు కక్కుతూ పరుగులు తీసే పాపులారిటీ వుంటుంది.

తీరా-

అంత పాపులారిటీ సాధించిన వ్యక్తులు.. ఏ డ్రగ్స్ సరఫరాచేసో, దొంగనోట్ల పంపిణీ తదితర కుంభకోణాల్లో ఇరుక్కుపోయో కటకటాలు లెక్కించడం చూసి అప్పటిదాకా ఎక్కడో కలల ప్రపంచంలో విహరిస్తోన్న వీరాభిమానులు ఒక్కసారిగా తుళ్ళిపడి వాస్తవలోకంలోకి వచ్చిపడతారు.

'ఛ! దేశగౌరవాన్ని మంటగలిపిన ఇలాంటి వాళ్ళకోసమా ఇన్నాళ్ళూ ఫ్రెండ్స్‌తో వీర లెవల్లో వాదించి చొక్కాలు చింపుకున్నాం!' అని అభిమానులు ముఖం చాటేసినపుడు...పాపులారిటీకీ - గౌరవానికీ మధ్య నున్న పలుచటి తేడా అర్థమై, పాపులారిటీ వున్నవాళ్ళందరూ గౌరవించదగ్గవాళ్ళు కారన్న సత్యం జనానికి తెలిసొస్తుంది!

అయితే-

గౌరవాన్ని వ్యక్తీకరించే మార్గాల్లో ప్రోటోకాల్ ప్రకారం చేసేవి

కొన్ని అయితే తమ ప్రతిభా పాటవాలతో దేశానికి పేరు తెచ్చిన వారి గౌరవార్థం చేసేవి మరికొన్ని!

జాతీయ పండుగల సందర్భంగా - దేశనాయకులు తమకి 'పదవీ'పరంగా దక్కే గౌరవ వందనాలను సైనికులు, పోలీసుల కవాతుల ద్వారా స్వీకరిస్తారు.

దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికులు చనిపోయినపుడు వారిపట్ల గౌరవ సూచికంగా పార్థీవ దేహం పై జాతీయ జెండాను కప్పి, తమ గౌరవాన్ని చాటుకుంటారు.

అద్భుత విజయాన్ని సాధించి, దేశానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన క్రీడాకారులను ఏనుగు అంబారీమీదో, గుర్రపు బగ్గీమీదో, ఓపెన్‌టాప్ జీప్‌మీదో ఎక్కించి - మేళతాళలతో బ్యాండ్ వాయిద్యాలతో, పూలు జల్లుతూ తమ హర్షాన్ని వ్యక్త పరుస్తారు.

సంపద వల్లో, హోదా వల్లో, కొనుక్కుంటేనో గౌరవం దొర కదు! అవతలివారి అసాధారణ విజయాలవల్లో, నిస్వార్థమైన సేవల వల్లో అద్భుతమైన కళలవల్లో ప్రభావితులై - ఇవతలి వారు తమ మనసుల్ని పూల గుత్తులుగాచేసి సమర్పించే బహుమతి- గౌరవం!

అలాంటి గౌరవాన్ని చిన్నవాళ్ళయితే - భుజాన్ని తట్టడం, చేతిని, నుదిటిని ముద్దాడటం కరచాలనం చేయడం, ఆలిం గనం చేసుకోవడం - పెద్దవాళ్ళయితే కాళ్ళకి దండం పెట్టడం ద్వారా ఎవరిష్టమైన రీతిలో వాళ్ళు చాటుకుంటారు.

అయితే కోడిగుడ్డుకు ఈకలు పీకే స్వభావమున్న కొందరు... ప్రతి పనిలోనూ తప్పునే వెతికే రంధ్రాన్వేషకులు... కాళ్ళని మొక్కడం కూడా ఓ తప్పుగా, బానిసత్వ లక్షణంగా ఎద్దేవా

చేస్తారు.

సృష్టిలో అన్ని ప్రాణులూ సమానమే అనుకునే ఇలాంటి సోకాల్డ్ అభ్యుదయవాదులకి - దేహంలోని అన్ని అవయవా ల్లోకీ 'కాళ్ళు' మాత్రమే చాలా నీచమైనవిగా తోచడం శోచ నీయం!

ఇకపోతే... ప్రభుత్వానికి కాకాలు పడుతూ, బాకాలు ఊదుతూ వుండే కొందరు అత్యంత సులభంగా అందలం ఎక్కుతారు.

ఎక్కిన మరుక్షణం ఎవర్నీ లక్ష్య పెట్టరు, గౌరవించరు సరి కదా తనని మాత్రం అందరూ గౌరవించాలని కోరు కుంటారు. అతడికి ఆస్థాయి ఎలా వచ్చిందో తెలిసిన వాళ్ళకి.... ఇక గత్యం తరం లేని పరిస్థితుల్లో అతడి పట్ల గౌరవం నటిస్తారు తప్ప- మనస్ఫూర్తిగా గౌరవించరు!

మరికొందరు మహామహులకు దక్కాల్సిన సమయాల్లో ఎలాంటి గౌరవాలూ దక్కవు. సన్నిహితుల బలవంతం మీద ఏదో అప్లికేషన్‌పెట్టి వూరుకుంటారే తప్ప, వాటికోసం ఎలాంటి పైరవీలు చేయరు. ప్రభుత్వాల కాళ్ళూ గడ్డాలూ పట్టుకోరు. అందుకే - ఎప్పుడో రావాల్సిన పద్మభూషణ్‌లు, జ్ఞానపీఠ్ అవార్డులు... వారికి కాటికి కాళ్ళుజాపిన వేళ్ళనో, నడవలేని స్థితిలో వున్న సమయంలోనో, ఏ తొంభైయేళ్ళ వయసులోనో అందుకోవడం... విజ్ఞుల మనసుకి ఒకింత బాధను కలిగి స్తుంది!

దేశాన్ని తల్లిగా భావించి, నిరాకారమైన ప్రేమ భావనకు 'భారతమాత'గా సాకారాన్ని కల్పించడం కూడా గౌరవంలో ఒక భాగమే! అయితే ఎనలేని ఉద్వేగంతో చెట్నూ, చేమల్నీ,

కొండా కోనల్ని, వాగూ వంకల్నీ, ఊరూ వాడల్నీ, చివరికి సొంతింటి గోడల్ని ముద్దాడుతూ - వాటిపట్ల గౌరాభిమానాల్ని చాటుకునే కొందరు... దేశమాతను విమర్శించడమే విడ్డూరం కల్గిస్తుంది! ఇలాంటి మనుషులు మరింత మితిమీరి - 'భారతదేశంలో ఇన్ని వస్త్రధారణలుండగా - భారతమాతకి చీరే ఎందుకు' అని ప్రశ్నించడం వారి పర్వర్టెడ్‌నెస్‌కి అద్దం పడ్తుంది.

భిన్నత్వంలో ఏకత్వం కోసం... విభిన్న వస్త్రధారణలున్నచోట - ఏకత్వానికి ప్రతీకగా 'చీర' కి అగ్రతాంబూలం ఇచ్చారన్న స్పృహ ఏమాత్రం వున్నా - వాళ్ళు అలాంటి చెత్త ప్రశ్నలు సంధించరు.

ఏది ఏమైనప్పటికినీ...

ఏదేశంలోనైనా ప్రజల నుండి 'అత్యున్నత గౌరవం' దక్కేది కేవలం ఆ దేశ జాతీయజెండాకీ, జాతీయ గీతానికి మాత్రమే! అందుకే వాటిపట్ల జాతి యావత్తూ నించుని తమ గౌరవాభిమానాలు చాటుకుంటుంది. అలాంటి జాతీయ జెండాని, జాతీయగీతాన్ని అగౌరపరిచే వ్యక్తులు అధమాధములు, దేశ ద్రోహులేకాదు, ఆ దేశంలో నివసించేందుకు కూడా అనర్హులే!

*16-04-1997*




# ప్రేమ

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అన్నారో కవీశ్వరుడు.

నిజమే - కొందరు కొందర్ని చూసీ చూడగానే ఇష్టపడతారు! ఎందుకిష్టపడతారో ఆ క్షణంలో వాళ్ళకి తెలీదు. బహుశా వాళ్ళు వారి కలల రాజకుమారులో, రాజకుమార్తెలో కావొచ్చు. వాళ్ళలో వారికి నచ్చిన వేషభాషలో, అందచందాలో, తెలివితేటలో కన్పించవచ్చు!

టీనేజ్ ప్రేమ మరీ చిత్రంగా వుంటుంది! ప్రేమలో పడ్డప్పుడు... ప్రేమ... మత్తుగా, గమ్మత్తుగా వుంటుంది! ఎవరేం చెప్పినా తలకెక్కదు! పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా వుంటాయి! మనసు గాల్లో తేలిపోతున్నంత ఆనందంగా వుంటుంది!

అలా మొదటి 'చూపు'లో జనించే కేవలం ఆయా ప్రేమికుల కంటికి మాత్రమే సంబంధించింది. క్రమేపీ కొన్నాళ్ళకి వాళ్ళ బలహీనతలు తెలిసిపోతాయి!

అప్పుడు - 'ఛ! ఇలాంటి వ్యక్తినా ప్రేమించింది?' అన్న షాక్‌తో మూసుకుపోతోన్న కనురెప్పల్ని ఎంత విప్పార్చుకుందా మని చూసినా - వాలిపోతాయి, చివరికి కోమాలోకే జారి పోతాయి.

అప్పటిదాకా పెను నిద్దరలో వున్న 'వివేకం' మేల్కొం టుంది! జరిగింది తెలుసుకొని 'అయ్యో ! ఇన్నాళ్ళూ అలా స్పృహ లేకుండా ఎలా పడివున్నాను' అని చింతిస్తుంది. ఇప్పటికైనా మెలుకువొచ్చినందుకు సంతోషిస్తుంది!

అంతవరకూ - ఒకరికొకరే లోకంగా బతికిన వాళ్ళు... ఆ నిషా దిగి, ఈ లోకంలోకొచ్చిపడతారు! అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ళ, తల్లిదండ్రుల, స్నేహితుల ప్రేమలన్నీ స్పృహలోకి వస్తాయి!

ఒకరి ప్రేమని పొందటానికి తాము ఎందరి ప్రేమలు పోగొట్టుకున్నారో, ఎందరి మనసుల్ని గాయపరిచారో అవగత మవుతుంది! భూమి గుండ్రంగా వుందన్నట్టుగా - తిరిగి తల్లిదండ్రుల దగ్గరికి పరిగెత్తుకొస్తారు!

కేవలం ఆకర్షణతో మాత్రమే జనించే అలాంటి అపరిపక్వ ప్రేమలు - నీటి బుడగల్లా టప్పున పేలిపోతాయి! ఏ చిన్న సెగ తగిలినా ఆవిరై అదృశ్యమవుతాయి!

★★★

నిజానికి - ప్రేమలోని గాఢత, సాంద్రత... ప్రేమ విఫలమైనపుడు మాత్రమే బయటపడతాయి!

కారణాలు ఏవైనప్పటికీ... ప్రేమ భగ్నమైనపుడు -

'నీ సుఖమే నే కోరుతున్నా' అనుకోవడం... ప్రేయసి పట్ల ప్రేమికుడి అవ్యాజానురాగానికి నిదర్శనమైతే-

'అనురాగం, ఆత్మీయత అంతా ఒక భూటకం' అను కోవడం అతడి వైరాగ్యానికీ -

'రానిక నీ కోసం చెలీ, రాదిక వసంత మాసం' అనుకోవడం అతడి నైరాశ్యానికీ - చిహ్నం!

నిజానికి... వైరాగ్యం, నైరాశ్యం ప్రేమకుడినే కాల్చేస్తాయి గానీ - వాడి 'ప్రేమ'ని కాదు, ప్రేమికురాల్ని అంతకన్నా కాదు!

'నాతో తప్ప నువ్వు ఎవరితోనూ మాట్లాడకూడదు!' అని శాసించడం ప్రేమికుడి ప్రేమ తీవ్రతనీ, పోజెసివ్‌నెస్ నీ ప్రస్ఫుటం చేస్తే - 'నాకు మినహా నువ్వు మరెవరికైనా దక్కావో, నీకు భూమ్మీద నూకలు దక్కకుండా చేస్తా'నంటూ యాసిడ్ దాడులకు పాల్పడటం అతడి పైశాచిక ప్రవృత్తికి అద్దం పడుతుంది!

ఒక్కమాటలో చెప్పాలంటే - ప్రేమికుడి పొసెసివ్నెస్, అపనమ్మకం, శాడిజం - వాడికి ప్రేమనీ, ప్రేమికురాల్నీ, తుదకు సమాజాన్నీ దూరం చేస్తాయి!

నిజానికి ప్రేమ విఫలమైనపుడు - మిన్ను విరిగి మీద పడ్డట్టుగా కుంగిపోయి, జీవితాన్ని నిస్తేజంగా గడిపేకన్నా - తమ దృష్టిని సమాజంవైపు మళ్ళించి, తమ పరిసరాల్లోని వ్యక్తులకు ఏ కొంచెమైనా సాయపడగలిగితే - అది ఎనలేని సంతృప్తినీ, ఉత్తేజాన్నీ ఇస్తుంది.

★★★

'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు - నీ కోసమే కన్నీరు నింపుటకు నేనున్నానని నిండుగా పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ, అదే స్వర్గమూ' అన్నారో సినీ కవి.

నిజమే - ఏ వయసులోనైనా, ఏ సంబంధాల్లోనైనా ప్రేమ అనేది ఒక మధురమైన భావన! ప్రేమ ఒక శక్తి, ధైర్యం, భద్రత, నమ్మకం. ప్రేమ ఒక మానసిక అవసరం - అద్భుత అనుభవం, అలౌకిక ఆనందం, అనంతమైన సంతోషం!

ప్రేమ కోసం రాజ్యాలు గెలిచిన వాళ్ళున్నారు, సామ్రాజ్యాలే వదిలేసినవాళ్లున్నారు. ప్రేమ హృదయాన్ని సేదతీర్చనూవచ్చు,

కలవరపరచనూవచ్చు! ఎవరికోసం హృదయం అనుక్షణం తపిస్తుందో... ఎవరికి కష్టం వస్తే మనస్సు విలవిల్లాడుతుందో, ఎవరి ఆనందంతో హృది సంద్రమై ఉప్పొంగుతుందో, ఎవరి బలహీనతల్ని కూడా మది విశాలమై క్షమిస్తుందో, ఎవరి దు:ఖంలో అక్కున చేర్చుకుని ఊరడించాలనిపిస్తుందో... వారి పట్ల వుండే ఆ దివ్య భావనకే మరో పేరు - ప్రేమ!

★★★

'లవ్ ఈజ్ బ్లైండ్' అన్నాడు మరో కవీశ్వరుడు. అది ప్రేమికుల విషయంలో ఏమోగానీ - పిల్లల విషయంలో మాత్రం అమ్మల ప్రేమ గుడ్డిదే!


తన గుండెల మీద తన్నినా - అమ్మ తన పిల్లల్ని ప్రేమిస్తూనే వుంటుంది! వాడు పరమ దుర్మార్గుడైనా - కడుపులో పెట్టుకుని కాపాడాలనే చూస్తుంది!

కారణం - ఆ అనుబంధం ... పేగుబంధానికీ, రక్త సంబంధానికీ చెందింది వుండడం! ఆ బంధంలో ప్రేమ ఒక్కటే కాదు, అంతకు వెయ్యిరెట్లు గుండె నిండా వాత్సల్యం పొంగిపొర్లడం!

తనవి పాతాళానికి తొక్కినా - గలగలా పైకి ఉబికి వచ్చేది, ఎదలోతుల్లోంచి తన్నుకొచ్చేది వాత్సల్యం!

కొండంత అమ్మ వాత్సల్యం ముందు అన్ని ప్రేమలూ గులకరాళ్ళే!

అందుకే - అమ్మ ప్రేమ ఒక్కటే నిక్కమూ, నిస్వార్థమూ, శాశ్వతమూ!



01-05-1997




# బాధ్యత

ఒక అమ్మాయిని పది మంది అబ్బాయిలు రేప్ చేస్తూంటే... వాటిని ఆపలేక, వారికి 'రక్ష'ణ లేక - చేష్టలుడిగి, నిస్సహాయంగా చూస్తున్న ఈ రోజుల్లో... సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగల్లాంటివి ఒక్కరోజే కాదు... ప్రతి రోజూ జరుపుకోవల్సిన అవసరం ఎంతైనా వుంది!

ఎక్కడో కొందరి నుండి మనకు కొన్ని చేదు అనుభవాలు ఎదురైనంత మాత్రాన... రాఖీ పండుగలోని అనుబంధాలన్నీ ఉత్త ట్రాష్ అనుకోవడం, ప్రేమలన్నీ 'ఉల్లి పొరల' వంటివని తీర్మానించుకోవడం... 'ప్రిజుడిస్' అన్పించుకుంటుంది!

అసలే కుల మత భేదాలతో అట్టుడుకుతూ 'అన్‌రెస్ట్'తో వున్న దేశంలో... అక్కడికీ వున్న సమస్యలు చాలవన్నట్టు... రాఖీ పండగలెందుకంటూ ఇతర మతాల ఆచార వ్యవహా రాల్లో తలదూర్చి, సమాజంలో అసహనాన్ని ప్రేరేపించే, అగ్నికి ఆజ్యం పోసే వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యం అవుతుంది!

కొందరికి ఉన్నట్టుండి కొన్ని వింతైన ఆలోచనలు పుట్టు కొస్తాయి! తమ మెదడులో ఏ క్షణంలో ఏ ఆలోచన మెదిల్తే

- అక్కడికి అదేదో గొప్ప సత్యమైనట్టూ, ఆ సత్యాన్ని అందరి కన్నా ముందు తామే కనిపెట్టినట్టూ - వెనకాముందూ ఆలోచించకుండా ఫేస్బుక్‌లో పోస్ట్‌చేయడం రివాజు.

అవి దేశభద్రతకూ, ఇతరుల మత విశ్వాసాలకీ, కొందరి వ్యక్తిత్వాలకు సంబంధించినవైతే ఇహ సరేసరి... వీర లెవల్లో విజృంభిస్తారు. తమ అనుచిత వ్యాఖ్యలతో ఎదుటివాళ్ళని రాబందుల్లా పొడిచి, పొడిచి, కుళ్ళ బొడిచి, తృప్తిపడతారు! చివరకు భరతమాతనీ, జాతిపితనీ ఒదలరు!

స్థూలంగా ఆలోచిస్తే -

తమని తిరస్కరించిన అమ్మాయిల కారెక్టర్ గురించి చిలువలు పలువలుగా 'కాలేజీ గోడల' మీద అసభ్యంగా రాసి, తమ కసి తీర్చుకున్న నాటి ఆకతాయి కుర్రాళ్ళవీ -

తమకి నచ్చని వారి వ్యక్తిగత జీవితాల పై 'నెట్టింటి గోడల' మీద అనుచిత వ్యాఖ్యలు రాస్తోన్న నేటి నెటిజన్స్‌వీ -

తరాలు మారాయే గానీ 'బుద్ధులు' ఒక్కటేనని చదువరులకి స్పష్టమవుతుంది!

అన్నింటికన్నా ముఖ్యం -

మన ఇంటి గది గోడల మీద మనకిష్టమైనవి ఎన్నైనా రాసుకోవచ్చు - ఇదేమిటని ఎవరూ ప్రశ్నించరు, పట్టించుకోరు!

కాని ఫేస్బుక్ అనేది ప్రపంచపు వాల్! దాని మీద మనం ఏమి రాసినా నలుగురూ చూస్తారు. నచ్చినవాళ్ళు 'లైక్'లు కొడతారు. నచ్చనివాళ్ళు తమకి నచ్చని అంశాన్ని ఆక్షేపిస్తారు. అంతేగానీ మనం చెప్పిన దానికల్లా ప్రతిఒక్కరూ 'డూ డూ'

బసవన్నల్లా తలలూపరు!

ఆక్షేపణలు శరపరంపరలా ఒక్కొక్కటే వచ్చి మనల్ని గుచ్చుతున్నప్పుడు - మనకి ఉక్రోషం వచ్చి, 'నా వాల్! నా పోస్ట్! నా యిష్టం! నా పోస్టులు ఇష్టం లేకపోతే నన్ను అన్ ఫ్రెండ్ చేసుకోవచ్చు!' అని గింజుకునే ప్రమాదం మనకి ఏర్పడ్తుంది.

ఇకపోతే -

బాలకృష్ణ, రాహుల్‌గాంధీ, సర్దార్జీల వ్యక్తిత్వాలను కించపరిచేలా పోస్ట్ చేసే క్రూడ్ జోక్స్... ఒకర్ని ఏడ్పించి, నవ్వుకుందామనుకునే 'శాడిస్ట్ మెంటాలిటీ'లకి అద్దం పడతాయి! అలాంటి పోస్టులకి స్పందించి - 'లైక్'లు కొట్టడం, షేర్ చేయడం ద్వారా సభ్య సమాజంలో మనం చులకనయ్యే ప్రమాదం వుంటుంది!

సమాజానికి మనం మేలు చేయకపోతేపోనీగానీ - ఇలాంటి పోస్టులతో హాని చేసే దిశలో మనం నడవకపోవడమే - మనందరి కనీస బాధ్యత!

*16-08-2016*




# దేశభక్తి

స్త్రీలని అత్యాచారాల బారి నుండి కాపాడేందుకు 'షీ టీమ్స్', 'భరోసా' లాంటి ప్రభుత్వ సంస్థలూ - 'రక్ష' లాంటి స్వచ్ఛంద సంస్థలూ ఎంత అవసరమో... దేశాన్ని విదేశీయుల దండయాత్రల నుండి, ప్రజలను ఉగ్రవాదుల ఊచకోత నుండి రక్షించడానికి ఏ దేశానికైనా ఒక 'ప్రభుత్వం' అంత అవసరం!

'యుద్ధం ప్రజలకు అక్కర్లేదు... పాలకులకే కావాలి' అని జ్ఞానబోధ చేయడానికి మనది రాజరిక వ్యవస్థ కాదు! ఒకవేళ మనం యుద్ధం చేయాల్సి వస్తే - అది ఏ సామ్రాజ్య విస్తరణకో అంతకన్నా కాదు!

పాలకులలో... మనకి నచ్చని, నచ్చిన ఏ పార్టీ అధికారంలో వున్నా... ఉగ్రవాదులు చెలరేగి మారణ హోమం సృష్టిస్తూంటే... ఏ ప్రభుత్వమూ చేష్టలుడిగి చూస్తూ కూర్చోదు! అలా చేవ చచ్చి, చేతులు ముడుచుకునే ప్రభుత్వాన్ని చీమూ నెత్తురూ వున్న ప్రజలు క్షమించనూ లేరు!

ప్రజలకి రక్షణ కావాలి - అందుకు జవాన్లు కావాలి!

జవాన్లని రక్షించుకోలేని ప్రభుత్వం తన ప్రజలనే కాదు... తన దేశ సార్వభౌమత్వాన్నీ కాపాడుకోలేదు! అలాంటి సందర్భాల్లోనే యుద్ధం అనివార్యమవుతుంది! అంతేగానీ, యుద్ధం ఎవరికీ ముద్దు కాదు!

'యుద్ధోన్మాదానికి పరాకాష్ట దేశభక్తి!' అని ఎవరైనా వ్యాఖ్యా నిస్తే-'దేశభక్తి'ని కూడా శంకించడం మరో ఉన్మాదం అనిపించుకుంటుంది!

ప్రపంచంలో ఇన్ని దేశాలుండకుండా - కేవలం 'ప్రపంచమే' ఒక దేశమయినప్పుడు... ఏ దేశానికీ యుద్ధాల అవసరంగానీ, రక్షణదళ ఆవశ్యకతగానీ వుండదు!

మన ఇంటికి ఎవరైనా కావాలని నిప్పుపెట్టాలని చూస్తున్న ప్పుడు - మనం ఉత్తినే చూస్తూ కూర్చోము! ఫైరింజన్లూ, అగ్నిమాపక యంత్రాలతో రెడీగా వుంటాం!

మన సంసిద్ధత ఎలాంటిదో, మన ప్రతాపం ఏపాటిదో తెలుసుకుందామని మన పొరుగింటివాళ్ళు మన ఇంటిమీద రాళ్ళేసినప్పుడు... మనం బిక్కచచ్చి ఇంట్లోనే కూర్చుండిపోము - మనమూ రెండు రాళ్ళేసి మన తడాఖా ఏమిటో చూపించి వస్తాం!

అలసి సొలసి... ఆరుబయట హాయిగా ఆదమరిచి నిద్రోతున్న మన పిల్లల్ని నిర్దాక్షిణ్యంగా చంపితే - ఇంకెందరిని చంపుతారో చూద్దామని వేచి చూడం! మన పిల్లల్ని చంపేందుకు పురికొల్పుతోన్న వాళ్ళెవరో తెలుసుకొని వాళ్ళని

మట్టుపెట్టి వస్తాం!

మహిళల మీద దాడులూ, సైనికుల మీద దాడులూ, అమాయక పౌరులమీద దాడులూ - దాడులు ఏ రూపంలో వున్నా... ఏ కులం మీద ఏ కులం దాడి చేసినా, ఏ మతం మీద ఏ మతం దాడి చేసినా - అన్నీ గర్హనీయమే - ఖండించాల్సినవే!



*16-12-2016*




# ధైర్యం

స్వభావరీత్యా సమాజంలో పిరికివాళ్ళూ, ధైర్యవంతులూ, మొహమాటస్థులూ... రకరకాల మనుషులు తటస్థపడతారు.

కొందరికి ధైర్యముంటే - మరికొందరికి మహాధైర్య ముంటుంది!

ధైర్యం మనిషికి అన్నివేళలా శ్రేయస్కరం, కానీ మహాధైర్యం మాత్రమే మహా డేంజర్.

మనిషికి ధైర్యం లేకున్నా సరిపెట్టుకోవచ్చునేమోగానీ - అరాచకాలు, అత్యాచారాలు, దొంగతనాలకి పాల్పడుతూ, చేయకూడని పనులన్నీ 'మహాధైర్యం'గా చేసేస్తూ - బోర విరుచుకొని తిరిగే చీడపురుగుల్ని భరించడం మహా కష్టం!

గృహహింసకి పాల్పడే భర్తల్నీ, అత్తామామల్నీ ఆర్థిక స్వాతంత్ర్యం లేనివాళ్ళే ఎంతో ధైర్యంగా తృణీకరిస్తున్న ఈ రోజుల్లో... ఆర్థిక స్వాతంత్ర్యం వుండికూడా - సమాజానికి భయపడో, ధైర్యంలేకో అణిగిమణిగి వుంటే - చూడడానికి విడ్డూరంగా వుంటుంది! వ్యక్తిత్వాన్ని చంపుకుంటూ - అంత విధేయత అవసరమా అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

కొందరు చదువుకున్న భార్యలు కూడా చిత్రంగా ప్రవర్తి

స్తారు. ఉన్నత ఉద్యోగాల్లో వుంటూ - ఎంతెంతో సంపాదిస్తూ కూడా - ఫ్రెండ్స్‌తో కలిసి ఏ సినిమాకో, పిక్నిక్‌కో వెళ్ళాల్సి వచ్చినప్పుడు- భర్త ఏమంటాడో అని బంధువులతోనో, ఫ్రెండ్స్‌తోనో అతడికి చెప్పించాలని ప్రయత్నించడం, కాదంటే ఇంట్లోనే వుండిపోయేందుకు సిద్ధపడటం, స్వతంత్రించి 'ధైర్యం'గా ఏ నిర్ణయమూ తీసుకోలేకపోవడం చూసేవాళ్ళకి పరమ చిరాకు తెప్పిస్తుంది!

మనిషికి ధైర్యసాహసాలు ఎంతో అవసరమైనప్పటికినీ - కొన్నిసార్లు 'పిరికితనం' కూడా దేశానికి ఒకింత ఉపకారం చేస్తుంది. ముఖ్యంగా కాసులకి కక్కుర్తిపడి, వరుస పేలుళ్ళతో విధ్వంసం సృష్టించేందుకు 'ధైర్యం'గా ముందుకొచ్చే 'దేశ ద్రోహులు'న్న చోట - భయంతోనైనా అలాంటి దుశ్చర్యలకు పాల్పడని పిరికిగొడ్డులే నిజానికి నిజమైన దేశభక్తులనిపించు కుంటారు!

కొన్ని రౌడీ మూకలుంటాయి! వాటి పనల్లా - సంఘంలో డబ్బూ, పేరూ, ఆడపిల్లలున్న వాళ్ళని 'లక్ష్యం'గా పెట్టుకోవడం, అలాంటి వాళ్ళ విషయంలో ఎక్కడ ఏ సంఘటన జరుగు తుందా అని గుంటకింది నక్కల్లా పొంచివుండటం, బోడిగుండుకూ - మోకాలికీ ముడేసినట్టు ఎక్కడో జరిగిందాన్ని పట్టుకొచ్చి తమకి గిట్టని వాళ్ళకది అంటగట్టి, వాళ్ళ చుట్టూ గద్దల్లా వాలడం, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ధర్నాలు చేయడం, బెదిరించడం, లేదంటే - బేరసారాలకి దిగడం!

ఇలాంటి సందర్భాల్లోనే...

'దుర్బలమనస్కులైతే - ఆత్మహత్య చేసుకుంటారు,

'పిరికిపంద'లైతే - ఎంతో కొంత విదిలించి, వదిలించు కుంటారు.

'గుండెనిబ్బరం' వున్నవాళ్ళయితే - ఊరకుక్కల భౌభౌలని ఏ మాత్రం లక్ష్యపెట్టని 'ఏనుగు'ల్లా సాగిపోతారు.

ఇకపోతే -

దుర్భేద్యమైన పరిసరాల్లోక్కూడా చొచ్చుకుపోయి నిజాలు రాబట్టేందుకు జర్నలిస్టులకి 'మొండి ధైర్యం' ఎంతో అవసరం! కానీ - వారి కెమరాల కన్ను పడేదీ, కలాలు ఎక్కుపెట్టేదీ - ఎంతకీ సమాజానికి హాని కలిగించే అసాంఘిక శక్తుల మీదే అయినప్పుడు... ఆ కవరేజీ మూలంగా - సమాజంలో ఎక్కడ చూసినా 'విలనిజం' వెయ్యి తలలతో విర్రవీగుతుంది, 'చెడు భావనలు' అంటువ్యాధిలా ప్రబలుతాయి.

అంతకన్నా - వారి దృష్టి సరిహద్దుల్లో ఎండనకా, వాననకా పహారా కాస్తూ, ఎన్ని అవాంతరాలెదురైనా - దేశం కోసం ప్రాణాలొడ్డి, వీరోచితంగా పోరాడే జవాన్ల 'ధైర్య స్థైర్యాల' మీదో - ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో కూడా చెక్కు చెదరని వారి దేశభక్తి మీదో సోకినపుడు...సమాజంలో 'హీరోయిజం' పూర్వవైభవం సంతరించుకుంటుంది, 'ఆరోగ్యకరమైన భావనలు' వెల్లివిరుస్తాయి!

*01-01-2017*




# వ్యాఖ్య

సినిమాల్లో, టీవీల్లో, ఫేస్బుక్‌లో, వాట్సాప్‌ల్లో ఆడవాళ్ళ మీద అనుచిత వ్యాఖ్యలు చేసే సినిమా నటుల్నీ, రాజకీయ నాయకుల్నీ ఫేస్బుక్ మెంబర్స్‌నీ చూస్తూవుంటాం!

కొన్నిసార్లు మనకెందుకులే అని ఉదాసీనంగా వుంటాం. మరికొన్నిసార్లు ఒకటి రెండు రోజుల పాటు మన నిరసనని తెలియజేసి, ఆ తర్వాత మన దైనందిన జీవితంలో బిజీ అయిపోతుంటాం.

సరిగ్గా దీన్ని అదునుగా తీసుకొని, అలాంటి వెకిలి కామెంట్స్ చేసే ప్రబుద్ధులు తమకి నిరసన జ్వాలల సెగ సోకినప్పుడు... ఆ ప్రమాదం నుండి తప్పించుకునేందుకు ఆ క్షణంలో ఏదో తూతూ మంత్రంగా సదరు వ్యక్తులకి మొక్కు బడి క్షమాపణలు చేప్పేసి, తమ చేతులు దులుపుకోవటం చూస్తూవుంటాం!

మరో నెల రోజుల తర్వాత మళ్ళీ మామూలే! మరో వాచా లుడు మరేదో వాగుతాడు. ఇలా ప్రతి నెలా ఒకటో రెండో ఘటనలు పునరావృతమవుతూనే వుంటాయి!

ముఖ్యంగా రియాల్టీ షోల పేర మగవాళ్ళు ఆడవాళ్ళ వేషాలు వేసుకుని మాట్లాడే వెకిలిమాటలను ఖండించాలన్నా-

వాళ్ళ కుళ్ళుజోకులకి ఒళ్ళంతా కదలిపోయేలా అస్థిపంజరాలు నవ్వుతున్నట్టుగా పెద్దగా పళ్ళికిలించే సినీ నటీనటుల మీద ధ్వజమెత్తాలన్నా -

ఆడవాళ్ళనూ, వారి మనోభావాలనూ కించపరిచేలా వ్యాఖ్యలు చేసే వ్యక్తుల మీద చర్యతీసుకోవాలన్నా -

మహిళలకంటూ ఓ వేదిక వుండాలి! ఆ వేదిక పక్షాన మహిళలందరూ అలాంటి వదరుబోతులను నిలదీయాలి!

ఈ విషయంలో మేధావులూ, రచయితలూ, కార్టూనిస్టులూ ఉదాసీనత చూపకుండా - నిరసన తెలపాలి, సెటైర్లు విసరాలి, కార్టూన్స్ గీయాలి!

వి.ఐ.పీలమని విర్రవీగే కొందరు ప్రబుద్ధుల అనాలోచిత వ్యాఖ్యలు వారి వ్యక్తిత్వాలకు మచ్చ తెచ్చేలా వుంటే - మరి కొందరివి సొంతవాళ్ళనీ, సమాజాన్నీ తప్పుతోవ పట్టించేవిగా వుంటాయి!

కొందరి అపరిపక్వ వ్యాఖ్యలు రచయితల కలాలకి, కార్టూనిస్టుల కుంచెలకీ పనికల్పిస్తాయి! వారిని నలుగురిలో నవ్వుల పాలయ్యేలా చేస్తాయి! బదులుగా ఎక్కడ చూసినా - వారి తెలివితక్కువతనం మీద... సోషల్ మీడి యాలో ఎన్నో ప్రతి వ్యాఖ్యలు స్వైర విహారం చేస్తుంటాయి!

మరికొందరి దురహంకార వ్యాఖ్యలు, అనాలోచిత

వ్యాఖ్యలు సమాజానికి హానిచేసేవిగా, ముఖ్యంగా యువతకి తప్పుడు సంకేతాన్నిచ్చేవిగా, మేధావులకూ, మహిళలకూ ఆగ్రహం తెప్పించేవిగా వుంటాయి.

అందుకే విజ్ఞులందరూ ఓ వైపు తమ నిరసనని తెలియ జేస్తూనే మరోవైపు దీనికి శాశ్వత పరిష్కార మార్గాలను ఆలోచించాలి!

ఇలాంటివి జరిగినప్పుడల్లా - మహిళలందరి పక్షాన నిలిచే మహిళా పత్రికల తరపున సదరు వ్యక్తుల మీద చట్టపరంగా కేసులు వేస్తూ, ఆ నోటీసులందుకున్న వ్యక్తులను కోర్టు చుట్టూ తిరిగేలా చేస్తే - అలాంటి వెకిలి మాటలకూ, కుళ్ళు జోకులకూ కొంతమేర కళ్లెం పడుతుంది.

ఇకపోతే - వేదికలమీద, సామాజిక మాధ్యమాల్లో... కొన్ని మతాలను పనిగట్టుకుని కుళ్ళపొడుస్తూ - అందరి దృష్టినీ ఆకర్షించాలని చూసే కొందరి వ్యాఖ్యల మూలంగా - సమాజంలో ఒకర్నొకరు పరస్పర వ్యాఖ్యలతో గాయపరచు కోవడం, అసహనంగా ఫీలవడం, ఆనక గింజుకోవడం మొద లవుతుంది.

విభిన్న మతాలూ, కులాలున్న దేశంలో - ఆయా మతా లనూ, కులాలనూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు దేశాన్ని అస్థిరం చేస్తాయన్న స్పృహ, ఆలోచన, బాధ్యత మనలో లేకపోవడం విచారించదగ్గ విషయం!

అన్నింటికన్నా ముఖ్యం - కేవలం మహిళల మీదేకాదు... దేశభద్రతకి సంబంధించిన విషయాల మీదగానీ, ఒకరి కులం

మీదగానీ, మతం మీదగానీ అనుచిత వ్యాఖ్యలను చేస్తే - ఆయా కులమతాలకి చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతిని, సదరు వ్యక్తుల మీద వారు చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం వుంటుంది.

అందుకే -

మనమెంత సర్వజ్ఞులమైనా - మనం చేసే వ్యాఖ్యలలో సంయమనం, ఉపయోగించే భాషలో డీసెన్సీ అవసరమన్న విజ్ఞత మనకుండాలి!



*16-05-2017*




# మార్పు

కొన్ని పుస్తకాలు మనల్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయి. మనలో, మన స్వభావంలో ఎన్నో మార్పులు తీసుకొస్తాయి! కొంతమంది మనుషులూ అంతే - వారితో చర్చ ఎంతో విజ్ఞానదాయకంగా వుంటుంది, మనసుల్ని వికసింపచేస్తుంది! మనలోని చీకటి కోణాన్ని తొలిగించేదిగా వుంటుంది.

కాని కొందరుంటారు - తమలోని ఆ చీకటి కోణాన్ని తొలగించుకునే ప్రయత్నం చేయరు సరికదా - తమ అభిప్రాయం చర్చకు నిలవడంలేదని తెలిసినా - ఉక్రోషంతో... 'నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలుంటాయి! ఎవరు చెప్పినా నా అభిప్రాయాలు మార్చుకోను!' అంటూ తమ అతిశయాన్ని ప్రదర్శిస్తారు.

మారని సమాజం 'ఎక్కడేసిన గొంగడి అక్కడే' వున్నట్లు... ఏ అభివృద్ధికీ ఎలా నోచుకోదో - 'మారని స్వభావం' కూడా బండ కింది కప్పల్లే - బయటి ప్రపంచపు వెలుతురు ఏ మాత్రం సోకినా భరించలేక- చీకటి కుహరంలోనే మగ్గిపోజూ స్తుంది! పిడుగుపాటుని చూసిన వ్యక్తికి ఆ మరుక్షణం నుండి కళ్ళల్లో ఆ మెరుపే తప్ప మరింకేదీ కన్పించనట్టు - ఆ

చీకటిలోనే మగ్గిన కప్ప ఏ వెలుతురినీ తట్టుకోలేదు!

ఇలాంటి సందర్భాల్లోనే -

పూర్వభావనలు (prejudice) ఏర్పర్చుకుని - దాని చట్రం లోనే ఇమిడి - ఆ భావనలకి అనుగుణంగా మాత్రమే నడుచుకునే వ్యక్తులు... ఆ భావనా సుడిగుండంలోనే గింగిరులు తిరుగుతూ కొట్టు మిట్టాడ్తారే కానీ, అందులోంచి బయటపడే మార్గం ఆలోచించరు! మార్పు దిశగా తమ పరిధిని విస్తృతం చేసుకోరు.

కొందరుంటారు -

'మా తల్లిదండ్రులు ఉత్త ఛాందసవాదులు! మేము అలా కాదు - అభ్యుదయవాదులం. మారే కాలంతో పాటు మేమూ మారుతాం! మా పిల్లలకి మేము పూర్తి స్వేచ్ఛనిస్తాం!' అని రిలాక్స్‌డ్‌గా కూర్చుని... తమ పిల్లల కదలికలపై దృష్టి సారించకపోతే - ఏ అర్ధరాత్రో మత్తులో జోగుతూ ఇంటి తలుపులు తట్టే తమ పిల్లల్ని చూసి హతాశులవుతారు. తామిచ్చిన స్వేచ్ఛే - స్వీయ నియంత్రణ లేని తమ పిల్లల పతనానికి కారణమైందని పరితపిస్తారు!

మరికొందరుంటారు -

'మా పిల్లలు గడప దాటిపోరు! వారికి మేము చెప్పిందే వేదం! వాళ్ళు ఈ కాలపు పిల్లల్లాకాదు! సాంప్రదాయం పాటిస్తారు. ఎంతో బుద్ధిమంతులు!' అంటూ ఎంతో మురిపెంగా మీసాలొచ్చిన కొడుకుల్ని కూడా వెన్నెముక లేకుండా పెంచాలనే చూస్తారు. కొన్నాళ్ళకు - 'తండ్రి చాటు పిల్లల్లా ఎన్నాళ్ళిలా? మాకు వ్యక్తిత్వం, ఆత్మగౌరవం లేదా?'

అని సహనం నశించిన పిల్లలు ఎదురు తిరిగినపుడు - తమ పెంపకంలోని లోపమే కొంప ముంచిందని అల్లల్లాడిపోతారు.

కొన్నేళ్ళక్రితం - 'ఎదుటి వాడి కులాన్ని అడగడం తప్పు' అని పెద్ద వాళ్ళతో సుద్దులు చెప్పించుకున్న మనమే - ఇప్పుడు మన పేరు పక్కన కులాల పేర్లని తగిలించుకొంటూ... కుల సంఘాలు ఏర్పాటు చేసుకుంటూ - అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను నిస్సిగ్గుగా అలంకరిస్తున్నాం!

ఒకప్పుడు మగవాడు పేకాడి డబ్బు తగలేస్తున్నాడని నెత్తీ నోరూ బాదుకున్న స్త్రీలని చూసిన కళ్ళతోనే - ఇప్పుడు మగాళ్ళతోపాటు దర్జాగా కూర్చుని పేకాడుతోన్న మగువల్నీ చూస్తున్నాం!

తాగితందనాలాడుతూ - భార్యల్ని రాచి రంపాన పెట్టే భర్తల్ని ఏవగించుకున్న రోజుల్ని చూసిన మనం - భర్తలతో పాటు క్లబ్బుల్లో కూర్చుని తాగి చిందులేస్తోన్న భార్యల్నీ అత్యంత క్యాజువల్‌గా తీసుకుంటున్నాం!

'ఇవి - 'ఏ' సర్టిఫికెట్ సినిమాలు. చిన్న పిల్లలు చూడ కూడదు!' అంటూ ఒకప్పుడు పిల్లల్ని ఇంట్లోనే వదిలి సినిమాలకి వెళ్ళిన మనమే - ఇప్పుడు నట్టింట్లో పిల్లల్ని పక్కనే కూర్చోబెట్టుకుని - అత్యంత అధ్వాన్న స్థితిలో ప్రసారమవుతోన్న పిల్లల రియాల్టీ షోలను నిర్లజ్జగా చూస్తున్నాం!

ఒక్క మాటలో చెప్పాలంటే -

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్లు - మితిమీరిన స్వేచ్ఛ, అపరిమితమైన ఆంక్షలు పిల్లల్ని అధోగతికి నెట్టేస్తాయి.

సాంకేతికంగా, మానసికంగా మార్పులనేవి సమాజంలో

జెట్ వేగంతో చోటు చేసుకుంటోన్న ఈ రోజుల్లో క్రాస్ రోడ్స్‌లో నిల్చుని - 'ఏ దిశగా వెళ్ళాలా' అని సందిగ్ధంలో, అయోమయం లో వున్న యువతకి - సరియైన మార్గదర్శకత్వం నెరిపే నేర్పరితనం తల్లిదండ్రులకు వుండాలి!

కాలంతోపాటు మార్పు అనివార్యం. అయితే పిల్లల్లో కనిపించే మార్పు 'అశ్వం'లాంటిదైతే - తల్లిదండ్రుల వివేచన 'కళ్ళెం' లాంటిది! అవసరాన్ని బట్టి కళ్ళెం బిగించడం, అనవసరమైనప్పుడు దాన్ని సడలించడం తల్లిదండ్రులకు తెలిసినపుడు... 'అశ్వం' తిరోగమనం వైపు కాకుండా - పురోగమనం వైపే దౌడు తీస్తుంది!

01-06-2017

# పాఠకుల స్పందన......

## ప్రశంస:

★ *అమృతలత గారి 'ప్రశంస' ఉద్యోగులకూ, అధికారులకూ మంచి సలహాగా పనికివస్తుందని భావిస్తున్నాం.*

**- ఎల్. సంతోష్‌రెడ్డి, ఆర్మూర్** *(తేదీ: 16-12-1994)*

★ *'ప్రశంస' కీ, 'కాకా' కీ వున్న తేడాని క్లుప్తంగా వివరించిన ప్రశంస వెరైటీగా వుంది.*

**- వి. విజయ, హైదరాబాద్** *(తేదీ: 16-12-1994)*

★ *'ప్రశంస'లో - రాసింది.... నాలుగు మాటలే అయినా మనసులో నిలిచిపోయాయి. పైవాడు కిందివాణ్ణి మెచ్చుకుంటే ప్రశంస, కిందివాడు పైవాణ్ణి మెచ్చుకుంటే 'కాకా' అనడం అక్షరాలా నిజమే అయినప్పటికినీ... ఆ సంగతి ఎవరికీ తట్టదు! అది ప్రతినిత్యం జరిగేదే అయినా... ఎవరికీ ఆ ఆలోచన రాదు!*

**- పి. శేషవర్ధనరావు, హైదరాబాద్.** *(తేదీ: 1-3-1995)*

★ *'ప్రశంస' చాలా చాలా బావుంది. ఇది ప్రశంస కాదండోయ్. బికాజ్... మీరు నా కన్నా చిన్నవారు కాదు కాబట్టి ! అలాగని 'కాకా' కూడా కాదని నా అభిప్రాయం.... ఎందుకంటే మీరు నా 'పై అధికారి' కాదు గనక ! మరేమిటిది...? అభినందన! మంచి చేయకున్నా, మంచి చేస్తున్నవారిని అభినందించడం మంచిదని నా ఉద్దేశ్యం !*

**- అనితా సాగర్, జనగాం** *(తేదీ: 16-12-1994)*

★ *'ప్రశంస'కీ, 'కాకా' కీ తేడా గమనించాలని, చిన్నదైనా... ఆలోచింపజేసే దిగా ఉన్న... సంపాదకీయం... చాలా బావుంది.*

**- దక్షిణమూర్తి, సిద్ధిపేట** *(తేదీ: 16-12-1994)*

## ఆత్మవిశ్వాసం:

★ *'**ఆత్మవిశ్వాసం**' గజిబిజి మనసుకు పూల బాటలా, 'నీ వెనుక నేనున్నా, నువ్వు నడూ' అని ధైర్యం చెప్పే అమ్మ మాటలా ఉంది.*

***వి. వంశీ, S/o వి. సత్యనారాయణ, దొరగారి తోట, రాజోలు, జి: తూర్పుగోదావరి***

★ *ఆత్మవిశ్వాసం సూపర్బ్‌గా వుంది. 'ఆత్మవిశ్వాసం, అహంభావం, అహంకారం' ల గురించి చిన్నగా, టూకీగా ఇచ్చిన నిర్వచనం బావుంది.*

***- అనితాసాగర్, జనగామ,*** *(తేదీ: 16-1-1995)*

★ *'నీ పనిమీద నీకు గల అభిమానమే నీ విజయానికి రహస్యమ'ంటూ... మీ సంపాదకీయం చాలా బావుంది.*

***- డి. భాషా, నిజామాబాద్.*** *(తేదీ: 1-2-1995)*

## భావవ్యక్తీకరణ:

★ *'**భావవ్యక్తీకరణ**' లో మీరు చెప్పిన మొదటి సగం చదివింతర్వాత... నా అనుభవం లోనూ - ఒకటి రెండుసార్లు నా ఉద్దేశాలు అపార్థాలైతే నేను విస్తుపోయిన సంఘటనలు గుర్తుకొచ్చాయి. 'నా ఉద్దేశం ఇది కాదూ' అని నా మిత్రుడికి సర్ది చెప్పుకునేసరికి తలప్రాణం తోకకొచ్చింది. మరోసారి ఓ కొత్త వ్యక్తి విషయంలోనూ అలాగే జరిగినపుడు - అతడికి నేను వివరణ ఇచ్చుకునే అవకాశం కూడా లేకపోయింది.*

*ప్రతి మనిషి జీవితంలోనూ అడపాదడపా ఎదురయ్యే అనుభవాలు ఇవి! చదివిన ప్రతివాడికీ.... 'నిజం - నిజంగా ఇలాగే జరిగింది' అన్పిస్తుంది.*

*'గొప్ప మేధావియైన ఉపాధ్యాయుడి కంటే - విద్యార్థులకి అర్థమయ్యే రీతిలో బోధించే సామర్థ్యంగల ఉపాధ్యాయుడు గొప్పవాడు' అన్నారు పెద్దలు. అమృతలత గారిలో... ఆ మేధస్సూ, ఈ సామర్థ్యం...*

రెండూ ఉన్న 'ఉపాధ్యాయురాలు' ఉన్నారు!

***వెంకటశివసాయి ప్రసాద్, గాంధీనగర్, సికింద్రాబాద్.***

★ ఎడిటర్ గారి ఎడిటోరియల్ 'భావ వ్యక్తీకరణ' - సూపర్బ్.

***- దాసరి విజయ భాస్కర్, చీరాల*** *(తేదీ: 16-2-1995)*

★ ఓ బర్త్‌డే పార్టీకి వెళ్ళాను. నాకు తెలిసిన ఒకావిడ కన్పించింది. 'నమస్తే మేడం' అన్నాను. ఆమె రెస్పాండ్ కాలేదు. విన్పించలేదేమో అనుకుని మళ్ళీ 'నమస్తే మేడం' అన్నాను.

నా విష్ పట్టించుకోకుండా - 'హాయ్ కమలా !' అంటూ తనకి తెలిసిన మరో ఆవిడ దగ్గరికి వెళ్ళి కూర్చుంది.

ఆమెతో మాట్లాడుతూ.... మధ్యలో ఆవిడ... ఎందుకో నా వేపు చూసింది. ఆవిడ చూశారు కదా అని... అప్పుడు నేను మళ్ళీ 'నమస్తే మేడం! నన్ను గుర్తుపట్ట లేదా ?' అన్నాను మాట కలుపుతూ.

'అదేంటీ - గుర్తుపట్టలేనంత మారిపోయావేటీ ?' అన్నారావిడ విసురుగా.

కంగుతినడం నావంతైంది !

ఆమె తీరుకి చాలా నొచ్చుకున్నాను.

ఆవిడ నా నమస్తేకి - నమస్తే చెప్పినా; లేకపోతే నమస్తే అని తలూపినా సరిపోయేది !

కానీ... చాచి లెంపకాయ కొట్టినట్టుగా ఆవిడ ఇచ్చిన సమాధానం... ఇప్పటికీ తలపుకొస్తే చాలు.... 'మూడీ' అయిపోతాను.

అమృతలత గారు చెప్పినట్టు.... 'భావవ్యక్తీకరణ' చాలా సున్నితమైంది. ఇతరులతో మాట్లాడ్తున్నప్పుడు ఇది మనం గుర్తెరిగి మసలుకోవాలి.

***- డి. విజయ, గోదావరి ఖని*** *(తేదీ: 16-2-1995)*

## ఆప్యాయత:

★ ఈ వారం అమృతవర్షిణి - 'ఆప్యాయత'ను చదువుతూన్నంత సేపూ.... అదృశ్యశక్తి ఏదో ఆప్యాయతామృతాన్ని అందిస్తోన్న అనుభూతికి లోనై... ఆ అనుభూతి కోసం - చదివిన దాన్నే పదేపదే తరచి తరచి చదువుకోవాల్సి వచ్చింది. ఆప్యాయతకోసం తపించేవారికి ఈ రచన ఊరటనిస్తుందనటం అతిశయోక్తి కాదు.

ఔపయోగిక కళలూ, హస్తకళలూ, లలితకళలూ కాక - హృదయంలో జనించి... ప్రవర్తనలో ప్రతిబింబించే భావాల రూపాలు కూడా కళలే - అలాంటిదే ఆప్యాయత ! "ఆప్యాయత కురిపించటం కూడా ఓ కళే - అది సర్వోత్కృష్టమైనది" అని అమృతలతగారు చెప్పిన తీరు మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది.

వారి రచనల్లోని భావౌన్నత్యం... అనుభవైకవేద్యం ! చదివి మనసుతో అనుభవించాల్సింది మాత్రమే కాదు. అనిర్వచనీయమైంది కూడా! అందుకే విశ్లేషించటం కష్టం.

కరుణ, సానుభూతులకు మూలమైన మానవత్వాన్ని ప్రతిఫలించే అలాంటి ఆప్యాయతను... 'దానికోసం తపించే ఇతరులకు ఇసుమంతైనా అందించాలి' అనే అమృతలత సందేశం సమస్త మానవాళికే సదా ఆచరణీయం !

*జి. ప్రభావతి, ఇ.నెం. 1-4-35/194,*
*రంగ్‌నగర్, భోలక్‌పూర్, సికింద్రాబాద్.*

★ ఎడిటోరియల్ పత్రికకు పెట్టని కిరీటం. 'మనిషి బ్రతకటానికి కావలసిన కనీసావసరాలు ఎన్నో అయితే - మనసుని బ్రతికించే ఏకైక ఔషదం ఆప్యాయత' ఎంత నిజం ! ఎద లోతుల్ని తడిమిన పదం !

*- ఊర్మిళా సుభాన్, మహబూబ్ నగర్. (తేదీ: 1-3-1995)*

★ ఈ వారం ఎడిటోరియల్ 'ఆప్యాయత' ఒకటికి రెండుసార్లు, రెంటికి మూడుసార్లు చదివాను. ఎన్నిసార్లు చదివినా ఎప్పటికప్పుడు కొత్తగా చదివినట్లుగా, ఇంకా ఏదో అర్థం చేసుకోవాల్సింది మిగిలిపోయి నట్లుగా అన్పించింది. అంతరంగం మాత్రం అమృతభావ రసాస్వాదనతో ఆర్ధ్రమయ్యింది.

ఇంతకాలం మీ గురించి తెలుసుకున్నదానికంటే తెలుసుకోవాల్సింది ఎంతో ఉందని మాత్రం తెలుసుకోగలిగాను.

ఆప్యాయత 'మనసును బ్రతికించే ఏకైక ఔషదం' అని మీరిచ్చిన నిర్వచనం అమోఘం, అపూర్వం!

'ఆప్యాయత కురిపించటమూ ఓ కళే' అనీ, ఈ కళ సర్వోత్కృష్టమైన దని మీరు చెప్పడం మహాద్భుతంగా ఉంది.

'మన మీద ఈగవాలినా విలవిల్లాడే మనిషి' ప్రతిమనిషికీ ఒకరుంటే.... మహాకవి రవీంద్రుడు చెప్పినట్టుగా 'ప్రపంచమంతా విశ్వవిభుని ప్రేమ మందిరం' అవుతుంది.

కాని అలా ఎందరుంటారూ ?

ఈ కాలంలో ఆప్యాయత

'నువ్వు నన్ను ప్రేమిస్తే నేను నిన్ను ప్రేమిస్తాను' అనే 'ఒప్పందం' అయింది.

ఇచ్చిపుచ్చుకునే వ్యాపారం అయింది.

డబ్బుతో కొనుక్కునే 'వస్తువు' అయింది. జీవితమే కాదు ఆప్యాయత కూడా యాంత్రికమై పోయింది.

ఇలాంటి రోజుల్లో మీరు చెప్పినట్టుగా ఎప్పుడూ ఒకే స్థాయిలో ఆప్యాయతని పంచిపెట్టే వ్యక్తులు ఉంటారా ?

ఉంటే నిజంగా, మీరన్నట్టు వాళ్ళకి మోకరిల్లవలసిందే !

ఏదేమైనా...

మోహిని - దేవతలకి మాత్రమే అమృతాన్ని పంచితే, మీరు....
పాఠకులందరికీ 'ఆప్యాయత' అనే అమృతాన్ని పంచారు !

***- ఇందిరాదేవి,గాగిల్లాపూర్. (తేదీ: 16-2-1995)***

★ మనం రోజూ చూస్తూనే అనుభవిస్తూనే మనకే తెలీని కొన్ని విషయాల గురించి, మానవతా విలువల గురించి ప్రతీ పక్షం సంపాదకీయం రాయడం సూపర్బ్! ఈ పక్షం 'ఆప్యాయత' అనే మాటకు సరయిన అర్థం చెప్పారు సంపాదకులు. అందులో కొన్ని వాక్యాలు ప్రతి హృదయం స్పందించేలా ఉన్నాయి. ఉదాహరణకు "మల్లెపూల... చందనాల కలబోత.... ఆప్యాయత" వాక్యం అద్భుతంగా ఉంది.

***- సి హెచ్.సౌజన్య, నెల్లూరు (తేదీ: 1-3-1995)***

## అందం:

★ *'**అందం**'గురించి అమృతలత గారు చెప్పిన తీరులో ఆత్మవిశ్వాసం తొంగి చూసింది. చెప్పదలిచిన విషయాన్ని ముక్కుసూటిగా మోమాటం లేకుండా చెప్పటం విశేషం!*

*ఎక్కడ మొదలై - ఎలా మెలికలు తిరిగి, చివరికి 'అందం' ఎలా ముగిసింది ! - ఆశ్చర్యంగా వుంది.*

*బహువిషయ పరిజ్ఞానాన్ని క్లుప్తీకరించటంలో ఎక్కడా కించిత్ అప్రస్తుతం కానీ, అస్పష్టత కానీ గోచరించ లేదు. సడలిపోని 'పటుత్వం - బిగి' రచనకు జీవం పోశాయి.*

*భాష, పదాల కూర్పు - ఒద్దిక - భావప్రకటన, అన్నీ కలిసిన శైలి... ఓవరాల్‌గా 'అందం'లో 'నిలువెత్తు అందం' కనబడింది. ఇది అందం కాదు - మనిషి హృదయానికి అద్దం!*

*'నిజమైన అందం ఆ మనిషి తాలూకు విజయం, సంస్కారం' అన్నారు.*

ప్రతివాళ్లూ విజయాన్ని పొందలేరు. అంతమాత్రం చేత అందం వుండదా? వుంటుంది... ఆ మనిషిలో సంస్కారం వున్నప్పుడు ! అందుకే కేవలం 'విజయం' అనే మాటతో సరిపుచ్చక 'సంస్కారం' అనే విలువైన మాటని జతచేసి.... రచనలో 'బాగాలేదు' అనటానికి ఎక్కడా... ఏ కోశానా ఆస్కారం లేకుండా చేశారు. ఆసాంతమూ పకడ్బందీగా సాగిందీ రచన.

కనిపించే అందాన్ని మెచ్చుకున్నట్టే మెచ్చుకుని - కనిపించని 'అందం' (బిహేవియర్) లోతులకు వెళ్ళి, దాన్ని వెలికి తెచ్చి, కళ్ళ ముందు నిలపటంలో కృతకృత్యులయ్యారు.

'గుర్తింపు - గ్లామర్ - గౌరవం' వీటి మధ్య గల పలుచని తేడాని సున్నితంగా విడదీసి - 'కేవలం గుర్తింపు కోసమే తాపత్రయపడ్తే చూసే వాళ్ళకి 'వికారం'గా వుంటుంది' అని నేర్పుగా చెప్పారు.

చెప్పేది (రాసేది) ఏదైనా పఠితలు ఆ రచనతో ఏకీభవించినపుడు - ఆ రచన విజయాన్ని సాధించినట్టే!

**కిరణ్‌బాల, ఆర్మూర్.**

## సంస్కారం:

★ మీరు రాసిన 'సంస్కారం' సింప్లీ సూపర్బ్. నాకు పత్రికలకు లెటర్స్ రాసే అలవాటు ఎప్పుడూ లేదు! కానీ నిజంగా మనసుకు నచ్చినపుడు రాయక పోవడం కూడా ఆత్మవంచనని మీ ఎడిటోరియల్ చదివాక అన్పించింది. కేవలం మీ ఎడిటోరియల్ చదవడానికోసమైనా పత్రికని రూ. 6/- పెట్టి కొనుక్కోవచ్చునిపిం చింది!

**- భారతి, హైదరాబాద్. (తేదీ: 1-5-1995)**

★ ***01-04-1995*** నాటి సంచికలోని 'సంస్కారం' ఎడిటోరియల్ బావుంది. ఎదురుగా కన్పించినపుడు ఎక్కడలేని ఆప్యాయతను

కనబరుస్తూ చాటుగా వాళ్ళ గురించి అసహ్యంగా మాట్లాడే ఘరానా పెద్ద మనుషులకి మీ సంపాదకీయం చెర్నాకోలా దెబ్బలా ఉందంటే అతిశయోక్తి కాదు.

అయితే... సంస్కారాన్ని విశ్లేషించగలిగిన మీరు 'చెప్పుడు మాట'లపై కూడా మీ దృష్టి సారిస్తే.... ఇంకా బావుండేదేమో? ఎందుకంటే.... వినేవారు చెప్పేవాడికి లోకువ... అన్నట్లు తమ ప్రాపకం కోసం గానీ తమ పబ్బం గడుపుకోవడం కోసం గానీ.. వాస్తవాలని వక్రీకరించి చెప్పే వాళ్ళ చెప్పుడుమాటలకు చెవులప్పగించే బలహీన మనస్తత్వమున్న వాళ్ళనెందర్నో మనం ప్రతిరోజూ చూస్తూ ఉంటాం! అంతవరకైతే ఫరవాలేదు మనకెందుకని సరిపెట్టుకోవచ్చు.... వాళ్ళను చూసి జాలిపడొచ్చు... కాని అలాకాక చెప్పుడుమాటలను విన్నవాళ్ళు వ్యక్తిగత ద్వేషాలు పెంచుకుని... వ్యక్తుల మధ్య అంతర్లీనంగా ఉండాల్సిన 'అభిమానం' తెంచుకుని... వాళ్ళ పరిధిని సంకుచిత పరుచుకోవడం కూడా ఒక రకంగా పలాయనవాదమనిపించు కుంటుంది !

**- జయశీల, కామారెడ్డి (తేదీ: 1-5-1995)**

★ ఎడిటర్ గారి 'సంస్కారం' సంపాదకీయాన్ని విశ్లేషిస్తూ జయశీల గారు రామాయణంలో పిడకల వేటలా 'చెప్పుడు మాటల' ప్రస్తావన తీసుకుని వచ్చి, ఆ చెప్పుడు మాటలు కల్గించే ప్రభావాన్ని అసమగ్రంగా - నాణానికి ఒకవైపునే చూపించే ప్రయత్నం చేశారనిపించింది.

మన భుజం భుజం రాసుకుని తిరిగిన వాళ్లే మనల్ని నల్గుర్లో 'చెడు'గా చిత్రీకరిస్తున్నారన్న 'వాస్తవం' తెలిసికూడా - 'సరే చెప్పుకోనీ' - 'నవ్వితే నల్గురూ నవ్వుకోనీ' అనుకుంటూ వాళ్ళపట్ల మన అభిమానాన్ని తుంచుకోకుండా ఇంకా దాన్ని పదిలంగా

కాపాడుకోవాలని ప్రయత్నించడం మన తెలివితక్కువతనం.

ఏదేమైనా ఎడిటర్ గారు పాఠకుల మెదళ్ళకి పదును పెట్టే అంశాలను ఎన్నుకుంటూ - ఇలాంటి చర్చల్లో మాలాంటి పాఠకుల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోన్నందుకు మహదానందంగా ఉంది !

***- కె. రజని, నల్గొండ (తేదీ: 1-5-1995)***

## మానవత్వం:

★ *'మానవత్వం' గురించి మీ వివరణ - మనుషుల మనుసుల్లోని మాలిన్యాన్ని కడిగేసేదిగా - మది నిండా మంచితనాన్ని నింపేదిగా, కష్టాల కడలిలో కొట్టు మిట్టాడుతోన్న అసహాయులకు, అశక్తులకు, ఆప్తులకు అభయ హస్తం అందించి ఆదుకోవాలన్న ఆలోచన ఆవిర్భవింపజేసేదిగా ఉంది.*

*మానవత్వాన్ని వెన్నతో, వెన్నెలతో పోల్చడం అద్భుతంగా ఉంది. సంపాదకీయంలో మానవత్వపు విలువలకి మీరిచ్చే ప్రాధాన్యత ప్రబోధాత్మకంగా, సృజనాత్మకంగా, ప్రశంసనీయంగా ఉంది. మీరు ఎన్నుకునే అంశాలు, వాటి సమగ్ర విశ్లేషణ పాఠకులను ఎంతో ప్రభావితం చేస్తూ, ఆలోచనను రేకెత్తిస్తున్నాయి ! మీరు కురిపిస్తోన్న ఈ అమృతపు జల్లులను పాఠకులందరూ ఆనందంగా ఆస్వాదిస్తారన్న విషయం అవాస్తవం కాదు.*

***- రంగినేని మురళీధర్ రావు, నిజామాబాద్. (తేదీ: 1-5-1995)***

★ *'మానవత్వం' గురించి అద్భుతంగా రాశారు ! అందులోని ప్రతిమాటా ఆలోచించవలసిన విషయమే. అన్ని జన్మల కంటే మానవ జన్మ ఎంతో ఉన్నతమైనది. పుట్టిన ప్రతి జీవికీ మరణం*

తప్పదు. అయినా మనిషి ఈ రకంగా తయారవటం ఆశ్చర్యకరం, బాధాకరం!

**- నానక్ సింగ్, నిజామాబాద్. (తేదీ: 1-5-1995)**

## దాతృత్వం:

★ 'దాతృత్వం' ధనవంతులను ఆలోచింపజేసేలా ఉంది!

**- కె. రామారావు, మొగల్తూరు. (తేదీ: 1-7-1995)**

## ప్రదర్శన:

★ 'ప్రదర్శన'లో చివరిరెండు వాక్యాలు అమృతలత గారి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించాయి! విస్తృత విషయాన్ని కుదించి, అప్రస్తుతానికి తావు లేకుండా షార్ట్ అండ్ స్వీట్‌గా చెప్పగలిగే ఆ రచనా నైపుణ్యానికి అచ్చెరువొందుతున్నాం. ఒక్క వాక్యంలో అనేకాంశాలకి సంబంధించిన 'ప్రదర్శన'లు ప్రస్తావిస్తూ.. దృష్టి రాజకీయాలవైపు మళ్ళించి అధినేతలకు చక్కని 'చురకని' మెత్తగా అంటించారు!

**- కిరణ్ బాల, ఆర్మూర్. (తేదీ: 16-7-1995)**

## స్వేచ్ఛ:

★ ఎడిటోరియల్ 'స్వేచ్ఛ' సొంతిల్లుతో ప్రారంభించడం బావుంది. 'స్వాతంత్ర్య జెండా రెపరెపల్లో బానిస సంకెళ్లే కన్పిస్తాయి. సొంతిల్లు కూడా పరాయి ఇల్లే అన్పిస్తుంది' అన్న మాటలు బావున్నాయి. కొందరి జీవితాలకు అవి దగ్గరగా వున్నాయి!

'స్వేచ్ఛలేని చోట ప్రేమ అంతర్ధానమవుతుంది. స్వేచ్ఛను మించిన వరం మనిషికి మరోటి లేదు' అనే మాటలు కాచి వడబోసిన జీవిత సారాన్ని తెలియజేస్తున్నాయి. ఎడిటోరియల్ చివరి రెండు కొటేషన్స్ పత్రికకే వన్నె తెచ్చేవిగా ఉంటాయి. అయితే చిన్న సూచన! మొత్తం ఎడిటోరియల్.... చివరి రెండు లైన్లయినా ఎడిటర్‌గారి హస్తాక్షరాలతో లిఖించి ఉంటే....... అంత గొప్ప విశ్లేషణ చేయగలిగిన

ఎడిటర్‌గారి దస్తూరీ చూడగలిగే భాగ్యం పాఠకులకు దక్కేది.

**- రవి కుమార్, హైదరాబాద్. (తేదీ: 1-9-1995)**

★ 'దేశాలూ, మనుషులే కాదు మనసులు కూడా స్వేచ్ఛకోసమే ఆరాటపడ్తాయి, పోరాడుతాయి, తపస్సుచేస్తాయి!' వారేవా.... క్యా సెంటెన్స్ హై! ఒక్కో వాక్యానికి లక్షలు కుమ్మరించాలన్నంత ఆనందం కలుగుతోంది.

**- ఇందు, బోధన్. (తేదీ: 1-9-1996)**

## ఆశావాదం:

★ అమృతలత గారి 'శైలి' విలక్షణంగా ఉంది. చెప్పాల్సిన సందేశాన్ని క్లుప్తంగా వివరిస్తున్నారు. ఒక అంశంపై పలువురి అభిప్రాయాలు ఏ విధంగా ఉంటాయో రకరకాల దృక్కోణాలను పేర్కొనడం, సమాజ సహజ రీతిని కూడా వివరించడం, చివరికి తను చెప్పాలనుకునే సందేశాన్ని క్లుప్తంగా ఒక మెరుపులా అందజేయడం అద్భుతంగా ఉంది.

శిల్పంపై అమృతలత గారి ప్రతిభకు 'ఆశావాదం' ఒక మచ్చుతునక, వ్యక్తులు నిత్య జీవితంలో ఎదుర్కొనే నిరాశావాదానికి కారణాల్ని మూలంతో సహా అమృతలత గారు పట్టుకున్నారు. వైఫల్యానికి కారణం కృషి లోపం, అనుభవ రాహిత్యమే కారణాలని చెప్పడం హర్షణీయం. 'పశుపక్ష్యాదులే ఎవరి 'ఆసరా' లేకుండా జీవిస్తున్నప్పుడు 'మానవుడు' విలక్షణజీవి... సుఖంగా జీవితాన్ని జీవించలేడా ? ఆశావాదం... అందుకు దివ్యౌషదం' అని అమృతలత గారు చక్కగా సెలవిచ్చారు.

**జి. నిఖిల ప్రణతి, కేరాఫ్: పావనీ స్టడీ సర్కిల్, నేరడుచెర్ల, జిల్లా: నల్గొండ.**

★ "విరక్తి వ్యక్తిని శక్తి హీనుణ్ణి చేస్తుంది. నిస్పృహ జాతిని నిర్వీర్యం చేస్తుంది. 'మనసుని చైతన్యవంతం చేయగల దివ్యౌషదం... ఆశావాదం" అంటూ ఎడిటర్ గారు తమ సంపాదకీయంలో వ్యక్తిని కార్యోన్ముఖుణ్ణి చేసే సందేశాన్ని అందించారు.

**- గర్భకుర్తి రాజేంద్ర (తేదీ: 16-9-1995)**

★ 'ఆశావాదం' ఎంతో బావుంది. ఆఖరి నాలుగు వాక్యాలు బావున్నాయి. చాలా రోజుల తర్వాత మనుసుకు నచ్చిన సంపాదకీయం ఇది.

**- శ్రీనివాస్ రావ్ (తేదీ: 1-10-1995)**

## దృష్టి:

★ మీ సంపాదకీయం 'దృష్టి' - విస్తృత పరిశీలన చేసి వ్రాసినట్టుగా వుంది. మానవులకు ఎప్పుడు ఎలాంటి దృష్టి ఉండాలో ఎంతో గొప్పగా తెలియజేశారు.

మీ సంపాదకీయాల్లో మంచి మనో విశ్లేషణ వుంది. మనిషి నేర్చుకోవాల్సింది ఎంతో వుందని మీ సంపాదకీయాల ద్వారా తెల్సుకుంటున్నాం. మీకు మా కృతజ్ఞతాభివందనాలు.

**- జి.ఎ. మనోజ్ఞ, నిజామాబాద్. (తేదీ: 1-11-1995)**

★ సంపాదకీయం 'దృష్టి' చదువుతోంటే మనుషులకు ఎలాంటి దృష్టి ఉండకూడదో, ఎలాంటి దృష్టి ఉండాలో తెలిసింది. మనోవిశ్లేషణ, మానవప్రవర్తనలకు సంబంధించిన సంపాదకీయాలు రావడం చాలా అరుదైన విషయం.

**- గర్భకుర్తి రాజేంద్ర, కామారెడ్డి (తేదీ: 1-10-1995)**

★ పేజీ తెరవగానే పాఠకుల దృష్టి అంతా ఎడిటోరియల్ మీదే ఉంటుంది. ఈ పక్షం తీసుకున్న ఎడిటోరియల్ 'దృష్టి' చాలా బావుంది.

**- కె. సన్యాసి రాజు, ఆర్మూర్. (తేదీ: 1-10-1995)**

## శ్రమ:

★ *అమృతలతగారి 'శ్రమ' అత్యద్భుతంగా ఉంది. కనీసం ఒక్క వాక్యం గురించైనా ఎలాగో నిశిత విమర్శ చేద్దామని భూతద్దం పట్టి వెదికినా ఒక్క లైనూ దొరకలేదు. ఇకపోతే అమృత గుళికల్లాంటి పదాలతో చదువరులను ముఖ్యంగా నాలాంటి బద్ధకస్తులను, నిరాశావాదులను ఎంతో ఉత్తేజితులుగా చేస్తూ, సార్థకనామంగా ఈ శీర్షిక అలరారుతోందని చెప్పటానికి నేనెంతో సంతోషిస్తున్నాను. ఎవరికి వారు తమలో ఎటువంటి లోపాలు ఉన్నాయో (పైకి చెప్పకపోయినా) ఆత్మవిమర్శ చేసుకుని వాటిని అభ్యాసంతో దూరం చేసుకుందామని ప్రయత్నిస్తే తప్పక అభివృద్ధి సాధించగల్గుతారు.*

***కె. రమణి కేరాఫ్ : కె. ఎస్. పరబ్రహ్మం, ముంగండ, వయా: అంబాజీపేట, తూర్పు గోదావరి జిల్లా.***

★ *చిన్న చిన్న పనులు చేయడం నామోషీగా ఫీలయ్యే మనుషులు మన సమాజంలో కోకొల్లలుగా వున్నారు. ఈ పక్షం సంపాదకీయంలో అలాంటి మనుషులు దేశాన్ని ఉద్ధరించేది లేకపోగా, దేశానికి ఎలా కంటకాలుగా తయారవుతారో తెలియజేశారు. బ్రతికున్న జీవచ్ఛవాలెవరో వ్యంగ్యంగా చూపించి చురకవేశారు.*

*శ్రమని దోచుకోవటమూ, దాచుకోవటమూ తప్పేనన్న నగ్నసత్యాన్ని తెలియజేస్తూ సోమరితనం మీద కొరడా ఝుళిపించి పనిలో ఉత్సాహంగా కోడెనాగుల్లా దూసుకుపోవాలన్న సందేశాన్ని అందజేస్తూ 'శ్రమవిలువ'కు భాష్యం చెప్పారు! అభినందనలు.*

***- కిరణ్ బాల, ఆర్మూర్. (తేదీ: 16-11-1995)***

★ *ఈ పక్షం 'శ్రమ' సంపాదకీయం చాలా బావుంది. 'శ్రమను దోచుకోవడం ఎంతనేరమో దాచుకోవడమూ అంతే నేరం' అనే పంక్తులు మినీ కవితలా వుంది.*

***- పి. జయపాల్‌రావ్, గుడికందుల (తేదీ: 16-11-1995)***

★ మన దేశంలో 'శ్రమదోపిడి'ని నిరోధించగలుగుతున్నామేమో గానీ, శ్రమశక్తిని వినియోగించని మానవశక్తి గురించి విశ్లేషించే ప్రయత్నాలు దేశంలో ఎక్కడా జరగడంలేదన్న నగ్నసత్యాన్ని కళ్ళ ముందు నిలిపిన ఎడిటర్‌గారి ఆలోచనల్లో సోమరితనం, ఉదాసీనతల వల్ల జాతి నిర్వీర్యమైపోతోందన్న ఆవేదన కనిపించింది. మనిషి తనను తాను బిజీగా వుంచుకుంటే దురాలోచనలు దూరం అవుతాయన్న ప్రబోధం ప్రతి వ్యక్తికీ సదా ఆచరణీయం.

**- పి. జయపాల్‌రావ్, గుడికందుల (తేదీ: 1-3-1996)**

## అంకితభావం:

★ 'శ్రమ' ఒక 'యాంత్రిక పరిశ్రమ'కి సంబంధించిందైతే **'అంకితభావం'** 'హృదయస్పందన' కి సంబంధించిందని నా అభిప్రాయం. పూవుకి తావిలా శ్రమకి అంకితభావం విలువనిస్తుంది.

ఏ 'ఇజం' అయినా ఆదర్శాలు బానేవుంటాయి. కానీ ఆచరణలో 'అంకితభావం' లోపిస్తుంది. అందుకే ఈ ఇజాలు బలంగా, స్థిరంగా పాతుకుపోలేకపోతున్నాయి. ఈ ఇజాల నిజాన్ని నిర్భయంగా వెల్లడించిన ఘనత అమృతలత గారికే దక్కింది.

దేశానికి కావల్సింది ఊహాలోకాల్లో విహరించేవాళ్లూ, సిద్ధాంతాల్ని వల్లె వేసే వాళ్ళూ...కాదు! కష్టించి పని చేసేవాళ్ళు!

మేధావులూ, రాజకీయనాయకులూ, మహామహావక్తలూ ఉపన్యాసాలిస్తారు. చాలామంది ఎక్కడో మొదలెట్టి ఎక్కడెక్కడికో వెళ్ళిపోతారు.

అమృతలత గారు తమ రచనలో 'అంకితభావం' యొక్క ఆవశ్యకతని ఎక్కడా 'లింక్' తెగనీకుండా - ఎలాంటి ఆవేశానికీ లోనుకాకుండా - మొదలెట్టిన దగ్గర్నుండీ చివరంటా చాలా కన్విన్సింగ్‌గా చెప్పగలిగారు. అద్భుతం!

**హరి మానస, రెడ్డి కాలనీ, హన్మకొండ.**

## నిజాయితీ:

★ *'నిజాయితీ'* పై మీరు ఇచ్చిన నిర్వచనం బాగుంది. "ఎవరూ చూడనప్పుడు నీ వ్యక్తిత్వం ఎలా ఉంటుందో అదే నీ అసలైన మనస్తత్వం" - అంటుంటారు.

"మెప్పుకోసమో, భయం కోసమో కాక తన పనిని తాను సజావుగా చేసుకోనేది నిజాయితీ' అన్న మీ మాటలు ఆణిముత్యాలు.

ఇలాంటి నిజాయితీ ఉంటే దేశం ఎలా ప్రగతిలోకి వస్తుందో... నిజాయితీగా ఊహించటమే ఆనందంగా వుంది.

క్లుప్తత, ఆర్ద్రత వున్న ఈ రసగుళికలు చిరుచైతన్య దీపాలు!

**టి. రవికుమార్, రాణిపేట్, గూడూరు, నెల్లూరు జిల్లా**

★ మీ సంపాదకీయాలు చాలా బావుంటున్నాయి. వాటిని గురించి వర్ణించడానికి, వివరించడానికీ నాకున్న జ్ఞానం సరిపోదని భావన! నేనూ, మా మిత్రులూ తరచూ మీ సంపాదకీయాల గురించి చర్చించుకుంటాము. మీ సంపాదకీయం 'నిజాయితీ' చదివిన తర్వాతే ప్రత్యేకంగా మొదటి సారిగా ఈ ఉత్తరం రాయాలనిపించింది. మనసులో ఏదో నిర్లిప్తత ఆవరించిన క్షణాల్లో మీ సంపాదకీయాలు ఎంతో ఊరటనిస్తున్నాయి. అందుకు మీకు కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నాను. మీ సంపాదకీయం 'శ్రమ' చదివాక -

"శారీరక - మానసిక శ్రమలను వేరుచేసి చూపలేదు" అని ఒక మిత్రుడన్నాడు.

"అప్పుడు 'అసలు విషయం' పక్కతోవ పడుతుంది కనుక చెప్పాల్సిన దానిని సూటిగా, చక్కగా చెప్పారు" అన్నాను.

ఇక 'అంకితభావా'నికి వస్తే -

"ఒళ్లు దాచుకోకుండా శ్రమిస్తే - అందులో అంకితభావం

వుండదా? 'శ్రమ దాచుకోవద్దు' అని చెప్పినపుడు 'అంకితభావం' అంటూ మరో సంపాదకీయం దేనికి?" అని చర్చ జరిగింది.

"ఏదైనా ఒక శ్రమలో యాంత్రికత వుండవచ్చు ! అదే పని ఇష్టపూర్వకంగా చేస్తే 'అంకిత భావం' వున్నట్టు అవుతుంది." అన్నాను.

పోతే ఇప్పుడు 'నిజాయితీ' సంపాదకీయం విషయంలోకూడా- 'అంకితభావానికీ, నిజాయితీకి పెద్ద తేడా లేదు"- అంటూ నాతో వాదనకి దిగుతున్నారు... సాహితీ మిత్రులు.

"మొక్కుబడిగానో, గుదిబండగానో పనిని వదిలించుకోవాలని చూడకుండా శ్రమని తమ విద్యుక్త ధర్మంగా భావించిచేస్తే, అదే నిజాయితీ అవుతుంది' అని చెప్పాను.

"ఆమె సంపాదకీయాలకి నువ్వు టీకాతాత్పర్యాలు రాసేలా వున్నావే" అని నవ్వుతూ అంటున్నారు.

తల్లీ మీ సంపాదకీయాల ద్వారా జీవితంలో ఎన్నడూ పొందనంత ఆనందానుభూతిని పొందుతున్నానంటే నమ్మండి.

**- వెంకటశివసాయి ప్రసాద్, సికింద్రాబాద్. (తేదీ : 1-3-1996)**

★ సంపాదకీయం 'నిజాయితీ' నిజంగా 'ధర్మో రక్షతి రక్షిత'ని నిజం చేసింది. ఎవరి ధర్మం వారు నిర్వర్తిస్తే మనదేశం సుభిక్షం అవుతుంది.

**- కాశీనాథ & కాశీనాథ, ఒంగోలు (తేదీ: 1-3-1996)**

★ 'నిజాయితీ'కి సరైన నిర్వచనం చెప్పారు. నిజాయితీ లోపిస్తే ఎలా వుంటుందో కళ్ళకు కట్టినట్టుగా చిత్రీకరించడమే కాక ఏది నిజాయితీయో స్పష్టంగా విశదీకరించారు.

'పర్సనల్ పనివుంటే, ఆఫీస్‌పని' కల్పించుకుంటారు -

అనేమాట అక్షరాలా నిజం! నిజాన్ని నిర్భయంగా ముక్కుసూటిగా చెప్పే సాహసం అమృతలత గారికే వుందేమో! అభినందనలు.

**- కిరణ్‌బాల, ఆర్మూర్. (తేదీ: 1-3-1996)**

## సాంత్వన:

★ 'సాంత్వన' చదివిన తరువాత ఆశ్చర్యపోయాను. అతి తక్కువ అక్షరాలతో వాస్తవ సంఘటనలను విశ్లేషిస్తూ రాస్తోన్న ఎడిటర్ గార్కి మా అభినందనలు. ఈ సంపాదకీయాలన్నీ ఒక పుస్తకంగా చేస్తే బావుంటుందని మా అభిప్రాయం.

**- పి. చంద్రశేఖర్, ఆర్. ఆశాలత, తిరుపతి (తేదీ: 16-3-1996)**

★ సంపాదకీయం 'సాంత్వన' బావుంది! ప్రియమైన వాళ్ళని శాశ్వతంగా కోల్పోయినపుడు కలిగే దుఃఖం వర్ణణాతీతం ! అయితే ప్రియమైన వాళ్ళు దూరమైపోతున్నప్పుడు కలిగే దుఃఖం చెప్పనలవికానిది. అంతకంటే మరణమే మేలు అన్పిస్తుంది. మనిషికి బ్రతుకులో అనేక సందర్భాల్లో 'సాంత్వన' కావాలి!

యంత్రాల్లా జీవితం సాగించే వాళ్ళుంటారు. వాళ్ళుకూడా 'సాంత్వన'ని కోరుకుంటారా ? పని పట్ల ఉన్న మక్కువ వారికి ఇతర విషయాల పట్ల ఉండదేమో !?

**- ఇందూప్రియ, హన్మకొండ. (తేదీ: 16-3-1996)**

★ 'సాంత్వన' అలసిన హృదయాలకు సాంత్వన నిచ్చేదిగా ఉంది. బాధలో, కష్టంలో, ప్రమాదంలో, చిరాకులో, ఆప్తులకి దూరమైన ఆవేదనలో 'సాంత్వన' చదివి, 'సాంత్వన' పొందవచ్చు. ఎడిటర్ గారికి కృతజ్ఞతలు.

**- రవికుమార్, హైదరాబాద్.**

**(తేదీ: 1-4-1996)**

## చౌరవ:

★ *'చౌరవ' అద్భుతం. ఎంతో ఆలోచింపచేసేదిగా ఉంది.*

***- కంటంపల్లి, సన్యాసి రాజు, ఆర్మూర్. (తేదీ: 16-5-1996)***

## స్పృహ:

★ *పుస్తకాలను చదవడం చాలా సులభం ! చదవడం తెలిసిన ప్రతి ఒక్కరూ చేయగలరు. కానీ 'మనుషుల్ని' చదవగలగడం... సునిశిత దృష్టితో ప్రతీ చిన్న విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించగలగడం... నేర్పున్న అతికొద్దిమందికే సాధ్యం.*

*అమృతలతగారి పరిణతి చెందిన పరిశీలనా దృష్టిని ప్రతిబింబించిన మరో మంచి రచన 'స్పృహ' ! నవనాగరికుణ్ణంటూ మురిసిపోయే మానవుడి అనాగరిక రూపాన్ని అతి చక్కగా ఆవిష్కరించారు.*

*సభ్య సమాజంలో సంఘజీవిగా మసలుకొనే ప్రతి మనిషీ... కనీస 'సభ్యత'ని కలిగి ఉండడం అనివార్యమన్న విషయాన్ని చాటిచెప్పే 'స్పృహ', ని.... పదికాలాల పాటు పదిలంగా దాచుకోవడమే కాకుండా.... ప్రతి ఒక్కరి చేతా చదివించి తీరాలి.*

***గరిమెళ్ళ నాగేశ్వరరావ్, చోడవరం, విశాఖ జిల్లా.***

★ *సంపాదకీయం 'స్పృహ' స్పృహలేని మానవులకి స్పృహ తెప్పించేదిగా వుంది. మొదట 'స్పృహ' అని చదవగానే మాకు తెలిసిన 'స్పృహ' ఏదో మెదడులో తళుక్కున మెరిసింది. ఆసాంతం చదివాక 'ఓహో, స్పృహ అంటే ఇదా ?' అని స్పృహలోకి వచ్చాం! మీ సంపాదకీయాలు కొన్ని - నిద్రపోతోన్న పాఠకుల్ని తట్టి లేపుతాయి! మరికొన్ని - చెళ్ళున కొట్టి లేపుతాయి! నిద్రలేపటంలో వెరైటీ ఉన్నా మేల్కొల్పటమే ఆశయంగా ఉన్న ఇలాంటి సంపాదకీయాలను ఇలాగే నిర్విఘ్నంగా*

కొనసాగించాలని కోరుకుంటున్నాము.

*- జి. ఉమాదేవి, జి. పార్వతి, సికింద్రాబాద్. (తేదీ: 1-6-1996)*

★ 'స్పృహ' సంపాదకీయంలో చూసేవాళ్ళ కడుపులో దేవినట్లు చేసే పనుల గురించి ఉన్నవి ఉన్నట్లుగా చెప్పారు. అలాంటివాళ్ళు మనకు అడపాదడపా ఎదురౌతుంటారు ! 'అలా చేస్తే బావుండదు' అని వారికి చెప్పటానికి మోమాటం అడ్డొస్తుంది. ఎలాంటి మోమాటం లేకుండా ఎడిటర్‌గారు పై విషయాలు ప్రస్తావించటాన్ని మెచ్చుకోవల్సిందే ! నోరు విప్పి చెప్పలేని ఇలాంటి విషయాల్ని అలాంటి వాళ్ళకి 'స్పృహ' సంపాదకీయం చూపించి - చదవమని చెప్పాలనిపిస్తోంది !

*- జి. ఎ. మనోజ్ఞ, నిర్మల్ (తేదీ: 1-7-1996)*

★ 'సానుభూతి'లో విలేకరులకీ - 'స్పృహ'లో పత్రికాధిపతులకీ - మెత్తగా 'చురకలు' అంటించారు.

*- రవి కుమార్, హైదరాబాద్. (తేదీ: 1-7-1996)*

## విమర్శ:

★ తమ గురించి చెడుగా ఇతరుల నోట ఎవరూ వినటానికి ఇష్టపడని ఒకేమాట - విమర్శ ! దాని గురించి సున్నితంగా, విమర్శనాత్మకంగా తన భావాలను వ్యక్తీకరించిన అమృతలత గారు అభినందనీయులు.

*- స్వరూప, ఆర్మూర్. (తేదీ: 16-8-1996)*

## నిగ్రహం:

★ 'నిగ్రహం' హుందాగా వుంది! చిన్న సమస్యకే బావురుమనే బేలతనంగల మనుషులూ, పిడుగులు పడ్డా చలించని ధీరులూ పరస్పరం స్నేహితులైతే ఎలా ఉంటుందంటారు? ఆ బేలలకి లాలన కావాలి. ఈ ధీరులు ఇవ్వరు...! ధీరులకి ఏడ్చే వాళ్ళని చూస్తే చెడ్డ చిరాకు ! ఇది నిత్య సంఘర్షణగా ఉంటుందేమో!

మీ 'నిగ్రహం' చదివాక ప్రతిమనిషీ... తాను 'దున్నపోతు'లా బతుకుతున్నాడా - 'అభిమానహీనుడి' గా బతుకుతున్నాడా?... ఆవేశంలో 'రాక్షసుడ' నిపించుకుంటున్నాడా అని 'ఆత్మవిమర్శ' చేసుకోవాల్సిన అవసరం ఏర్పడ్తుంది.

**- వేణూమాధవ్, కర్నూలు. (తేదీ: 16-8-1996)**

## సమన్వయం:

★ 'సమన్వయం' రియల్లీ సూపర్బ్ ! సమన్వయ కర్తకి 'సంయమనం' ఉండాలన్నమాట అక్షరాలా నిజం!

**-నయనతార, కస్బాగల్లి, నిర్మల్. (తేదీ: 1-9-1996)**

★ 'సమన్వయం' అనేది లేకపోతే - ఏ సంస్థ ఐనా పైకెదగదని చక్కగా రాసిన అమృతలత గారికి అభినందనలు.

**- పి. మౌనిక, వడ్లమూరు. (తేదీ: 1-11-1996)**

## కుతూహలం:

★ 'కుతూహలం'... పత్రికా మౌక్తికహారానికి మణిపూసలా విరాజిల్లింది. ఎదుటివాడి క్షేమసమాచారం విషయంలో ఆదుర్దాపడటం మానవత్వమనిపించుకుంటే ఎదుటివాడి కూపీలు లాగి... దుష్ప్రచారం చేసి.. హింసించటం దానవత్వ మనిపించు కుంటుందని చదివి ఆశ్చర్యపోయాం, ఆ మనోవిశ్లేషణ చాతుర్యానికి, 'వహ్వ ఏం కరెక్ట్ రాసారండీ ఎడిటర్‌గారు ' అని మళ్ళీ ఆశ్చర్యపోయాం !

"పైసా ఖర్చులేకుండా పదినిమిషాల్లో ప్రజల నాలుకల మీదుగా ప్రపంచాన్నంతా చుట్టివచ్చే ప్రచారసాధనం - గాసిప్స్ !"

ఎక్స్‌లెంట్‌గా ఉంది !

ఓ గొప్ప సెయింట్ నోటినుండి వెలువడ్డ సేయింగ్స్‌లా ఉన్నాయి ! ఏమైనా అమృతలత గారు మాంచి తాత్వికులు!

**- ఎ. మల్లారెడ్డి, ముప్కాల్. (తేదీ: 1-11-1996)**

★ ప్రతి మనిషికి పక్కవాడి విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఉండడం సహజం. ఆ ఆసక్తి ఉబలాటంగా మారితే క్షమించరాని నేరమంటూ 'కుతూహలం' ఎడిటోరియల్‌లో చక్కగా చెప్పిన ఎడిటర్ గారికి మా హృదయపూర్వక అభినందనలు!

**- ఎస్. శేషాచలం, రాజమండ్రి (తేదీ: 1-11-1996)**

## నమ్మకం:

★ 'కొందరు అభద్రతాభావం వల్ల ఎవ్వర్నీ విశ్వసించక, నిజమైన స్నేహితుల్ని కోల్పోతారు - అమాయకత్వం వల్ల అందర్నీ నమ్మి గొంతు మీదికి తెచ్చుకుంటారు మరికొందరు,' అని పరస్పర విరుద్ధ మనస్తత్వాల్ని విశ్లేషించిన అమృతలత గారి అభిప్రాయం ఏమిటా?' అనుకుంటే.....

' 'ఎదుటివాళ్ళని నమ్మాలా వద్దా అని తర్కిస్తూ కూర్చోక, నమ్మి మోసపోయినా ఫర్వాలేదు" అన్న భావం వ్యక్తమైంది.

ఇక్కడో విషయం ఆలోచించాలి ! "పద్దాకా సందేహిస్తూ పోతే మంచి వాళ్ళని దూరం చేసుకుంటామేమో... 'మంచి' ని స్వీకరించాలంటే కొంత చెడుని భరించాలి... తప్పదు" అన్న సందేశం కనిపిస్తోంది.

ఇది అసలు ఎంత మందికి సాధ్యం?

'నమ్మదగని వాడ్ని నమ్మినవాడు మూర్ఖుడు' అని సుభాషితం సెలవిస్తే - 'కొత్తగా వచ్చిన వారిని నమ్మరాదు'అని పంచ తంత్రం ప్రభోదిస్తుంది.

అయినా తన దగ్గరికొచ్చే ప్రతివాడు 'పాపం... మంచివాడే' అనుకొనే మంచివాళ్ళూ వుంటారు నూటికో.... కోటికో ఒక్కరు ! ఇది ఉత్తమోత్తముల లక్షణం ! అయితే ఇలాంటి 'ఉత్తమోత్తముల' కి

కూడా నమ్మకద్రోహం తలపెట్టేవాడు.... 'అధమాధముడు' అనక తప్పదు.

ఎదుటివాళ్ళని నమ్మాలనటంలో అమృతలత గారి మనస్థైర్యం ప్రతిబింబించింది.

(మనలోమాట : ఎంతటి గుండె ధైర్యముంటే అందర్నీ నమ్మగలం!?)

**కిరణ్‌బాల, ఆర్మూర్, జి: నిజామాబాద్.**

★ మీ సంపాదకీయాలన్నీ మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేట్టుగా, షార్ట్ అండ్ స్వీట్‌గా ఉంటున్నాయి. చెప్పదల్చుకున్నది సూటిగా ఒక్క అక్షరం కూడా ఎక్కువ, తక్కువ లేకుండా, మా మనసుకు హత్తుకునేలా ఉంటోంది.

**- కె. సుబ్బలక్ష్మి, సికింద్రాబాద్.** (తేదీ: 1-5-1995)

★ సంపాదకీయాలు చాలా చక్కగా, అర్థవంతంగానూ, ప్రయోజన కరంగానూ ఉంటున్నాయి.

**- మల్లాది పవనశ్రీ, ఎడపల్లి** (తేదీ: 1-5-1995)

★ ఎడిటర్ గారి ఎడిటోరియల్స్ పాఠకులందర్నీ ఎజుకేట్ చేస్తూ, అత్యద్భుతంగా ఉంటున్నాయి, వారికి మా హాట్సాప్.

**- బి. రాజ్యలక్ష్మి, ముప్కాల్.** (తేదీ: 1-5-1995)

★ ఎడిటర్ గారు రాస్తోన్న సంపాదకీయాలు అమృతగుళికల్లా ఉంటున్నాయి. దయచేసి ఈ సంపాదకీయాలన్నీ 'అమృతవర్షిణి' పేర ప్రచురించవలసిందిగా కోరుతున్నాను.

**- వై. మురళీమోహన్, విజయవాడ** (తేదీ: 1-5-1995)

★ మనిషిలో మార్పు రావాలనీ, మనిషి నడవడికి సంబంధించిన విషయాలపై సైకో ఎనాలిసిస్ చేస్తూ అమృతలత గారి సంపాదకీయాలు అద్భుతమైన కొత్త ఒరవడిని సృష్టించాయి.

**-పొన్నాడ కుమార్, బరంపురం.** (తేదీ: 1-6-1995)

★ ప్రతీ వ్యక్తీ ఎక్కడో ఒక దగ్గర 'ఇది నాకు సంబంధించి ఉంది' అని స్పందించేలా - మీ ఎడిటోరియల్స్ ఉంటున్నాయని నా పరిధిలో

ఉన్న మిత్రులందరూ అంటున్నారు.

*రవి కుమార్, హైదరాబాద్. (1-10-1995)*

★ *ప్రబోధాత్మకమైన సంపాదకీయాలు చదువుతోంటే పత్రిక సర్క్యులేషన్ పెరిగి ఆంధ్రులందరూ చదవగలిగితే బాగుండుననే ఆరాటం కలుగుతోంది.*

*- కె.వై. గిరి, తోర్నాల (తేదీ: 1-3-1996)*

★ *నేను ఇటీవల **(5.5.2006)** తారా చౌదరి గారింటికి వెళ్ళినప్పుడు ఆమె అమృతవర్షిణి, స్పందన, సృష్టిలో తీయనిది, స్కూలుపెట్టి చూడు! - పుస్తకాలు ఇచ్చారు.*

*మీ రచనలు ఆణిముత్యాలు. మదిని ముచ్చట గొలిపిన ముద్రణ ఆహ్లాద పరిచింది. మీ చుట్టూ ఉన్న వారిలో మంచితనాన్ని, మంచినే గుర్తించే మీ అమృత హృదయాన్ని ప్రతిబింబిస్తుంది.*

*అభినందనలతో...*

***- తాళ్లూరి జయదేవ్, శాంతినగర్,***